సుందరరాం అండ్ కో
బుక్కు సెల్లర్సు:
బెజవాడ
1925

వాణీ ముద్రాక్షరశాల, బెజవాడ

భాస్కరశతకము.

టీకాతాత్పర్య విశేషార్థసహితము.

పండిత పరిశో

పబ్లిషర్సు:

మారుతిరాం అండ్ కో

శ్రీ రామాయనమః

శ్రీ శారదాంబాయైనమః

భాస్కర శతకము.

టీకాతాత్పర్యసహితము.

ఉ॥ శ్రీగలభాగ్యశాలిఁ గడుఁ జేరఁగవత్తురు తారుదారె దూ
రాగమనప్రయాసమున కాదటనోర్చియునైన నిల్వను
ద్యోగముచేసి రత్ననిలయుండని కాదె సమస్తవాహినుల్
సాగరుఁ జేరుటెల్ల; మునిసన్నుత! మద్గురుమూర్తి భాస్కరా! 1

టీ. మునిసన్నుత=మునులచే స్తుతింపఁబడుచున్నట్టియు, మద్గురుమూర్తి=నాకు గురుస్వరూపుఁడ వైనట్టియు, భాస్కర=ఓ సూర్యభగవానుఁడా, దూరాగమనప్రయాసమునన్=దూరమునుండి యే తెంచుటవలనఁ బుట్టిన శ్రమను, ఓర్చియున్=సహించియు, నిల్వన్=నిలుచుటకు, ఉద్యోగము చేసి=ప్రయత్నమొనరించి, తారు+తారు+ఎ=తమకుతామె, ఆదటన్=అనురాగముచేత, (ప్రేమచేత) శ్రీగలభాగ్యశాలిన్=సంపత్తుఁగల యైశ్వర్యవంతుని, కడున్=మిక్కిలి, (ఎక్కువగా) చేరఁగవత్తురు=సమీపించెదరు, ఎట్టులనఁగా; సమస్తవాహినుల్=సకలనదులును, సాగరున్=రత్నాకరుని (అనఁగాఁ సముద్రుని) చేరుట=సమీపించుట, ఎల్లన్=అంతయు, రత్న=రత్నములకు, నిలయుండని కాదె=స్థానభూతుఁడని యేకదా!

తా. సకలనదులును రత్నాకరుండను యపేక్షతో సముద్రుని గలియు నట్లు పలుకష్టములకోర్చియైనను, ప్రజలు తమంత తామె ప్రేమఁజూపుచు భాగ్యవంతు నింటి కేతెంచుచుందురు.

ఉ॥ అంగననమ్మరాదు తన•యంకెకురాని మహాబలాఢ్యు వే
భంగుల మాయలొడ్డి చెఱు•పందలపెట్టు వివేకియైన సా
రంగధ[illegible]దంబులు క•రంబులుఁ గోయఁగఁ జేసెఁదొల్లి చి
త్రాంగి [illegible]నేకముల్ నుడువ•రానికుయుక్తులుపన్ని భాస్కరా!

టీ. భాస్కరా! తనయంకెకున్=తనవశమునకు, రాని=రానటువంటి, మహాబలాఢ్యున్=మిక్కిలిబలముఁగల వానినైనను, వేభంగులన్=వేయిమార్గములుగా, (అనగా ననేకవిధములననుట) మాయలు=తంత్రములు, పన్ని=కూర్చి, చెఱుపన్=చెడగొట్టుటకు, తలపెట్టున్=తలంచును. కాబట్టి,అంగనన్=స్త్రీని, నమ్మరాదు=నమ్మగూడదు,తొల్లి=పూర్వకాలంబున, చిత్రాంగి=చిత్రాంగియనెడిస్త్రీ, వివేకియైన=జ్ఞానియైన, సారంగధరున్=తనసవతి పుత్రుఁడగు సారంగధరునిగూర్చి,నుడువన్=వచించుటకు, రానికుయుక్తులు=వలనుపడని ఘోరపన్నాగములను, పన్ని=కల్పనఁగావించి, పదమ్ములు=పాదములు, కరంబులు=హస్తములు, కోయఁగఁజేసెన్=ఖండింపజేసినది.

తా. దుర్మతియగు చిత్రాంగి జ్ఞానవంతుడయిన సారంగధరునిమీద లేనినేరము లారోపించి కరచరణములు నఱకించినట్లుగా, స్త్రీలు తమకు లోబడని బల్లిదునైనను వివిధమాయోపాయములు కల్పించి చంపఁజూతురు కావున స్త్రీలను నమ్మఁగూడదు.

ఉ॥ అక్కరపాటువచ్చుసమ•యంబునఁ జుట్టము లొక్కరొక్కరి
న్మక్కువనుద్ధరించుటలు • మైత్రికిఁజూడఁగ యుక్తమేసుమీ

యొక్కటనీటిలో మెరక • నోడలబండ్లును బండ్లనోడలుఁ
దక్కకవచ్చుచుండుట నిదానముగాదె తలంప భాస్కరా! 3

టీ. భాస్కరా! అక్కరపాటు=తగినట్టి యవసరము, వచ్చు సమయంబునన్=వచ్చునట్టి వేళయందు, చుట్టములు=బాంధవులు, ఒక్కరొక్కరిన్=ఒకరినొకరు, మక్కువన్=దయచేత, (ప్రేమచే) ఉద్ధరించుటలు=కష్టములనుండి తొలగించుకొనుటలు, చూడగన్=యోచింపఁగా, (ఆలోచింపగా) మైత్రికిన్=స్నేహమునకు, యుక్తమేసుమీ=తగియున్న వేసుమీ, (ఎట్లనగా) ఒక్కటన్=ఒకకాలమందు, నీటిలో=నీటియందు, ఓడలన్=పడవలమీఁద, బండ్లును=శకటములును, మెరకన్=మెట్ట ప్రదేశమందు, బండ్లన్=బండ్లయందు, ఓడలుఁన్=నావలును, తక్కక=నిలువక, వచ్చుచుండుట=వచ్చుట, తలంపన్=చూడగా, (విచారింపఁగా) నిదానము=తార్కాణము, (ప్రత్యక్షము) కాదె=కాదా! (అగునని యర్థము.)

తా. ఒకొ్కక సమయమందున నీటిలో నోడలపై బండ్లును, మెరక ప్రదేశములయందు బండ్లపై నోడలును, వచ్చుచుండుట నిదర్శనము. అదేవిధముగ లోకంబున బాంధవ్యు లవసరముఁ గలిగినప్పుడు ఒకరినొకరు కాపాడుకొందురు.

చ॥ అడిగినయట్టియాచకుల • యాశలెఱుంగక లోభవర్తియై
కడపిన ధర్మదేవత యొకానొకయప్పుడు నీదు వానిక
య్యెడలనదెట్లు; పాలుతమ,కిచ్చునె యెచ్చటనైన లేగలన్
గుదువఁగనీనిచోఁ గెరలి • గోవులుతన్నునుగాక భాస్కరా! 4

టీ. భాస్కరా! (మానవుడు) లోభవర్తియై = లోభిగుణంబుఁగలవాడై, అడిగినయట్టి యాచకుల యాశలు = అడిగినయట్టి = వాంఛించినట్టి, (కోరునట్టి) యాచకుల=అర్థుల, ఆశలు=కోరికలు, ఎఱుఁగక = తెలిసికొన

జాలక, కడపినన్ = సాగనంపినచో, ఒకానొకప్పుడు = ఒకానొక సమయంబున, వానికిన్ = ఆలోభి మనుజునకు, ధర్మదేవత = దైవము, ఈదు = ఒసగదు, అయ్యెడలన్ = అట్టికాలములయందు, అదెట్లు = అదియెట్లనగా, లేగలన్ = దూడలను, కుడువగన్ + ఈనిచోన్ = కుడువనీయని యెడల, గోవులు = ఆవులు, కెరలి = కోపముగలిగి, తన్నునుగాక = తన్నుచుండునుగాని, పాలుతమకున్ = పాలన్నియు దామె పిదుకుకొనం జూచువారికి, ఇచ్చునే = ఇయ్యకొనునా? (ఈయవు.)

తా. దురాపేక్షంగల మనుజులు లేగలం గుడువనీయక, నావుపాలన్నియుం దామె యారగింపవలెనని ప్రయత్నించు వారి కా యావులు పాలీయవు. అట్లె మనుజుం డత్యాశం గలవాడై తన్ను యాచించినవారికోర్కెలం దీర్పక, వెడలనడిపినచో, నట్టి లోభికి ధర్మదేవతకూడ యొసంగదు.

చ॥ అతిగుణహీన లోభికిం బదార్థముగల్గిన లేకయుండియున్
మితముగఁగాని కల్మిగలమీఁదటనైన భుజింపఁడింపుగా
సతమనినమ్ము దేహమును సంపద నేఱులునిండిపాఱినన్
గతుకఁగఁజూచుఁగుక్క తనకట్టడమీఱక యెందుభాస్కరా!

టీ. భాస్కరా! అతి = ఎక్కువ, గుణ = గుణములచేత, హీన = కొఱంతయగు, లోభికిన్ = లుబ్ధునకు, పదార్థము = ధనము, కల్గినన్ = కలిగియున్నప్పుడు, లేకయుండినన్ = లేనట్టికాలమందును, మితముగన్ = తగినట్లుగా, భుజించును. కాని, కల్మి = భాగ్యము = కలమీఁదటనైనన్ = కలిగినప్పుడైనను, ఇంపుగాన్ = బాగుగా, భుజింపడు = భక్షణ సేయడు, దేహమును కాయమును, (శరీరమును) సంపదన్ = భాగ్యమును, సతమని = నిత్యమని, నమ్మన్ = నమ్మకొనును, ఎట్టులనగా, ఏఱులు = నదులు, నిండి = పరిపూర్ణమయి, పాఱినన్ = ప్రవహించుచుండినను, కుక్క = శునకము, ఎందున్ = ఎచ్చటనైనను,

తనకట్టడన్=తననియమ ప్రవర్తనమును, మీఱక=జవదాటక=(తప్పక) కతు కఁగన్=నాలుకతో కతుకుటకే, చూచున్=నిరీక్షించుచుండును.

తా. ఏఱులునిండి పాఱుచుండినను, జలము తప్పకయైనను, కుక్క తననైజమును విడువక నాలుకతోఁ గతుకఁజూచునుగాని, బాగుగా త్రాగ నేరదు. ఆదేవిధముగా, లోభివానికి సంపదలెన్నియున్నను మితముతప్పక భుజించునేగాని, భాగ్యమున్నప్పుడైనను తనివిదీర భుజింపజాలడు.

చ॥ అదనుదలంచి కూర్చి ప్రజ • నాదరమొప్ప విభుండు కోరినన్
గదిసి పదార్థమిత్తు • రటుకానక వేగమె కొట్టితెండనన్
మొదటికిమోసమౌఁ బొదుగు•మూలముగోసినఁ బాలుగల్గునే!
పిదికినఁగాక భూమిఁ బశు•బృందమునెవ్వరికైన భాస్కరా

టీ. భాస్కరా! విభుండు=రాజు, అదను=సమయకాలమును, తలంచి ఆలోచనఁజేసి, కూర్చి=సంతోషమొందజేసి, ప్రజన్=ప్రజలను, ఆదర ము+ఒప్పన్ = సగౌరవమొదవునట్లుగా. కోరినన్ = (ధనమును, కో రఁగా, కదిసి = (ఆప్రభువును) సమీపించి, పదార్థము= ద్రవ్యము, ఇత్తురు= ఒసంగెదరు, అటుకాక = ఆసంగతి విచారింపక, వేగము+ఎ = త్వరిత ముగ, కొట్టి=జనులను హింసించి, తెండు = (ద్రవ్యమును) తీసికొనిరండు, అనన్=అనిపలికినచో, మొదటికిమోసము+ఔన్=ముట్టమొదటనే చెడి పోవును, (వానిచేఁజిక్కక వెడలిపోవుదురనుట) ఎట్టులనఁగా; భూమిన్= ధరయందు, పశుబృందమును=గోసమూహమును, పిదికినఁగాక=పిండినఁబా లుకలుగునుగాని, పొదుగుమూలము=పొదుగుమూలభాగమును, కోసినన్= కత్తితోఁగోసినయెడల, ఎవ్వరికైనన్=ఎటువంటివారికైనను, పాలుకలు గునె=క్షీరముదొరుకునే. (అనగా దొరకదనుట)

తా॥ మానవుఁడు నేర్పుచేత గోవులను బితికినఁ బాలునిచ్చునుగాని, పొదుగుమూలమును గత్తిచేఁగోసినఁ బాలీయవు సరికదా మొదటికి మోస మగును. అట్లే, ప్రభువు తనప్రజలను మంచిమాటలచే నడిగినఁ గప్పములు చెల్లించుచుండెదరుగాని, దౌర్జన్యమువహించిన ధనాదు లియ్యకుండుటయే గాక, దేశమును బాసి పోయెదరు.

చ॥ అనఘునికైనఁ జేకుఱు ననర్హునిగూడి చరించునంతలో
మనమెఱియంగ నప్పు డవమానము కీడు ధరిత్రియందు నే
యనువుననైనఁదప్పవు యథార్థము; తానదియెట్టులన్నచో
నినుమునుగూర్చి యగ్ని నలయింపదెసమ్మెటపెట్లు భాస్కరా!

టీ. భాస్కరా! ధరిత్రియందున్=భూమియందు, అనర్హునిన్=అర్హత లేనివానిని, కూడి=చేరి, వరించినంతలోన్=సంచరించునట్టివేళయందు, మనము=చిత్తము, ఎరియంగన్=మండురీతిగా, అప్పుడు=ఆవేళయందే, అవమానము=తిరస్కృతి, (అగౌరవము) కీడున్=హానికరమును, అనఘునికైనన్=దోషరహితుఁడయినట్టివానికయినను, చేకుఱున్=సంప్రాప్తించును, ఏ+అనువునన్+ఐనన్=ఏయుపాయముచేతనయినను, తప్పవు=తప్పిపోవు, యథార్థము=నిజము, తాన్+అది+యెట్టులన్నచోన్=అదియెట్లనఁగా, ఇనుమును గూర్చి=ఇనుముతో నేకీభవించుటచే, అగ్నిన్=నిప్పును, సమ్మెటపెట్లు=సుత్తె దెబ్బ, అలయింపదె=కష్టపెట్టదే? (అనగా బాధించుననుట.)

తా॥ ఇనుము నాసించుటచే అగ్నికిగూడ సమ్మెటపోట్లు తప్పనట్లు, దుష్టునిసహవాసమున, బుద్ధిగలవారికిసయితము నగౌరవము, కీడుఁగలుగుట నిశ్చయము.

చ॥ అలఘుగుణప్రసిద్ధుఁడగునట్టి ఘనుండొకడిష్టుఁడై తనున్
వలచి యొకించుకేమిడిన వానికిమిక్కిలి మేలుచేయఁగా

తెలిసికుచేలుఁడొక్క కొణిఁ దెండడుకుల్ దనకిచ్చినన్ మహా
ఫలదుఁడుకృష్ణుఁడత్యధిక భాగ్యము లాతనికీఁడె? భాస్కరా! 8

టీ. భాస్కరా! అలఘు=ఘనమగు, గుణ=సద్గుణములచే, ప్రసిద్ధుఁడు=సత్కీర్తిఁగాంచినవాడు, అగునట్టిఘనుండు=అయినట్టి మహానుభావుఁడు ఒకఁడు=ఒకానొకడు, ఇష్టుడు+ఐ=హితవుగలవాడై, తన్నున్=తన్ను, వలచి వరించి, ఒక+ఇంచుక=కొద్దిగా ఏమి+ఇడినన్=ఏమియిచ్చినను, వానికిన్=ఇచ్చినయట్టి వానికి, మిక్కిలి=ఎక్కువ, మేలు=ఉపకారము, చేయుగా=చేయునుగదా? తెలిసి=(దేవుడని) తెలిసికొని, కుచేలుఁడు=కుచేలుడను నొక బ్రాహ్మణుడు, ఒక్కకొణిదెండు=ఒక్కచేరెడు, అడుకుల్=అడుకుల ను, తనకున్=తనకు, (కృష్ణభగవానునకు) యిచ్చినన్=ఇచ్చియుండగా మహాఫలదుఁడు=గొప్పభాగ్యము లిచ్చునట్టి శ్రీకృష్ణుఁడు, అతనికిన్=అకుచేలునకు అత్యధికభాగ్యములు=అధికమయిన యైశ్వర్యములు, ఈడె=ఈయఁడా? (ఇచ్చెనని యర్థము.)

తా. శ్రీకృష్ణభగవానునకుఁ గుచేలుడు చేరెడడుకులు భక్తితో నీయగా, వానికి సకలైశ్వర్యముల నొసంగెను. అవిధముగా గుణముగలవాఁడు తనయిష్టుఁడైయుండి యేస్వల్పమాత్రని కిచ్చినను అతండధికఫలము నొయిచ్చును.

చ॥ అవనివిభుండు నేరుపరియై చరియించినఁ గొల్చువారలె
ల్లవగుణులైన నేమి పనులన్నియుఁజేకురు వారిచేతనే
ప్రవిమలనీతిశాలియగు రాముని కార్యము మర్కటంబులే
తవిలియొనర్పవే? జలధిదాటి సురారులద్రుంచి భాస్కరా!

టీ. భాస్కరా! అవనివిభుండు=భూనాథుడు, (రాజు) నేరుపరియై వివేకముగలవాడయి, చరియించినన్=ప్రవర్తించినచో, కొల్చువారలు=

సేవించెడిభృత్యులు, ఎట్లు=ఎట్టి, అవగుణులు=దుర్గుణముగలవారు, అయిన నేమి=అయిననుగాని, వారిచేత నే=అట్టిదుర్గుణముకలవారిచే నే, పనులన్నియున్=కార్యములన్నియు, చేకుఱున్=సిద్ధించును. (ఎట్లనగా) ప్రవిమల స్వచ్ఛందమైన, సీతశాలి=రాజసేతిచే విరాజిల్లుచున్నవాడు. అగురాముని కార్యము=అయినట్టిరామచంద్రునిపని. మర్కటంబులు ఏ=వానరులే తవిలి=పూనుకొని. జలధిన్=సముద్రమును, దాటి=దాటిపోయి సుర అరులన్=రాక్షసులను, త్రుంచి సంహరించి, ఒనర్పవే=చేసియుండలేదా? (అనఁగా నెఱవేర్చెననుట.)

తా॥ రాజసేతివిశాలదుండగు రాముఁడు, అల్పులగు వానరులంగూడి వారధినిదాటి, రక్కసులఁ బరిమార్చి విజయుఁడయినట్లు వివేకశాలియగు రాజేంద్రుడల్పులగు భృత్యులచేత నేగొప్పకార్యములనైన జేయింపఁ గలఁడు.

ఉ॥ ఆదరమింతలేక నరుఁడాత్మబలోన్నతి మంచివారికిన్
ఖేదముచేయుటందనదు పేర్మికిఁగీడగు మూలమెట్లు మ
ర్యాదహిరణ్యపూర్వకశిపుం దనుజుండు గుణాఢ్యుఁడైన ప్ర
హ్లాదునకెగ్గుచేసి ప్రళయంబునుబొందఁడెమున్ను భాస్కరా!

టీ. భాస్కరా! నరుఁడు=మానవుఁడు,ఆదరము=అనురాగము,(ప్రేమ) ఇంతలేక=ఇంచుకయేని లేక, ఆత్మబల+ఉన్నతిన్=తనబలపరాక్రముచేత, మంచివారికిన్=సుజనులకు, ఖేదము=దుఃఖము, చేయుటన్=చేయుచుండుట చేత, తన=తనయొక్క, పేర్మికిన్=పెంపునకు, కీడుఅగున్=హానికలుగును. మూలము=దృష్టాంతము, ఎట్లు=ఏప్రకారమున, మున్ను=పూర్వము, అమర్యాదన్=దుర్వృత్తిచే, హిరణ్య=హిరణ్యశబ్దము, పూర్వ=మొట్టమొదట, కశిపు+అన్=కశిపుండను (అనఁగా హిరణ్యకశిపుండను యర్థము.) దను

జుండు=నిశాచరుఁడు, (రాక్షసుఁడు) గుణ+ఆఢ్యుఁడు=సుగుణాగ్రగణ్యుఁడు ఐన=అయినటువంటి, ప్రహ్లాదునకున్=ప్రహ్లాదునకు, ఎగ్గు=అపకారము, చేసి, ప్రళయంబును=నాశనమును, పొందఁడు+ఏ=పొందలేఁడే? (అనఁగా మృతిఁజెందెనని భావము.)

తా. తొల్లి, క్రూరాత్ముఁడగు హిరణ్యకశిపుఁడు గుణనిధియగు ప్రహ్లాదునకెగ్గుఁజేసి, మృతిఁజెందినటులే, మానవుఁడు లోకంబున దయాశూన్యుఁడై బలహీనుఁడగు సుజనుని హింసించినచో దప్పక ప్రాణములఁ గోలుపోవును.

ఉ॥ ఆరయ నెంత నేరుపరియైన చరించిన వానిదాపునన్
గౌరవ మొప్పఁ గూర్చు నుపకారిమనుష్యుఁడు లేక మేలు చే
కూరద దెట్లు? హత్తుగడఁ గూడునె చూడఁ బదారువన్నె బం
గారములోననైన వెలిగారముకూడక యున్న భాస్కరా! 11

టీ. భాస్కరా! ఆరయన్=ఆలోచనసేయఁగా, (మానవుఁడనుట) ఎంత నేరుపరి=మిక్కిలి నేర్పుఁగలవాఁడు, అయి చరించినన్=అయి నడచుచుండినను, వానిదాపునన్=వాని సామీప్యమున (దగ్గఱ) గౌరవము=ఘనత (గొప్పమర్యాద) ఒప్పన్=ఒప్పునటుల, కూర్చు+ఉపకారిమనుష్యుఁడు=చేకూర్చెడి యుపకారియైన మనుజుఁడు, లేక, మేలు=మంచి, చేకూరదు=కలుగనేరదు, అది+ఎట్లు=అదియేప్రకారమనఁగా, చూడన్=చూడఁగా, (విచారింపగా) పదారువన్నె బంగారములోనన్+ఐనన్=మేలిమిబంగారులో నయినను, వెలి+కారము=బంగారునకుఁ గాంతినిచ్చెడి వెలిగారమును తెల్లనియుప్పు, కూడక+ఉన్నన్=కలియకున్నయెడల, హత్తుగడఁగూడును+ఏ=అంటుకొని యుండునా? (అదుకొనదనియర్థము.)

తా. పసునారువన్నె బంగారమైనను టంకమునకు వెలిగారము లేనిదే అంటుకొనని విధముగా, మానవుఁడు తానెంత విద్యానిధియైనను గౌరవము గలిగించెడి యుపకారి ప్రాపకము లేనిచో మేలుకలుగదు.

ఉ॥ ఈక్షితి నర్థకాంక్ష మది • నెప్పుడు బాయక లోకులెల్ల సం
రక్షకుఁడైన సత్ప్రభుని • రాకలఁ గోరుదు రెందుఁ జంద్రికా
పేక్షఁ జెలంగి చంద్రుఁడుద • యించువిధంబునకై చకోరపుం
బక్షులు చూడవే యెదుర • పారముదంబును బూని భాస్కరా! 12

టీ. భాస్కరా! ఈక్షితిన్=ఈధరయందు, ఎల్లలోకులు=మనుజులందరును, అర్థకాంక్షన్=ధనము పైనాశను, ఎప్పుడు=ఎల్లవేళలను, పాయక=విడువక, సంరక్షకుఁడు=తమ్ముఁబోషించెడివాఁడు, ఐనసత్ + ప్రభుని రాకలు=అయినట్టి మహారాజ యాగమనములును, ఎందున్=ఏకాలమందైనను, కోరుదురు=ఎదురు జూచుచుందురు, ఎట్లన; చకోరపు=బక్షులు=వెన్నెలపులుగులు, చంద్రికా + అపేక్షన్=వెన్నెలయందుఁగల యాసక్తిచే, చెలంగి=ఆనందాతిశయము కలవై యుండి, చంద్రుఁడు=జాబిల్లి, ఉదయించు విధంబునకున్ + ఐ=చంద్రోదయము కొఱకయి, అపారముదంబును=అమందానందమును, పూని=పొంది, ఎదురుచూడవే=నిరీక్షించుకొని యుండవా? (అనఁగా వేచియుండునని యర్థము.)

తా. వెన్నెలకాసించి చకోరపక్షు లమితానందముఁ బొందును. చంద్రుఁడెప్పు డుదయించునోయని వేచియుండు విధముగా, మనుజులు ధనముపై నాసచేఁ బ్రభువురాకకై యెదురుచూచు చుందురు.

ఉ॥ ఈజగమందుఁ దా మనుజుఁ • డెంతమహాత్మకుఁడైన దైవమా
తేజము తప్పఁజూచునెడఁ • ద్రిమ్మరకోల్పడు నెట్లన న్మహా
రాజకుమారుఁడైన రఘు • రాముఁడు గాల్నడఁ గాయలాకులున్
భోజనమై తగన్వనికిఁ • బోయిచరింపఁడె మున్ను భాస్కరా! 13

టీ. భాస్కరా! మనుజుఁడు=మనుష్యుఁడు, తాన్=తాను, ఈజగమందున్=ఈలోకమునందు, ఎంతమహాత్మకుఁడు=ఎటువంటి గొప్పవాఁడు

ఐనన్ = అయినను, దైవము = ఈశ్వరుఁడు, ఆ తేజము = ఆ మహాత్మ్యకీ (ప్రభావము) తప్పన్ = తప్పునట్లుగా, చూచు + ఎడన్ = చూచునట్టి వేళయందు, త్రిమ్మరి = సంచారమొనరించి, కోలు + పడున్ = సర్వము పోగొట్టుకొనును, ఎట్లనన్; మహారాజకుమారుఁడు = రాజరాజగు దశరథుని కుమారుఁడు, ఐన రఘురాముఁడు = అయినట్టి శ్రీరామచంద్రుఁడు, కాయలు = పండ్లును, ఆకులు = పత్రములును, భోజనము అయి = ఆహారమయి, తగన్ = తగునట్లుగా, కాల్ + నడన్ = కాలినడకతో, వనికిన్ = అడవికి, పోయి = వెళ్ళి, చరింపఁడు + ఏ = సంచారము సేయలేదా? (అనఁగాఁ దిరిగెననుట)

తా. జానకీచిత్తచోరుండగు రాముండు కాలినడకతో నరణ్యమున కేగి, ఆకులలములను భక్షించుచుఁ దిరుగాడినటుల, మానవుఁ డెంతటి వాడయినను, యీశ్వరానుగ్రహము లేనప్పుడు సకలమునుఁ గోలుపోయి, యన్యదేశముల గ్రుమ్మరుచుండును.

చ॥ ఉరుకరుణాయుతుండు సమయోచితమాత్మఁ దలంచి యుగ్రవా
క్పరుషతఁ జూపినన్ ఫలముఁ గల్గుట తథ్యము గాదె యంబుదం
బుఱిమిన యంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ
స్థిరతర పౌరుషంబున నశేషజనంబు లెఱుంగ భాస్కరా! 14

టీ. భాస్కరా! ఉరుకరుణాయుతుండు = ఎక్కువయిన దయతోఁ గూడినవాఁడు. సమయ + ఉచితము = కాలమునకుఁ దగిన యాలోచన, ఆత్మన్ = హృదయమునందు, తలంచి = తలపోసి, ఉగ్ర + వాక్ + పరుషతన్ = భయంకరమైన మాటలయొక్క కాఠిన్యమును, చూపినన్ = చూపించినను, ఫలము = లాభము, కల్గుట = ప్రాప్తించుట, తథ్యముకాదు + ఏ = నిశ్చయమే కదా; ఎట్లన; అంబుదము = మేఘము, ఉఱిమిన + అంతన్ + ఏ = ఉఱిమినంత మాత్రముననే, లోక = ప్రజలను, రక్షణ = రక్షణ సేయుటందు, స్థిరతర = స్థిరతరమైనయట్టి, పౌ

రుషంబునన్=మగటిమిచేత, (శౌర్యముచేత) అశేషజనంబులు=జనులెల్లరును, ఎఱుంగన్=తెలిసినట్లు, వర్షము=వాన, కురియకుండునా=వర్షింపక యుండునా? (అనగా కురిపించునని)

తా. ప్రారంభసమయమున మేఘము యుఱుములచే జనులకు భయోత్పాతముఁగలిగించినను, పిమ్మటవర్షించి జనానంద మొసఁగునట్లే, దయార్ద్రహృదయుఁడు సమయానుకూలముగ కఠినోక్తులాడినను దరువాతఁదప్పక మేలొసంగును.

చ॥ ఉరుగుణవంతుఁ డొడ్లు దన కొండపకారము సేయునప్పుడుం
బరహితమే యొనర్చు నొకపట్టున నైనను గీడు సేయఁగా
నెఱుఁగఁడు నిక్కమే కదయ దెట్లనఁ గవ్వముఁ బట్టి యెంతయున్
దరువఁగఁ జొచ్చినం బెరుఁగు తాలిమి నీయదె? వెన్న భాస్కరా!

టీ. భాస్కరా! ఒడ్లు=పరులు (ఇతరులు) తనకున్=తనకు, ఒండు+అపకారము=ఒకకీడు, చేయు+అప్పుడున్=చేసెడివేళయందైనను, ఉరుగుణవంతుఁడు=మేటిగుణములగలవాఁడు, పరహితము+ఏ=ఇతరుల కుపకారమునే, ఒనర్చున్=చేయును, ఒకపట్టునన్+ఐనను= ఒకసమయమునందైనను, కీడు=హానిని, చేయన్+కాన్=చేయుటకు, ఎఱుగఁడు=తలపోయఁడు, (తెలిసికొనఁజాలడు) నిక్కము+ఏకదా=నిశ్చయమేకదా (నిజమేకదా) ఎట్లనగా; పెరుగు=దధి, కవ్వమున్+పట్టి=కవ్వమునుచేతఁగొని, ఎంతయున్=మిక్కిలి, తరువగన్+చొచ్చినన్=తరచుచున్నను, (మథించినను) తాలిమిన్=ఓర్పుచే, (శాంతముచే) వెన్నన్=నవనీతమును, (వెన్నను) ఈయను+ఏ=ఈయదా (ఇచ్చునని యర్థము.)

15. ఒడ్లు=పగఱు, ధాన్యము అనఁబడును. "గుప్పెడుమూసరొడ్లు" అని ఘట్టుప్రభుని కుచేలోపాఖ్యానమునందలి ప్రయోగము.

తా. జనులు తన్నుఁ గవ్వము చేఁగొని తరచుచున్నను, వారికిఁగీడుసేయక, పెరుగు తనయందున్న వెన్నను ప్రజలకొసంగురీతిగా; గుణవంతుఁడు తనకొరులు హానిసేయుచున్నను, తానట్టివారలకు మేలుఁ గూర్చునుగాని కీడుఁజేయఁడు.

చ॥ ఉరుబలశాలినంచుఁ దను నొల్లని యన్యపతివ్రతాంగనా
సురతముఁగోరెనేని కడ సుమ్మది భూతికిఁ బ్రాణహానియౌ
శిరములుగూల రాఘవునిచే దశకంఠుఁడు ద్రుంగిపోవఁడే
యెఱుఁగక సీతకాసపడి యిష్టులభృత్యులఁగూడిభాస్కరా!

టీ. భాస్కరా! మనుష్యుఁడు (అధ్యాహారము) ఉరు=ఘనమైన (అధికమైన)బలశాలిన్ + అంచు=బలముచే నొప్పుచున్నవాఁడనని, తనున్=తన్ను, ఒల్లని=పరాంగనా సురతమున కొప్పుకొనని, (ఇష్టపడని) అన్య=వేఱొక, పతివ్రతగ + అంగనా=పతివ్రతగల స్త్రీలయొక్క, సురతము=సంగమము (స్నేహము) కోరెన్ + ఏని=వాంచించినచో (కోరినచో) అది=ఆవాంఛ, భూతికిన్=సంపదకు (ఐశ్వర్యమునకు) కడసుమ్మ=అంత్యకాలముసుమీ (నాశనమగుట) ప్రాణహాని=ప్రాణాపాయము. (శరీరమునుఁ గోలుపోవుట) ఔన్=అగును, (ఎట్లన) దశకంఠుఁడు=రావణుఁడు (రాక్షసుఁడు) ఎఱుఁగక=తెలిసికొనలేక, సీతకున్=రాముని దేవేరికొరకు, ఆసపడి=ఆసించి, ఇష్టులన్=హితులను, (స్నేహితులను) భృత్యులన్=సేవకులను, కూడి=వారితోఁగలిసికొని, రామునిచేన్=రామభద్రునిచే, శిరములు=తలలు, కూలన్=తెగిపడఁగ, త్రుంగిపోవఁడు + ఏ=మృతిఁజెందలేదా? (చచ్చెననుట)

తా. కామాంధుడై రావణుఁడు సీతాదేవిని వరించి, బంధుజనసుతామాత్యముగ నాలమునఁజచ్చెను. కావున, మనుష్యుఁడు బలైశ్వర్యముల గలవాఁడనని కండకావరముచేఁ దనయందుఁ గోర్కెలేని యబలను బలాత్కరించిన నైశ్వర్యానులతో, ప్రాణంబులఁ గోలుపోవును.

ఉ॥ ఊరకవచ్చుఁ బాటుపడకుండిననైన ఫలంబదృష్టమే
పారఁగఁగల్గువానికిఁ బ్రయాసమునొందిన దేవదానవుల్
వారలటుండఁగా నడుమవచ్చిన శౌరికిఁ గల్గెఁగాదె శృం
గారపుఁబ్రోవులక్ష్మియును గౌస్తుభరత్నము రెండు భాస్కరా!

టీ. భాస్కరా! అదృష్టము=భాగ్యము, ఏపారఁగన్=వృద్ధిఁజెందు నట్లు, కల్గువానికిన్=కలిగియున్న మనుజునకు, పాటు=శ్రమ (కష్టము) పడక యుండినన్=పొందక పోయినను, ఫలంబు=లాభము, ఊరక=మిన్నక, వచ్చున్=వచ్చుచుండును, (ఎట్లనఁగా) ప్రయాసమున్=శ్రమను, (ఆయాసమును) ఒందిన దేవదానవుల్ చెందిన సురలును అసురులును, వారలు=ఆదేవతలు రాక్షసులు, అటు+ఉండఁగాన్=అట్లు ప్రత్యేకముగ నుండఁగా, శృంగారపుఁబ్రోవు=అందముల కుప్పయగు, లక్ష్మియును=శ్రీలక్ష్మీదేవియును, కౌస్తుభరత్నము=కౌస్తుభమాణిక్యము, రెండున్=రెండును, నడుమన్=మధ్యవేళను, వచ్చిన శౌరికి=విచ్చేసిన విష్ణుమూర్తికి, కల్గెన్+కాదు+ఎ=ప్రాప్తించెనుగదా. (లభించెనుగదా!)

తా. రాత్రింబవళ్లు శ్రమలొందుచున్న సురాసురులకు లభింపక, సముద్ర మథనకాలము నందుద్భవించిన శ్రీదేవియు, కౌస్తుభమును, కష్టపడకుండ మధ్యవచ్చిన విష్ణుమూర్తికి ఫలప్రాప్తి అగునటుల, అదృష్టవంతునకు ప్రయాసము లేకయే ఫలితముఁ గలుగును.

ఉ॥ ఊరకసజ్జనుండొదిఁగియుండిననైన దురాత్మకుండు ని
ష్కారణమోర్వలేక యపకారముచేయుట వానివిద్యగా
చీరలునూఱుటంకములు చేసెడివైనను బట్టనుండఁగాఁ
జేరి చినింగిపోఁ గొఱుకు చిమ్మటకేమి ఫలంబు? భాస్కరా!

టీ, భాస్కరా! సత్+జనుండు=యోగ్యుఁడు, ఊరక=ఇతరుల జోలికినిఁ బోక ఒదిగి=అడఁగి,(అణగి) ఉండినన్+ఐనన్=ఉండినప్పటికిని, దుర్ +

ఆత్మశుండు=దుష్టాత్ముడు=చెడుమనస్సుకలవాడు నిష్కారణము=హేతువేమియు లేక (కారణము లేకుండ) ఓర్వలేక=చూడలేక (సహింపజాలక అపకారము=కీడు, చేయుట=ఒనర్చియుండుట (సజ్జనునకపకారము సేయుట) వానివిద్య కా=అతనియొక్క కార్యమే కదా, (ఎట్లన) చీరలు=బట్టలు, నూరుటంకములు=నూరు మొహరీలు, చేసెడివి=వెలగలిగినవి, అయినను=అయినప్పటికిని, పెట్టెన్=పెట్టెలో=ఉండగాన్=ఉండినప్పుడు, చేరి=వాటిని సమీపించి, చినింగిపోన్=అవి చీరలు శిథిలములగునటుల (పాడగునటుల) కొఱుకు=కొఱుకుచున్నటువంటి, చిమ్మటవలెన్=చిమ్మటయనెడి పురుగువలె, ఏమి ఫలంబు=ఏమిలాభముగలుగును? (అనగా ఫలితము లేదనియర్థము.)

తా. వెలయుమించిన వస్త్రములు పెట్టెలోనున్నప్పటికిని, దానికేమియు ఫలితము లేకపోయినను, చిమ్మటాయంబరములను ముక్కముక్కలుగ గొఱికివేయునటుల సజ్జనులొకమూల నొదిగియున్నను, దుష్టుడు తనకు లాభముఁగలుగకపోయినను, యకారణముగ నాయుక్తమున కపకారముఁ జేయుచుండును.

ఉ॥ ఎట్టుగఁ బాటుపడ్డ నొకయించుక ప్రాప్తము లేక వస్తువుల్
పట్టుపడంగ నేరవు ; నిబద్ధిసురావళిఁగూడి రాక్షసుల్
గట్టుపెకల్చి పాల్కడలిఁ గవ్వముచేసి మథించిరంతయున్
వెట్టియెకాక యేమనుభవించిరి వారమృతంబు? భాస్కరా!

టీ. భాస్కరా! ఎట్టుగన్=ఏరీతిగ (ఎవిధముగ) పాటుబడ్డన్=శ్రమపడినను, ఒక+ఇంచుక=కొంచెమయిన) ప్రాప్తము=అదృష్టము, వస్తువుల్=వస్తువులు (ద్రవ్యములు) పట్టుపడంగన్=నేరవు=లభింపవు, దొరక నేరవు) నిబద్ధి=నిజము, (ఎట్లనగా) రాక్షసుల్=పలలాశనులు సుర+ఆవళిన్=దేవతాసంఘమును, కూడి=వారితోఁగలిసికొని, గట్టున్=

18. టంకము=వెలిగారము, కత్తిరియొలు, గడ్డపాఱ, గోపము.
టంకములు=పదియారు డబ్బుల బంగారు నాణెములు, అనియర్థము.

మంధరాద్రిని, (మంధరపర్వతమును) పెకల్చి=పెల్లగించి, కవ్వముచేసి=కవ్వముగానొనర్చి, పాల్కడలిన్=క్షీరసాగరమును, మథించిరి=తరిచిరి, అంత యున్=రాక్షసులకష్టమంతయు, వెట్టియకాక=ఫలశూన్యమేకాని, వారు=అసురులు, (దైత్యులు) అమృతంబును=సుధను, ఏమి అనుభవించిరి=ఏమి పానముం జేసిరి. (అనగాద్రావలేదని యర్థము.)

తా. దైత్యులు దేవతలతోఁ జెలిమిఁజేసి, మందరాద్రిని దెచ్చి కవ్వముగాఁజేసి పాలసముద్రమును బహుప్రయాసముతో తరిచినను, రాక్షసుల కమృతము దొరికినదికాదు. కావున, మానవమాత్రుడెంతటి యాయాసము నకుఁ గడంగినను, దానారగించు యోగ్యములేనప్పుడు, పడిన కష్టమంతయు వృథయగును.

చ॥ ఎడపక దుర్జనుండొరుల కెంతయుఁ గీడొనరించుఁగాని యే
యెడలను మేలుసేయఁడొకించుకయైనను జీడపుర్వుఁదా
జెడఁదినునింతెకాక పుడిసెండుజలంబిడి పెంపనేర్చునే
పొడవగుచున్న పుష్పఫలభూరుహమొక్కటినైన భాస్కరా!

టీ. భాస్కరా! దుర్జనుండు=క్రూరుఁడు, ఎడపక=ఎడలక, ఒరు లకున్=పరులకును, ఎంతయున్=మిక్కిలి, కీడు=దుర్మార్గమును, (చెడుగును) ఒనరించున్ × కాని=చేయునుఁగాని, ఏ × ఎడలను=ఎప్పుడైనను, ఒక × ఇంచుకయు × ఐనను=కొంచెమయినను, మేలు=బాగును, చేయఁడు=చేయఁ బోడు (ఎట్లనన్) చీడపుర్వు=చీడపురుగు, తాన్=తాను, చెడన్=చెడు నట్లుగా, తినున్=భక్షించుఁగాని, పుడిసెండుజలము=చేరెఁడునీళ్ళను, ఇడి=పోసి, పొడవు=పెంపును అగుచున్న=కాంచుచున్న, పుష్ప=పువ్వులతోను, ఫల=పండ్లతోను (కూడియున్న) భూరుహమున్=చెట్టును, ఒక్కటిన్ × ఐనన్=ఒకదానినైనను, పెంపన్ నేర్చునే=వృద్ధిఁజేయఁగలదా? (అనగావర్ధింప లేదనుట)

తా. బాగుగ వృద్ధిబొందెడి ఫలవృక్షములను, జీడపురుగు కొట్టికివేయు చుండునుగాని, చేదు జలముఁబోసి ఒకవృక్షమునైనఁ బెంపలేనటుల, దుర్జనుండొరులకుఁ గీడుసేయఁజూచునేగాని, మేలుచేయఁడు.

ఉ॥ ఎడ్డమనుష్యుఁ డేమెఱుఁగు • నెన్ని దినంబులు గూడియుండినన్
దొడ్డగుణాఢ్యునందుఁగల • తోరపువర్తనలెల్లఁ బ్రజ్ఞఁ బే
ర్వడ్డవివేకిరీతిరుచి • పాకము నాలుకగాకెఱుంగునే?
తెడ్డది కూరలోఁ గలియఁ • ద్రిమ్మరుచుండిననైన భాస్కరా!

టీ. భాస్కరా! ఎడ్డమనుష్యుఁడు=మూఢమానవుఁడు ఎన్నిదినంబులు - ఎన్నివాసరములు, కూడియుండినన్ = చేరియున్నప్పటికిని, దొడ్డగుణ + ఆఢ్యునందున్=సుగుణములచే నొప్పుచున్న మానవునియందు, కల తోరపు వర్తనలు + ఎల్లన్=కలిగియున్న సత్ప్రవర్తనలన్నింటిని, ప్రజ్ఞచే బుద్ధిబలముచే, పేరు + పడ్డ వివేకిరీతిన్=విఖ్యాతిఁగాంచిన జ్ఞానివలె, ఏమి + ఎఱుంగును=ఏమి తెలిసికొనఁగలఁడు, (ఎట్లనన్) రుచిపాకము=రుచిపాకముయొక్క మాధుర్యము, నాలుక గాక=జిహ్వగాక, తెడ్డు=కొయ్యగరిటె, కూరలోన్=కూరయందును, కలయన్=అంతటను వ్యాపించి, ద్రిమ్మరుచు + ఉన్నను=తిరుగుచున్నను, అది=ఆకఱ్ఱగరిటె, ఎఱుంగునె=ఎఱుఁగఁగల్గునా? (అనఁగా తెలిసికొనలేదనుట)

తా. బాగుగాఁ బచనము చేసిన కూరయొక్క చవిని నాలుక తెలిసికొనునుగాని, ఎల్లప్పుడు నుడికయుడకని కూరలలోఁ దిరుగుచుండు తెడ్డారుచిపాకము యెఱుంగనటుల, గుణాఢ్యుని సత్ప్రవర్తనములు జ్ఞానికిఁ దెలియును గాని, మూఢుడెంతకాలము చెలిమిఁజేసినను గుణము గ్రహింపనేఱఁడు

ఉ॥ ఎప్పుడదృష్టతామహిమ • యించుకపాటిలు నప్పుడింపుసొం
పొప్పుచునుండుఁగాక యది • యొప్పనిపిమ్మట రూపుమాయుఁగా

నిప్పున నంటియున్న యతినిర్మలినాగ్ని గురుప్రకాశముల్
దప్పిననట్టిబొగ్గునకుఁ • దానలుపెంతయుఁబుట్టుభాస్కరా !

టీ. భాస్కరా! ఎప్పుడు=ఏవేళయందు, (ఏకాలమందు) అదృష్టతా మహిమ=భాగ్యాభివృద్ధి, భాగ్యముయొక్క పెంపు) ఇంచుక=కొంచెము, పాటిలున్=ప్రాప్తించునో, అప్పుడు=ఆకాలమందు, ఇంపుసొంపు=చక్కదనాతిశయము, ఒప్పుచునుండుగాక=విరాజిల్లుచుండునుగాని, అది=ఆఐశ్వర్యము, ఒప్పనిపిమ్మటన్=విడిచిపెట్టినతర్వాత, రూపు=తొంటిరూపము, మాయుగా=నశించిపోవునుగదా, (ఎట్లనఁగా) నిప్పునన్=అగ్నియందు, అంటియున్న=తగిలియున్నటువంటి, అతినిర్మల=మిక్కిలి నిర్మలమయిన, అగ్ని=అగ్నిహోత్రునియొక్క, గురు=గొప్పవగు, ప్రకాశముల్=కాంతులు, తప్పినన్=విడనాడిపోయినన్, అట్టిబొగ్గునకున్=అటువంటిచల్లారిపోయిన కట్టెతునకకు, నలుపు=నల్లనికాంతి, తాన్=తాను ఎంతయున్=మిక్కిలి, పుట్టున్=కలుగుచుండును.

తా. బొగ్గు అగ్నిదగ్గర యున్నప్పుడు ప్రకాశించెడి యగ్నికాంతి, చల్లబడిన తోడనే నల్లనికాంతిఁ గలిగినట్లు, భాగ్యమయు మున్నంతకాలము మానవుఁడు ప్రభఁగలిగి విజృంభించుగాని, అది కానరానప్పుడు విరూపమును గాంచును.

---

21. దినము—ఒకపగలును రాత్రియుఁగలసి దినమనఁబడును. వారమనినను, దినమనినను, దినమునకే యర్థము. రోజు అనువాడుక పదము హిందూస్థాని పదమని యెఱుంగవలెను. రుచి—కాంతి, అందము, మాధుర్యము అని యర్థము.

ఉ॥ ఏగతిఁ బాటుపడ్డఁ గల • దే భువి నల్పునకున్ సమగ్రతా
భోగము భాగ్యరేఖ గల • పుణ్యునకుంబలె భూరిసత్వసం
యోగమదేభకుంభయుగ • ళోత్థితమాంసము నక్కకూన కే
లాగు ఘటించు సింహము ద • లంచినఁ జేకుఱుఁ గాక భాస్కరా.

టీ. భాస్కరా! ఏగతిన్ = ఏరీతిని (ఏవిధమున) పాటుపడ్డన్ = కష్టపడుచున్నను, భువిన్ = భూమియందు, అల్పునకున్ = నీచునకు, భాగ్యరేఖ = ఐశ్వర్యలక్షణము, (అదృష్ట చిహ్నము) కలపుణ్యునకుంబలె = కలిగియున్న సుకృతవంతునకువలెనే, సమగ్రతా = పూర్ణమయిన, భోగము = సుఖము, కలదే = కలిగియున్నదా, (లేదని యర్థము) కలదు + ఏ = కలదే. అని ఏకారము వ్యతిరేకార్థమున వచ్చియున్నది. (ఎట్లనఁగా) భూరి = ఘనమయిన, సత్వ = సత్త్వముయొక్క, సంయోగ = కూడికఁగల, మద + ఇభ = మదేభ = మదించిన యేనుగుయొక్క, కుంభయుగళీ = కుంభద్వయమందు, ఉత్ + హిత = ఉత్థిత = జనించిన మాంసము = పలలము, సింహము = మృగరాజు, తలంచినన్ = అపేక్షించినను (ఆసించినను) చేకుఱున్ = సిద్ధించునుగాని, (లభించునుగాని) నక్కకూనకున్ = నక్కపిల్లకు, ఏలాగు = ఎట్లుగా, లభించును = ప్రాప్తించును, (దొరకును) సంప్రాప్తము కాదనుట.

తా. మదించిన యేనుగుయొక్క కుంభస్థలములయందున్న మాంసమును మృగరాజుకోరిన లభించునుగాని, ఎంత ప్రయాసపడినను నక్కకు సంప్రాప్తము కానటుల, నైశ్వర్యవంతునకు నపారసౌఖ్యము ప్రాప్తించునుగాని, యెంతకష్టపడినను అల్పునకు దొరకజాలదు.

ఉ. ఏడ ననర్హుఁడుండు నట • కేఁగు ననర్హుఁడు నర్హుడున్నచోఁ
జూడఁగ నొల్లఁడెట్లన న • శుద్ధగుణస్థితి నీఁగపూయముం

గూడినపుంటిపై నిలువఁ • గోరిన యట్టులు నిల్వనేర్చునే
నూడిదవెట్టు నెన్నుదుటిఁ జొక్కపుఁ గస్తురిమీఁద భాస్కరా.

టీ. భాస్కరా! అనర్హుఁడు = అర్హతలేనివాఁడు, (చెడ్డవాఁడు) ఏడనుండున్ = ఎచటనుండునో, అనర్హుఁడున్ = అయోగ్యుఁడును, అటమున్ = అప్రదేశమునను, ఏగును = వెళ్లుచుండును, అర్హుఁడు = యోగ్యతఁగలవాఁడు, ఉన్నచోన్ = ఉన్నస్థలములను, చూడఁగనొల్లఁడు = చూచుటకేని సమ్మతింపఁడు, (ఎట్లన) ఈఁగ = మక్షికము, అశుద్ధ = శుభ్రతలేని, గుణస్థితిన్ = స్వభావసిద్ధము కలదగుటచే, పూయమున్ = చీమును, కూడిన పుంటిపైన్ = కలిగిన పురుపుమీఁద, నిలువన్ = నిలిచియుండుటను, కోరినయట్లు = సమ్మతించినట్లు, మూడిద = కానుకగా, (అనఁగా నలంకారార్థము) పెట్టు = ధరించు, నెన్నుదుటి = నుదుటియందున్న, చొక్కపు = సొగసైన, కస్తురిమీఁదన్ = మృగమదముపైన, నిల్వఁగనేర్చునే = నిలిచియుండఁగలదా? (అనఁగా నిలువ లేదనుట)

తా. ఈఁగ, సువాసనఁగల కస్తూరిబొట్టుమీఁద వ్రాలక, చీముతో నిండియున్న పుండుమీఁదనే వ్రాలెడివిధముగా, దుష్టుఁడు శిష్టునిం జేరక, దుష్టాత్మునియొద్దకే పోవుచుండును.

ఉ॥ ఏలసమస్త విద్యల నొ • కించుక భాగ్యముఁ గల్గియుండినన్
జాలు ననేకమార్గముల • సన్నుతికెక్క; నదెట్లొకోయనన్
రాలకునేడ విద్యలు తి • రంబుగ దేవరరూపుచేసినన్
వ్రాలి నమస్కరించి ప్రసవంబులు వెట్టరెమీఁద భాస్కరా.

టీ. భాస్కరా! సమస్త విద్యలన్ = సకల విద్యలతో, ఏల = ఏమియుపయోగము, ఒకించుక = కొద్దిగ, భాగ్యము - అదృష్టము, కల్గిఉండినన్ = కలిగియున్నయెడల, అనేకమార్గములన్ = పెక్కుతెఱంగుల, (పలువిధముల) సన్నుతికిన్ ఎక్కన్ = కీర్తిఁగాంచుటను, చాలున్ = సరిపడును, అదియెట్లు

ఒకో అనన్=అదియే మార్గమనఁగా, విద్యలు=చదువులు, రాలమన్=శిలలను, (కరపురాళ్ళను) ఏడన్=ఎందున, (విద్యాశూన్యమనుట) తిరంబుగన్=సుస్థిరముగ, దేవరరూపు=దేవతా విగ్రహరూపములుగ, చేసినన్=చేసిన యెడల, (మనుష్యులు) వ్రాలి=భూమికొఱఁగి, నమస్కరించి=వందన మాచరించి, ప్రసవంబులు, కుసుమంబులు, (పుష్పములు) పెట్టరు + ఏ=సమర్పించరె? (ఉంతురని యర్థము.)

తా. శిలలు విద్యల నభ్యసింపకున్నను సుకృతమువలన దేవతారూపములుఁబొంది సమస్తజనులచే పూజానమస్కారములఁ బడయురీతిగా, మనుజులైశ్వర్య సంపన్నులయినవోఁ బెక్కుమార్గముల స్తుతింపఁబడుదురుగాని, కేవలము విద్యల నేర్చుకొనుటవలనఁ గాదు.

ఉ॥ ఒక్కఁడెచాలు నిశ్చల బలోన్నతుఁడెంతటి కార్యమైననుఁదాఁ
జక్కనొనర్పఁ, గౌరవుల • సంఖ్యులుపట్టిన ధేనుకోటులం
జిక్కఁగనీక తత్ప్రబల • సేన ననేక శిలీముఖంబులన్
మొక్కపడంగఁజేసి తుదముట్టఁడె యొక్కకిరీటి భాస్కరా.

టీ. భాస్కరా! నిశ్చల=చలింపని, బల=పరాక్రమముచేత, ఉన్నతుఁడు=అధికుఁడయినవాఁడు, ఒక్కఁడు + ఏ=తానొక్కఁడే, ఎంతటి కార్యము ఐనన్=ఎంతటి ఘనకార్యమైనను, చక్కన్=నేర్పుగా, ఒనర్పన్=నెరవేర్పుటకు (చేయుటకు) ఎట్లనన్; ఒక్కకిరీటి=ధనుంజయుఁడొక్కఁడే, (ఒక అర్జునుఁడే) అసంఖ్యులు=లెక్కింప వీలులేని, కౌరవులు=ధార్తరాష్ట్రులు, పట్టిన ధేనుకోటులన్=పట్టుకొనిన పశుబృందమును, (గోసమూహములను) చిక్కఁగన్ + ఈక=కౌరవులకుఁ దక్కనీయక, తత్ + ప్రబలసేన=వారల గొప్పసైన్యమును, అనేకశిలీముఖంబులన్=వివిధబాణములచే, మొక్కపడంగన్ + చేసి=పలాయితులఁగావించి, (జయించి) తుదముట్టుఁడు + ఏ=కార్యభారము నెరవేర్చుకొనలేదా? (అనఁగా నిర్వహించుకొనె ననుట.)

తా. కురువీరులెందరో వచ్చి విరటుని గోవులమందలను దోలుకొని యేగుచుండఁగా, వారినెల్లర నర్జునుండొక్కఁడే యోడించి యావుల నన్నింటిని మరలించుకొని వచ్చినటుల; మహాబల పరాక్రమముఁగల వాఁడెట్టి ఘనకార్యమైనను నిర్వహింపఁగలఁడు.

ఉ॥ కట్టడఁ దప్పి తాము చెడు కార్యముఁ జేయుచు నుండిరేని దోఁ
బుట్టినవారికైన విడిపోవుట కార్యము; దుర్మదాంధ్యముం
దొట్టిన రావణాసురునితో నెడబాసి విభీషణాఖ్యుఁడా
పట్టున రాము జేరి చిరపట్టముఁ గట్టుకొనండె? భాస్కరా. 27

టీ. భాస్కరా! కట్టడ=మర్యాద, తప్పి=విడిచి, (వదలి) తాము=మా నవులు, ఉండిరి + ఏని=ఉండినయెడల, తోఁ + పుట్టినవారికిన్ + ఐనన్= తనసహోదరుడైనను, విడి=వదలి, పోవుట=దూరముగాచనుట, కార్యము= తగినపని, (మంచిపని) దుర్మద + అంధ్యమున్=మదమువలన సంభవించిన గుడ్డితనమును, తొట్టిన=కలిగిన, రావణ + అసురునితోన్=రావణుండను దైత్యునితో, ఎడన్ + పాసి=తొలగిపోయి, విభీషణ-ఆఖ్యుఁడు=విభీషణుఁ డను నామంబుఁగలవాఁడు, అపట్టునన్=అసమయమునను, రామున్=రాముని చేరి=శరణుఁగోరి, చిరపట్టము=శాశ్వతలంకాధిపత్యము, కట్టుకొనండు + ఎ=పట్టాభిషేకముఁగట్టుకొనలేదా? (కట్టుకొనెనని యర్థము)

---

26. విరటుని కొలువుకూటమునఁ బాండవులజ్ఞాతవాసముఁ గడుపు చుండిరని దుర్యోధనుఁడాలించి, మొదట నిర్ణయప్రకారముఁ బాండవేయుల మరలఁ బదునాలుగువర్షము లరణ్యవాసమునకుఁ బంపవలెనన్న, విరటుని గోగణంబులనుఁ దోలుకొనివచ్చినచో వారు బయల్పడగలరని యూహించు కొన్నవాఁడై, చతురంగ బలంబులతో విచ్చేసి యావులమందలనుఁ దోలుకొని పోవుచుండెను. ఆట్టిసమయమున గడువు చెల్లిపోవుటచే నర్జునుండు, కౌరవుల డీకొని, రూపడించి, పశువులనుఁ దోలికొనివచ్చెను.

తా. క్రూరాత్ముఁడగు రావణాసురుఁడు చెడుప్రవర్తనముఁగలవాఁడగుటచే, సోదరప్రేమనుగూడఁ తలంపక విభీషణుండతనినివిడిచిపెట్టి, శ్రీరామునకాప్తుడై లంకాధిపత్యము వహించినట్లు; దుర్జనతగలవాఁడు సోదరుడైనను వానిని విడిచిపుచ్చిన వానికి మేలుకలుగును.

27. విభీషణుఁడు=పౌలస్త్యవంశజుఁడు. విశ్రవస్సునకును, కైకసికినిఁబుట్టినమూఁడవకుమారుఁడు. రావణుని తమ్ముఁడు ఇతఁడు సీతాపహరణము తగదని రావణాసురునకు ధర్మోపదేశముఁ జేయగా, నతండువినక, యవమానముఁగూర్చినందువలన విభీషణుఁడాతనినివదలి రాముని శరణుజొచ్చెను. రాముడాతని కభయంబొసంగి, పిమ్మట లంకాధిపతినిగా జేసెను. ఇతఁడు చిరకాల జీవి.

ఉ॥ కట్టడయైనయట్టి నిజ।కర్మము చుట్టుచువచ్చి యేగతిం
బెట్టునొ పెట్టినట్లనుభ।వింపక తీరదు కాళ్లమీఁదుగా
గిట్టక వ్రేలుడంచుఁ దల।క్రిందుగఁ గట్టిరెయెవ్వరైన నా
చెట్టున గబ్బిలంబులకుఁ।జేరిన కర్మముగాక భాస్కరా. 28

టీ. భాస్కరా! కట్టడ=పూర్వోక్తము. (విధియుక్తము) ఐన అట్టి నిజకర్మము=అయినట్టిప్రారాబ్ధకర్మము, చుట్టుచుఁ=ప్రదక్షిణము చేయుచు, వచ్చి=చనుదెంచి, ఏగతిఁ పెట్టును+ఒ=ఎట్టియాపదలోనఁగూర్చునో, పెట్టిన+అట్లు=అదికలుగఁజేసిన విధముగ, అనుభవింపక తీరదు=పొందకతీరదు. (ఎట్లనగా) ఆచెట్టునఁ గబ్బిలంబులకు=అవృక్షమునఁ దలక్రిందుగా వ్రేలాడు తైలపాయికలకు. (గబ్బిలములకు) చేరినకర్మముకాక=వచ్చిన పూర్వకర్మసంచితముఁగాక, ఎవ్వరు+ఐనఁ=ఏమనుజులైనను, కిట్టక=నోర్వలేక, కాళ్లమీదుగాఁ=తలక్రిందుగాను, వ్రేలుఁడు=వ్రేలాడుచుండుడు. అంచుఁ=అని చెప్పుచు, కట్టిరె=బంధించిరా, (కట్టలేదనియర్థము).

తా. గబ్బిలములను తలక్రిందగా వ్రేలాడుమని పరులెవ్వరు బంధింప కపోయినను, తమ పూర్వజన్మసంచిత ప్రారబ్ధమున నావిధముగ వ్రేలాడు చున్నటులు; విధినిర్ణీత మెట్లుండునో మానవుడట్లు నడువక తప్పదు.

ఉ॥ కట్టడలేనికాలమునఁ।గాదు శుభంబొరు లెంతవారు చే
పట్టిననైన మర్త్యునకు।భాగ్యము రాదను టెల్లగల్ల కా
దెట్టనిపల్కినన్ దశర।థేశ వసిష్ఠులు రామమూర్తికిన్
బట్టముఁగట్టఁగోరి రది। పాయక చేకుఱెనోటు భాస్కరా. 29

టీ. భాస్కరా! మర్త్యునకున్=మనుజునకు. కట్టడ=విధినియమము, లేనికాలమునన్=లేనట్టి సమయమందు, శుభంబు=మంగళప్రదము, కాదు=కానేరదు, ఒరులు=అన్యులు, ఎంతవారు=ఎంతటి ఘనమయినవారు, చేపట్టినన్+ఐనన్=దగ్గరఁజేర్చుకొనినప్పటికిని, భాగ్యము=సంపద, రాదు=చేకూరదు (కలుగదు,) అనుట+ఎల్లన్=అని చెప్పెడిదంతయు, కల్లగాదు=మృషకాదు, (అసత్యముకాదు.) ఎట్లు+అని=ఏప్రకారముగానని, పల్కినన్=నుడివినవో

---

29 దశరథుడు=సూర్యవంశపురాజు. అజమహారాజు కుమారుఁడు. తొల్లి, దేవాసురయుద్ధమునందు, సురలకు సాయంబుచేయఁబోయి, శంబరుఁడను రాక్షసునితోఁపోరు సమయంబున, రక్కసమాయలకు నుక్కడక్కియున్న దశరథరాజునకుఁ, గైకేయి తోడుపడి, ధవళాంగుఁడను మునీశ్వరుఁడొసఁగిన మంత్రవిద్యచే శంబరాసురుని మాయోపాయము లణఁగింప, నారాజేంద్రుఁడామెను మెచ్చుకొనుచు వలయు వరంబులు వేడుకొన మనఁగా, నామె రెండు వరంబులు వడసి సమయమున కిచ్చునట్లొప్పగించుకొనెను. అవరమె రాముని పట్టాభిషేక సమయంబున, నొకటి రామచంద్రునకు వనవాసమును, రెండు భరతుని పట్టాభిషేకమును కైకకోరఁగా, దశరథుఁడు మా

దశరథశ్రీవసిష్ఠులు=దశరథరాజును, వసిష్ఠమహర్షియు, రామమూర్తికిన్=రాముని, పట్టముకట్టన్=పట్టాభిషిక్తునిఁజేయుటకు, కోరిరి=ఇష్టపడిరి. అది=అపట్టాభిషేకము, పాయక=విఘ్నముఁగాకుండ, చేకూరెన్ + ఓటు=జరిగినదా జరుగ లేదనుట.)

తా. రాముని పట్టభద్రునిఁజేయుటకై దశరథ వశిష్ఠాదులెంత శ్రమపడినను, నిష్ఫలమగుటుల, అదృష్టము లేని మానవునకు శుభములు కలుగవు. ఎట్టిధనవంతుఁడు ప్రయత్నించి దరిఁజేర్చుకొన్నను సంపదలురావు.

ర్భాగతుఁడయ్యెను. అంత, మీతండ్రియాజ్ఞగా వనవాసమునకుఁ బొమ్మని కైకేయి రామునకుఁ జెప్పెను. శ్రీ రాముఁడట్లొనర్చెను. వెంటనే దశరథుడు కాలధర్మమునొందెను:—దశరథుని శాపకారణము.—ఒక మునికుమారుఁడు అంధులగు జనని జనకుల తృష్ణదీర్పఁ దటాకమునకేగి కమండలముతో జలము ముంచుచుండఁగా, వేటాడుచుండిన దశరథరాజా నీళ్ళచప్పుడాలించి, మదగజమను భ్రాంతిచే శరాసనంబుఁజేఁబూని బాణము సంధించి విడిచెను. ఆ బాణము మునిపుత్రునిదాపుటచే వెంటనే హా! యని ప్రాణములు విడిచెను. అంతనా మహారాజు తన తప్పిదమునుఁ దెలిసికొన్నవాడై, భయాకులచిత్తంబున నాగ్రుడ్డిదంపతుల చెంతకేగి, ఋషిబాలుని వృత్తాంత మావంతయు నివేదించెను. పాపమా వృద్ధదంపతులు పుత్రశోకమును భరింపలేక, రాజునుఁ గాంచి, నీవును, మావలెనే పుత్రశోకార్తిచేఁ జచ్చెదవుగాకయని శపించి, వెంటనే మృతినొందిరి:—వసిష్ఠుని జన్మవృత్తాంతము.— వసిష్ఠుడుఁ బ్రహ్మమానస పుత్రులలో నొకఁడు. మహాతపశ్శాలి. అర్కవంశజులకుఁబురోహితుఁడు. అరుంధతి వీనిభార్య. ఇతనికి నూరుగురు కుమారులు. సుతశతంబును, విశ్వామిత్రుఁడను రాజఋషి నాశనము జేసెను. ఈతండు దక్షప్రజాపతి తనూజయగు ఊర్జనువివాహమాడి రజుఁడు, గోత్రుఁడు ఊర్ధ్వబాహు

ఉ॥ కానక చేరఁబోల రతికర్మ్ముఁడు నమ్మిక లెన్ని చేసినన్
దానది నమ్మి వానికడఁ డాయఁగఁ బోయిన హానివచ్చు న
చ్చోనది యెట్లనం గొఱకుఁ జూపుచు నొడ్డిన బోను మేలుగాఁ
బోనని కానఁ గాసపడిఁ బోవుచుఁ గూలదె కొక్కు భాస్కరా 30

టీ. భాస్కరా! అతికష్మ్ముడు=పాపపుకార్యముల సేయువాఁడు. ఎన్నినమ్మికలు, మిక్కిలి విశ్వాసములు, చేసినన్—చూపించినను, కానక=యోచింపక, చేరన్+పోలదు—దగ్గఱఁజేరరాదు. తాన్=తాను, (మనుజుఁడు) అది. నమ్మి—అంగీకరించి, (విశ్వసించి) వానికడన్—ఆ పాపియున్న తావును, డాయగన్=చేరగను, పోయినన్=వెళ్ళినచో, అచ్చోన్=అస్థలమందు, హాని=ఆపత్తు, (కీడు) వచ్చున్=సంప్రాప్తమగును. అదియెట్లనన్=అదియేప్రకారమనగా, కొక్కు=పందికొక్కు, కొఱకు=మేతను, చూపుచున్=కనఁబఱచుచు, మేలుగాన్=మంచిగను, ఒడ్డిన=పన్నిన, బోను=జంతువులను బంధించెడి యంత్రమును, (బోనుఅని,) తన్నుఁజంపఁగానునిచినయంత్రమని, కానక, తెలిసికొనలేక, ఆసపడి, అపేక్షఁగలిగి, పోవుచున్=నడచుచు, (అందున ప్రవేశించి) కూలదె=మృతిఁజెందదా? (చచ్చుననియర్థము.)

వు, పవనుఁడు, అనఘుఁడు, సుతపుఁడు, శుక్రుఁడు, అను యేడుగురు పుత్రుల నాపెయందుఁ బడసెను. ఆసుతసప్తకంబును స్వాయంభువ మన్వంతరమున సప్తఋషులుగనుండి యున్నారు. పూర్వమీతఁడు బ్రహ్మమానస పుత్రుఁడైనను, నిమియను ఋషిశాపముచేత, వొల్లింటిశరీరమునను నాశనముగలుగుట వలన, తిరిగి మిత్రావరుణులవు జన్మించెను, ఒకానొక సమయమున, మిత్రావరుణులవు, యూర్వసినిఁ గాంచినప్పుడు రేతస్ఖలితమయి నప్పుడది యొకకుంభమునందుఁ జేర్పఁబడఁగా, నందునుండి యగస్త్యుఁడును, వసిష్ఠుడు జన్మించిరి. అందుకతన వీరిరువును కుంభసంభవులని పేర్కొనఁబడిరి.

తా. తన్ను జంపుకొఱకు నొడ్డినబోను యందుఁగల పదార్థమున కాసించి, నిజము గ్రహింపలేక, నందుఁజొచ్చి, మృతిజెందు, పందికొక్కు విధముగ; పాపాత్ముఁడునమ్మికలెన్ని వక్కాణించినను, చెంతఁజేరరాదు; అటులఁజేరిన, దప్పక హానికలుగును.

ఉ॥ కానిప్రయోజనంబు సమ • కట్టదు తాభువి నెంతవిద్యవా
డైనను దొడ్డరాజుకొడు • కైనన దెట్లు? మహేశుపట్టివి
ద్యానిధి సర్వవిద్యలకు • దానె గురుండు వినాయకుండు దా
నేనుఁగురీతినుండియున • దేమిటికాడఁడు పెండ్లి భాస్కరా 31

టీ. భాస్కరా! భువిన్=భూమియందు, తాన్=తాను, ఎంతవిద్యావాఁడు + ఐనను=ఎంతటి విద్యకలవాఁడైనను, దొడ్డరాజు కొడుకు=గొప్పభూపతియొక్క, పుత్రుఁడు ఐనన్=అయినప్పటికిని=కాని ప్రయోజనంబు=అనుకూలపడని, కార్యము, సమకట్టదు, నెఱవేరదు, అది + ఎట్లనగా మహేశుపట్టి = ఈశ్వరునికొడుకు, విద్యానిధి = చదువుల మనికిపట్టు, సర్వవిద్యలకున్=అన్ని చదువులకు, తాన్=తానొక్కఁడె, గురుండు=ఒజ్జ, వినాయకుండు=అయినట్టిగణనాథుఁడు, తాన్=తాను, ఏనుగురీతి=గజము వలెనే, ఉండియున్=(అనఁగా ఏనుగంతజవసత్వముఁగలవాఁడయి యున్నప్పటికిని), పెండ్లి=వైవాహికము, ఏమిటికిన్ = ఏహేతువుచేత, ఆడఁడు = చేసికొనఁడు.

తా. ఈశ్వరపుత్రుండును, సర్వవిద్యలకధినాధుండును, అందరకునుపదేశకుఁడును, నేనుగంత బలపరాక్రముఁగలవాఁడైనను వివాహమాడలేక పోయినటుల; లోకములో మనుజుఁ డెట్టివిద్వత్తుగలవాఁడైనను, మహారాజకుమారుఁడైనను, ఈశ్వరానుగ్రహములేని కార్యమును జేసికొనలేడు.

ఉ॥ కామితవస్తుసంపదలు • గల్గుఫలం బొరు లాసవడ్డచో
నేమియుఁ బెట్టఁడేని సిరి • యేటికి? నిష్ఫల మున్నఁ బోయినన్
బ్రామికవడ్డ లోకులకుఁ • బండఁగనే మది యెండిపోవఁగా
నేమిఫలంబు? చేఁదు విడ • దెన్నటికైన ముసిండి భాస్కరా.

టీ. భాస్కరా! ఒరులు=ఇతరులు, కామితవస్తుసంపదలు = కోరిన పదార్థములయొక్క సంపత్తులు, కల్గుఫలంబు=కలిగిన ఫలమును, ఆసపడ్డచోన్=కాంక్షించినప్పుడు, ఏమియున్=ఇంచుకంతయు, పెట్టఁడేని=(ధనవంతుఁడు) ఒసంగకపోయినేని, సిరి=లక్ష్మి, (సంపదలు) ఏటికిన్=ఎందులకు, ఉన్నన్=ఉన్నప్పటికిని, పోయినన్=పాడయిపోయినప్పటికిని, నిష్ఫలము=ప్రయోజనములేనిది. ముసిండి=ముష్టిచెట్టు, ఎన్నటికైనన్=ఏనాటికైనను, చేదు=విసమును, విడదు=విడువదు, అది=అట్టిముసిణిచెట్టు=పండగన్ + ఏమి=ఫలించిననేమి, ఎండిపోవఁగాన్=ఎండి పడిపోవునప్పుడైనను, భ్రామికపడ్డ లోకులకున్= భ్రాంతిజెందిన మనుజులకు, ఏమిఫలంబు=ఏమియును లాభము లేదు.

తా. ఎంతకాలమైనను ముసిడిచెట్టు చేదును విడువనప్పుడా చెట్టు పండినను, యెండినను భ్రాంతిచే దాని నాశ్రయించువారలకు లాభము లేనట్టులే; ధనవంతుఁడు తన్నుగొల్చెడి యర్థుల నాదరింపఁడేని, వాని సంపదలున్నను, యూడినను నొకటియే.

ఉ॥ కారణమైన కర్మములు • కాక దిగంబడ వెన్ని గొందులం
దూఁటిన నెంతవారలకుఁ; • దొల్లి పరీక్షితు శాపభీతుఁడై
వారిధి నొప్పు నుప్పరిగ • పైఁ బదిలంబుగ డాఁగియుండినన్
గ్రూరభుజంగదంతహతిఁ • గూలఁడె లోకులెఱుంగ భాస్కరా.

టీ. భాస్కర! ఎన్నిగొందులన్=ఎన్ని సందులలో, చూరినన్ = దాగి యుండినను, ఎంతవారలమన్=ఎట్టిమహాత్ముల మను, కారణము=హేతువు, వినకర్మముల్=అగుకర్మములు, కాక=అనుభవముఁగాకుండ, దిగంబడవు=నాశనము కావు, (ఎట్లన) తొల్లి=పూర్వమున, (కలియుగారంభమున) పరీక్షితు=పరీక్షిన్మహారాజు, శాపభీతుఁడై=శాపమువలనభయభ్రాంతుఁడై, వారిధిన్=కడలియందు, ఒప్పు=ఒప్పుచున్న, ఉప్పరిగపైన్=సౌధముపైన, పదిలంబుగన్=భద్రముగా, డాగియుండినన్=దాగికొనియున్నను, వ్రహర=భయప్రదపైన, భుజంగ=మండలియొక్క, (పన్నగముయొక్క) దంత=కోఱలయొక్క, హతిన్=దెబ్బచేత, లోకులు=ప్రజలు, ఎఱుంగన్ = తెలిసికొనునట్లుగా, కూలఁడు + ఏ=ప్రాణములఁగోలుపోవఁడా? (అనగాఁజెప్పెననుట.)

తా. పరీక్షిన్మహారాజు మునీశ్వరుఁ శాపభీతిచే సముద్రమధ్యమున మేడగట్టించుకొని డాగియుండినను సర్పదష్టుఁడైనటుల; నెంతటివారైననుఁ దామనుభవింపవలసిన కర్మములు దాట నెందుఁజొచ్చినను, ననుభవింపక తీరదు.

---

48. పరీక్షిత్తు= అభిమన్యునకు నుత్తరయందుఁ బుట్టినకుమారుఁడు. ఇతని తాత అర్జునుఁడు. ఇతఁడు, పాండవయుద్ధానంతరమున రాజయ్యెను. ఒకానొక సమయంబున నితండు వేటకుఁబోయి, మార్గములో నొకముని నిష్ఠయందుఁ గూర్చుండగా, నటఁచచ్చిపడియున్న పన్నగము నాతని మెడలో వైచెను. పిమ్మట, నాఋషిపుత్రుఁ డదివిని, యిట్టిపాపకార్య మాచరించిన దుర్మార్గుఁడు నేటి కేడవదినంబున పాముచేఁ జచ్చుఁగాకయని శపింపఁగా, పరీక్షిత్తు దద్దానికి భయపడి, నడిసముద్రమున నొకమేడనిర్మించుకొని యందుండఁగా నట నొకబ్రాహ్మణుఁ డొసఁగిన ఫలంబును వాసనఁజూచుచుండ, నాఫలము పాముగామారి వానిని గఱచి చంపెను.

చ॥ కులమున నక్కడక్కడ న • కుంఠిత ధార్మికుఁ డొక్కఁడొక్కఁడే
కలిగెడుఁగాక పెంపెడలుచు • గల్గఁగనేరరు, చెట్టుచెట్టునన్
గలుగఁగనేర్చునే గొడుగు • కామలు చూడఁగ నాడనాడ నిం
పలరఁగ నొక్కటొక్కటిన • యంబునఁ జేకుఱుఁగాక భాస్కరా

టీ. భాస్కరా! అకుంఠిత ధార్మికుఁడు=వెనుకాడని ధర్మబుద్ధిఁగలవాఁడు, కులమునన్=వంగడమందు, అక్కడక్కడన్=ఒక్కొకస్థలమునందుఁ ఒక్కఁడొక్కఁడే=ఒక్కొక్కఁడే, కలిగెడుఁగాక=ఉండునుగాక, పెంపెడలుచు=మిగులయధికముగా, కల్గనేరరు=కలిగియుండరు, చూడఁగన్=విచారింపఁగా, గొడుగుకామలు=గొడుగుకట్టలు, ఆడనాడన్=అందందున, ఇంపు+అలరన్=ఒప్పారినట్లుగా, నయమునన్=తిన్నగా, ఒక్కొటొక్కటి=ఒక్కొటొక్కటియే, చేకుఱున్+కాక=ప్రాప్తించునుగాక, చెట్టుచెట్టునన్=ప్రతిచెట్టుయందును, కలుగఁగనేర్చున్+ఎ=సంభవించునా? (అనఁగా ఉండదనుట.)

తా. ఛత్రమునకు సమర్థమైనదగిన తిన్ననికఱ్ఱ లెక్కడనో యొక్కొక చెట్టున నుదయించునుగాని, ప్రతివృక్షమునందును వంకరలేనివి లభింపనట్లే మంచిబుద్ధిఁగలవాఁ డెక్కడనో యొక్కొక్క వంగడమందు జనించును గాని, తఱుచుగానుండఁడు.

ఉ॥ క్రూర మనస్కులయి పతు లొఁ గొల్చి వసించిన మంచివారికిన్
వారిగుణంబె పట్టి చెడు । వర్తన వాటిలు; మాధురీజలో
ధారలు గౌతమీముఖ మ । హానదులంబుధిఁ గూడి నంతనే
క్షారముఁ జెందవే మొదలి । కట్టడలన్నియుఁదప్పి భాస్కరా!

టీ. భాస్కరా! క్రూరమనస్కులు=కఠినమతులు, ఔ పతులన్=అయినట్టి రాజులను, కొల్చి=సేవించి, వసించిన మంచివానికిన్=ఉన్నట్టి

యోగ్యులను, వారిగుణంబె=ఆరాజుల దుస్స్వభావమే, పట్టి=అభ్యాసపడి. చెడువర్తన=చెడ్డనడవడి,పాటిలుఁన్=సంప్రాప్తమగును, (ఎట్లన) మాధురీ=మాధుర్యముతోఁగూడిన (తియ్యదనముతోఁగూడిన) జల=నీటిచేత, ఉదారలు=ఘనమగు, గౌతమీ=గోదావరి, ముఖ=మొదలుగాగల, మహానదులు=మిక్కిలి గొప్పనదులు, అంబుధిన్=సాగరమును, కూడినంతనె=సంగమమైనయంతనె, (కలిసినమాత్రముచేతనే) మొదలికట్టడలు + అన్నియున్=తొలుతఁగల మాధుర్య గుణాగుణములన్నియు, తప్పి=విడిచి, క్షారమున్=ఉప్పదనమును, చెందవు + ఎ=పొందవుండునా? (పొందునని యర్థము.)

తా. మధురములగు జలముతో నొప్పారెడి మహానదులన్నియు సముద్రమునఁ జేరినంతనే తొల్లింటిరుచులఁ బోవిడిచి యుప్పదనమందు విధముగా; కఠినకర్ముఁడగు రాజునుఁ గొల్చెడి మంచివారుగూడ, తమ తమసద్గుణంబుల విడనాడి యాభూమిపతి దుర్గుణంబులను, బొంది దుర్మార్గవర్తనులగుదురు.

ఉ॥ గిట్టుటకేడఁ గట్టడ లి। ఖంచిన నచ్చటఁగాని యొందుచోఁ
బుట్టదుచావు: జానువుల । పున్కలనూడిచి కాశిఁజావఁ గా
లట్టిన శూద్రకున్ భ్రమలఁ। గప్పుచుఁ దద్విధి గుట్టమాచునా
పట్టునఁగొంచు మట్టికడఁ। బ్రాణముదీసెఁగదయ్యభాస్కరా,

టీ. భాస్కరా! గిట్టుటకున్=మృతిజెందుటకు, ఎడన్=ఎక్కడ, ట్టడ=నియమము, లిఖించినన్=(నలువ) వ్రాసినయెడల, అచ్చటన్ + ాని=అప్రదేశమందకాని, ఒండుచోన్=వేఱొకస్థలమందు, చావు=మృతి, ట్టదు=సంప్రాప్తముకాదు (కలుగదు) ఎట్లనఁగా; కాశిన్=కాశీపట్టణమునందు, చావన్=చనిపోవుటకు,జానువుల=మోకాళ్ళయొక్క పున్కలన్=ప్పలను, ఊడిచి=ఊడదీసికొని, కాలట్టిన శూద్రకున్=కృతనిశ్చయుఁడైన

శూద్రక మహారాజు, భ్రమలన్=మాయలచే, కప్పుచున్=సమీపించుచు, తత్ + విధి=ఆదైవము, గుఱ్ఱము + ఔచున్=ఒకతురగము రూపమును దాలిచి, అపట్టునన్=ఆసన్నకాలము సమీపించు వేళను, కొంచున్= తనపైన నెక్కించుకొని పోవుచు, మఱ్ఱికడన్= ఒకమఱ్ఱివృక్షమునొద్ద, ప్రాణమున్ =జీవమును, తీసెన్ + కద + అయ్యా=తీసెను గదా.

తా. శూద్రకుఁడను మహారాజు కాశీక్షేత్రమునఁ జావసంసిద్ధుఁడై తనమోకాలి చిప్పల నూడదీసికొని, యచ్చటనె వసించియుండగా, దైవ మొక గుఱ్ఱమై, వానిని తనవీపుమీద నెక్కించుకొనిపోయి, యొకమఱ్ఱివృక్షముకడఁ బ్రాణముదీసెను. కావునఁ, జచ్చుట కేస్థలంబున విధి విధించెనో, యచ్చటఁగాక మఱియొండు చోటున మృతినొందఁడు.

చ॥ ఘనబల సత్త్వమచ్చుపడఁ । గల్గినవానికి హాని లేనిచోఁ
దనదగు సత్త్వమే చెఱుచుఁ దన్నుఁ: నదెట్లన? నీరులావుగాఁ
గనువసియించినన్ జెఱువు!కట్టకు సత్త్వము చాలకున్నచోఁ
గనుమలుపెట్టి నట్టనడి।గండి తెగంబడకున్నె భాస్కరా. 32

టీ. భాస్కరా! ఘనబలసత్త్వము=మిక్కిలి బలముతోఁ గూడిన సత్త్వ, కల్గినవానికిన్=కలిగియున్నమానవునకు, హాని=చేటు, (కీడు) లేనిచోన్ =(ఇతరులవలన) లేకున్నను, తనది=తన సంబంధమైయున్నది. అగు సత్త్వము=అయినట్టి బలము తన్నున్=తన్ను, చెఱుచున్=చెడఁగొట్టును. అది + ఎట్లు + అనన్=అది యేవిధముగాననగా, నీరు=ఉదకము, లావుకాన్ + కన్=అధికముగ, వసించినన్=ఉండినప్పుడు, చెఱువుకట్టకున్=కొలనుగట్టునకు, సత్త్వము= సత్తువ (బలము) చాలకున్నచోన్=సరిపోవకున్నచో, కనుమలు= సందులు, పెట్టి=పడి, నట్టనడిగండి=ఆచెఱువుగట్టున మధ్యబిలము, తెగంబడక, తెగకుండ, ఉన్నె=ఉండునో. (ఉండని యర్థము)

తా. కొలనులో జలమెక్కువగా నున్నప్పుడు చెఱువుగట్టునకు బలములేనియడల నడుమనుండిన గండి తెగిపోవునట్లుగా, తాను బలరాక్రముఁడగుటచే నితరులవలన హానికలుగకున్ననుఁ దనసత్తువయేఁ దన్ను నాశనము జేయును.

చ॥ ఘనుఁడగు నట్టివాఁడు నిజ। కార్య సముద్ధరణార్థమై మహిం
బనివడి యల్పమానవుని। ప్రార్థనచేయుట తప్పుగాదుగా;
యనఘత కృష్ణజన్మమున।నావసుదేవుఁడు మీఁదఁ బెత్తుగా
గనుఁగొని గాలిగానికడ కాళ్లకు మ్రొక్కఁడెనాడు భాస్కరా ౩౮

టీ. భాస్కరా! ఘనుఁడు=అధికుఁడు, అగునట్టివాఁడు=అయినట్టి మనుష్యుఁడు, నిజ=తనయొక్క=కార్య=పనిని, సముద్ధరణ + అర్థము=నెరవేర్చుకొనుటకై, మహిన్=ధరయందు, పనివడి=ప్రయత్నముచేసి, అల్పమానవునిన్=నీచమలజుని, ప్రార్థనచేయుట=స్తోత్రము సేయుటఁ తప్పుకాదుకా=నేరము కాదుగదా, (ఎట్లనగా) కృష్ణజన్మమునన్= శ్రీకృష్ణ జననకాలమున,

---

38 వసుదేవుఁడు:—దేవకీదేవిభర్త. శ్రీకృష్ణ బలరాములకుఁ దండ్రి కంసరాజునకు బావమఱఁది దేవకీదేవి యష్టమగర్భమునందుదయించిన వాఁడు తనప్రాణంబు లపహరించునని కంసుఁడు దేవకీవసుదేవుల ఖైదుజేసెను. పుట్టినబిడ్డలనెల్లఁ దనపొట్టఁ బెట్టుకొను చుండెను. పిమ్మట నష్టమగర్భంబున శ్రీకృష్ణుఁడవతరించెను. తండ్రియగు వసుదేవుఁడాబిడ్డను సంరక్షింపఁ జేరుపనున్న ద్రేపల్లెకుఁ బోవుసమయమున, కంసరాజాజ్ఞను, ద్వారమునఁగాపుపెట్టిన గాడిదను గాంచి, కార్యభంగమగు నేమోయని, దానికడ కాళ్ళకు నమస్కరించి, సఫలీకృత మనోరథుఁడయ్యెనని పుక్కిటపురాణంబుగాఁ జెప్పుకొను చుందురుగాని, వేదములఁ గనఁబడదు.

అనఘతన్=నిర్మల హృదయముచేత, ఆ వసుదేవుఁడు=కృష్ణునిగన్న తండ్రి యగు, వసుదేవుఁడు,మీఁదపెట్టుగాన్=జరుగఁబోవు కార్యమునకు పన్నుగడగా, కనుఁగొని=తలఁచి, నాఁడు=తొల్లి, గాలిగాని కడకాళ్ళకున్=గాడిదయొక్క వెనుకపాదములకు, మ్రొక్కఁడు + ఏ=నమస్కరింపలేదా (అనగా నమస్కరించె ననుట)

తా॥ శ్రీకృష్ణుఁడవతరించఁగా నతనికిఁగంసునివలన హాని లేకుండ వ్రేపల్లెకుఁ గొనిపోవుచు, కార్యము విఘ్నముఁగాకుండు నటుల గాడిదకాళ్లకు వసుదేవుఁడు నమస్కరించిన విధముగా, లోకంబున మానవుఁడు స్వకార్య నిర్వాహణార్థమునకొక నీచుని బ్రార్థించినను, గౌరవమునకు హానిలేదు.

చ॥ ఘనుఁడొకవేళఁగీడ్పడినఁ • గ్రమ్మఱ నాతని లేమివాపఁగా
గనుఁగొననొక్కసత్ప్రభువు •గాక నరాధములోపరెందఱుం
బెనుఁజెఱువెండినట్టి తఱి • బెల్లున మేఘుఁడుగాక నీటితోఁ
దనుపఁదుషారముల్ శతశ•తంబులుచాలునటయ్య భాస్కరా

టీ॥ భాస్కరా! ఒకవేళన్=ఒకకాలమందు, ఘనుఁడు=అధికుఁడు కీడ్పడినన్=హానిఁజెందినచో (పేదయైనచో) క్రమ్మఱన్=తిరిగి, అతని లేమి=అతని పేదఱికము, వాపగాన్=బాపుటకు, (పోగొట్టుటకు) ఒక్క సత్ప్రభువుగాక=మహారాజుగాక, నర + అధములు=నీచమానవులు, ఎందఱున్=చాలమందియయినను, ఓపరు=తగరు, ఏట్టులనగా:— పెనుచెఱువు, గొప్పతటాకము, ఎండిన + అట్టితఱిన్=నీరెండిపోయిన సమయమున, పెల్లునన్=తక్షణమె, నీటితో=ఉదకముచేత, తనుపన్=నిండించుటకు, మేఘుఁడుగాక=మేఘములుగాక, తుషారముల్=మంచు తుంపరులు, శతశతంబులు నూఱులైనను, చాలునటయ్య=సరిపోవునా? (సమర్థములు కావని అర్థము.)

తా॥ ఒక గొప్పచెఱువు యెండిపోయినప్పుడు, మరలవానిని నిండింపవలెనన్న

మేఘశకులం తగుగాని,మంచుబిందువు లెన్నియయినను,ప్రయోజనము లేనటులఁ; విధివశమున గొప్పవానికి పేదఱికము సంభవించినచో నట్టిదానిని తొలఁగింప గొప్ప రాజేంద్రునకుఁ దగుఁగాని, తుచ్ఛమానవు లెందఱున్నను బాగుజేయ నసమర్థులు.

ఉ॥ చంద్రకళావతంసు కృప • చాలనినాఁడుమహాత్ముఁడైనఁదా
సాంద్రవిభూతిబాసియొక • జాతివిహీనునిఁగొల్చియుంటయో
గీంద్రనుతాంఘ్రిపద్మమతి • హీనతనొందుట కాదుగా హరి
శ్చంద్రుడువీరబాహునిని•జంబుగఁగొల్వఁడెనాఁడుభాస్కరా.

టీ॥ యోగీంద్ర=మునీశ్వరులచేత. నుత=స్తుతింపఁబడు. అంఘ్రి

---

40 హరిశ్చంద్రుడు=త్రిశంకునందనుఁడు. రవికులజుఁడు, నవఖండ మండలాధిపతి, భార్య చంద్రమతి. కుమారుఁడు లోహితాస్యుఁడు. మంత్రి సత్యకీర్తి, అయోధ్యా పురాధీశ్వరుడు. ఇతఁడు యజ్ఞార్థము విశ్వామిత్రునకు ధనంబొసఁగ వాగ్దత్తముచేసి యుండెను. దేవేంద్రుని సమక్షము న్ప్రతినఁబూనిన విశ్వామిత్రుఁడు: తన ప్రతిజ్ఞా పరిపాలన కెటువేర్పు కొను టకై, మాలకన్నియలను వివాహమాడ వలసినదిగా హరిశ్చంద్రుని నిర్బంధింప, రాజేంద్రుడంత పదచ్యుతికైనను నొప్పుకొనును గాని యా కన్నియల హరింపనని భీష్మించెను. ఆ మిషచే మునీశ్వరుఁడు రాజును రాజ్యభ్రష్టుగావించి, యజ్ఞార్థమొసంగిన ధనంబుగూడ నిచ్చి పొమ్మని పలికెను. రాజువల్లెయని, సతీ, సుతసమేతుఁడుగా కాశీపురముజేరి, భార్యయగు చంద్రమతీదేవి యొక్క నొక భూసురునకు విక్రయించి తానొక మాలవాసికమ్ముఁబడిఋణ విముక్తుడై కొంతకాలము ఛండాలవాని దాస్యం బొనరించి, పిమ్మటమహేశ్వరానుగ్రహ మున, సుత, సతీసమేతముగ మరల తన రాజ్యాదిభోగములఁ గైకొనెను.

పద్మ=పాదపద్మములు, గలవాఁడ, భాస్కరా! మహాత్ముఁడు + అయినన్= గొప్ప మనుజుఁడైనను, చంద్రకళా + అవతంసుకృప=శశిరేఖశిరోభూషణముఁ గాగల మహేశ్వరునియొక్క దయ, చాలనిఁ నాఁడు=లేనికాలమందు, తాన్=ఆ మానవుఁడు, సాంద్రవిభూతిన్=ఘనమైన సంపదను పాసి=వదలి ఒకజాతి విహీనునిన్=ఒక నీచ కులోద్భవుని. కొల్చి ఉండుట.=సేవించియుండుట, మతివిహీనత=తెలివితెమి. కాదుగా=కాదు. గదా, నాఁడు=తొల్లి (కృతయుగము నందు) హరిశ్చంద్రుఁడు=హరిశ్చంద్ర మహారాజు. వీరబాహునిన్=వీరబాహుఁడను చండాలుని,నిజంబుగన్=నిశ్చయముగ, కొల్వఁడు + ఏ=కొలువలెదా? (సేవించెనని యర్థము).

తా హరిశ్చంద్రుఁడు మహారాజైనను, యీశ్వరానుగ్రహము లెనికతన. వీరబాహుఁడను మాలవానినిఁ గొలిచినటులు; భగవత్కృపలేని సమయమున. నెంతటి గొప్పవాడైనను సంపదలఁగోలుపోయి నీచు నొక్కని సేవించుట. నిజము అదియొక బుద్ధిమాంద్యముకాను.

ఉ॥ చక్కఁదలంపఁగా విధివ • శంబున నల్పునిచేతనైనఁ దా
జిక్కి యవస్థలుంబొరలుఁ • జెప్పఁగరానిమహాబలాఢ్యుడున్
మిక్కిలి సత్వసంపదల • మీఱినగంధగజంబు మావటీఁ
డెక్కియదల్చి కొట్టికుదిఁయించినుండదెయోర్చిభాస్కరా. 4

టీ. భాస్కరా! చక్కన్=బాగుగా, తలంపన్=విచారింపగా, చెప్పన్=నుడువుటకు (చెప్పుటకు) రాని మహాబలాఢ్యుఁడున్=అపార బలముఁగలవాడయినను, తాన్=తాను, విధివశంబునన్=దైవ వశముచేత, అల్పునిచేతన్ + అయినన్=తుచ్ఛుని చేతిలోనైనను, చిక్కి=తగులుకొని (చిక్కుపడి) అవస్థలన్=కష్టములను, పొరలున్=కలుగుచుండును, ఎట్లనః- మావటీడు=గజమును సాకువాఁడు, ఎక్కి=దానిమీదకూర్చుండి, అదల్చి=

భయపెట్టి, కొట్టి=అంకుశములతోఁబొడిచి, కదియించినన్=లొంగునట్లు, చేసినప్పటికిని, మిక్కిలి=అధికమగు, సత్వసంపదలన్ = బలసమృద్ధిచేత, మీఱిన=పరాక్రమించిన, గంధగజంబు=మదించినయేనుఁగు, ఓర్చి=సహించి, ఉండదు + ఎ=ఉండలెదా? (ఓర్చియుండునని యర్థము)

తా. మిగుల సత్త్వముఁగల మదపుటేనుగు, మావటీఁడు తనపై నెక్కి కూర్చుండినను, అదలించినను, అంకుశముతోఁ బొడుచుచుండఁ జేసినను, వాని నన్నింటి నోర్చుకొనినట్లే; ఎంతటి బలాధిక్యతఁగల వాడైనను విధివశమున, నల్పునిచే జిక్కి దురవస్థలఁ బొందుచుండును,

చ॥ చదువదియెంతఁగల్గిన, ర • సజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ • సంయుతలెవ్వరు మెచ్చరెచ్చటం
బదనుగ మంచికూర నల • పాకముచేసిననైన నందునిం
పొదవెడు నుప్పు లేకరుచి • పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా 42

టీ. భాస్కరా! చదువుఅది=విద్య, ఎంతకల్గినన్=ఎంతయెక్కువ యున్నప్పటికిని, రసజ్ఞత=సారము సంగ్రహించుట, ఇంచుక=కొంచెము, ఎచ్చటన్=ఎందైనను, గుణసంయుతులు=మంచిగుణములుకలవారు, ఎవ్వరున్ = ఎవరైనను, మెచ్చరు=నుతియింపరు, ఎట్లనఁగా:—మంచికూరను, పదనుగన్= పక్వముగా, నలపాకమున్=నలుడుచేసిన పాకముఁబోలెడి పాకమును, చేసినన్=వండినప్పటికిని, అందున్=ఆకూరలో, ఇంపు + ఒదవెడు + ఉప్పు=రుచి, కలిగించెడు లవణము- లేక=లేకుండిన రుచి=చవిపుట్టగ నేర్చు నటయ్య=కలుగునయ్యా! కలుగదని యర్థము.

తా. కూరనెంత బాగుగా వండినను, దానియందు లవణము కలియక పోయిన రుచియుండదు. దానినెవ్వరు విశ్వసింపరు. అట్లే మనుజుఁడెంత విద్యావంతుడైనను, రసగ్రహణ శక్తి లేకున్న, వాని చదువంతయు నిరర్థకమగుటయేగాక, గుణగ్రహణ పారీణులెవ్వరును వానిని గణింపరు.

ఉ॥ చాలఁబవిత్రవంశమున • సంజనితుండగునేని యెట్టి దు
శ్శీలునినైనఁ దత్కులవి • శేషముచేనొకపుణ్యుఁడెంతయుఁ
దాలిమినుద్ధరించును; సు • ధానిధిఁబుట్టఁగఁగాదె శంభుఁడా
హాలహలానలంబుగళ • మందుధరించుటకుపూనిభాస్కరా. 43

టీ. భాస్కరా. చాలన్=మిగుల, పవిత్రవంశమునన్=పావనమైన కులమందు, సంజనితుండు=ఉదయించినవాఁడు, అగున్ + ఏని= అయిన యెడల, తత్ + కులవిశేషముచేతన్=వానికులగౌరవముచే, ఎట్టి దుశ్శీలునినైనన్=ఎటువంటి దుర్మార్గునినైనను, ఒకపుణ్యుఁడు=ఒకపుణ్యవంతుఁడు, ఎంతయున్=మిగుల, తాలిమిన్=ఓర్పుచేత, ఉద్ధరించును=సంరక్షించును, ఎట్టులన:—శంభుఁడు=మహేశ్వరుఁడు, పూని=ప్రయత్నమొనరించి, ఆహాలహలానలంబు=ఆహాలాహలమనెడి యగ్నిజ్వాలను, గళమందున్=కంఠమందు, ధరించుట=తాల్చుట, సుధానిధిన్=పాలసముద్రమునందు, పుట్టఁగన్ + కాదె=జనించుటచేతనే గదా

తా. హాలాహలమనెడి భయంకరాగ్ని క్షీరసాగరమున జన్మించిన దను హేతువుచేత నీశ్వరుఁడు గళమందునఁ ధరించినటుల; ఎట్టిదుర్మార్గుఁడైనను సద్వంశమునఁ బుట్టుటచేఁ దత్కులగౌరవమువలన, బుణ్యాత్ముఁడెవ్వఁడేని వానిని గౌరవించి కాపాడును.

---

48. దేవదానవు లమృతమునకై పాలకడలిని దరువఁగా హాలాహలమనెడి విషాగ్నియందుఁబుట్టి, జగత్సంక్షోభముఁజేయుచుండ, దేవతాప్రార్థనమువలన శంకరుఁడావిషాగ్నిని తన కంఠమందు నిడుకొనిలోకములకుశాంతిం గలిగించెను. తత్కారణమున గరళకంఠుఁడు, నీలగళుఁడు, శ్రీకంఠుఁడుం విషగళుండు నని యీశ్వరుడు పేర్కొనఁబడు చుండెను.

ఉ॥ చేరిబలాధికుండెఱిఁగి • చెప్పినకార్యము చేయకుండినన్
బారము ముట్టలేఁడొకనెపంబునఁ దాఁజెడు నెట్టిధన్యుఁడున్
బోరక పాండుపుత్రులకు • భూస్థలిభాగము పెట్టుమన్న కం
సారినిగాకుచేసిచెడఁ • డాయెనె కౌరవభర్త భాస్కరా. 44

టీ. భాస్కరా! బల + అధికుఁడు=బలముఁగల గొప్పవాఁడు, చేరి=దగ్గరకువచ్చి, ఎఱిఁగి=(ముందురాబోవు విషయమును) గ్రహించి, చెప్పిన కార్యము=చెప్పినట్టిపని, చేయక × ఉండినన్=చేయకున్నయెడల, ఎట్టి ధన్యుఁడు=ఎటువంటి ధన్యాత్ముఁడును, పారము=కడను, ముట్టలేఁడు=పొంద జాలఁడు, ఒక నెపంబునన్=ఒక హేతువుచే, తాన్=తాను, చెడున్=పాడయి పోవును, ఎట్లనఁగా:— పాండుపుత్రులకున్ = పాండురాజుకుమారులకు భూస్థలిన్=భూమిని, భాగము పెట్టుము=సగపాలొసఁగుము, అన్న కంసారిని= అనిన శ్రీకృష్ణభగవానుని, కాకుచేసి=తిరస్కరించి (నిందించి) కౌరవభర్త= దుర్యోధనమహారాజు, చెడఁడాయెనె=చెడిపోవలేదా? (చెడెననుట.)

తా. శ్రీకృష్ణమూర్తి సుయోధనుయొద్దకరిగి పాండవులకర్ధరాజ్యంబు నొసఁగుమని యెంతయో బోధింపఁగా నతనిమాటలు నిరాకరించి దుర్యోధనుఁ డస్తమించెను. అప్రకారముగ బలశాలి తనవద్దకే తెంచి చెప్పినకార్యము నిర్వహింపనిచో శీఘ్రకాలమున నశించిపోవును.

ఉ॥ చేసినదుష్టచేష్ట నది • చెప్పక నేర్పునఁ గప్పిపుచ్చి తా
మూసినయంతటన్ బయలు•ముట్టకయుండ దదెట్లు రాగిపై
బూసిన బంగరుం జెదరి•పోవఁగడంగిననాఁడు నాటికిన్
దాసినరాగి గానఁబడ • దాజనులెల్ల నెఱుంగ భాస్కరా. 45

టీ. భాస్కరా! మనుష్యుఁడు, చేసినదుష్టచేష్టన్=తాఁజేసినచెడ్డ కార్యము, చెప్పక=పరులకెఱిఁగింపక, నేర్పునన్=తెలివిచేత, కప్పిపుచ్చి=

చాటొనర్చి, తాన్=తాను, మూసినయంతటన్=అగపడకుండ జేసినను, బయలుముట్టక=బయలుపడక, ఉండను. అది + ఎట్లు=అదియెట్లనఁగా, రాగిపైన్=రాగిమీద, పూసినబంగరున్=పూతపెట్టినబంగారము, చెదరిపోవన్=చెదరిపోవుటను, కడంగినన్=ప్రారంభించఁగా, నాడునాటికిన్=క్రమక్రమమున, దాఁగినరాగి=అంటియున్నతామ్రము, జనులు + ఎల్లన్=జనులందఱు, ఎఱుంగన్=తెలియునట్లు, కానఁబడదా=కనబడలేదా? (కానుపించుచున్నది.)

తా. రాగిపైఁ బూతవెట్టినబంగారము చెదరిపోయినతోడనే, యందున్నతామ్రము యెల్లవారలకుఁ గానుపించునటుల పాపాత్ముఁడు తాఁజేసిన దుష్కార్యములు గప్పిపుచ్చినను లోకమునకుఁ దెలియకమానదు.

చ॥ తగిలిమదంబుచే నెదిరిఁ దన్ను నెఱుంగక దొడ్డవానితోఁ
బగఁగొని పోరుటెల్ల నతి పామరుఁడై చెడుటింతె కాక తా
నెగడి జయింపనేరఁ డది నిక్కముతప్పదు; ధాత్రిలోపలన్
దెగియొకకొండతోఁ దగరు దీకొని తాఁకిన నేమిభాస్కరా. 46

టీ. భాస్కరా! తగిలి=వెంటఁబడి, మదంబుచేన్=మత్తతచేత, ఎదిరిన్=పగతురబలమును, ఎఱుంగక=తన్నును=తనబలమును తెలిసికొనలేక, దొడ్డవానితో, పగన్ + కొని=విరోధమువహించి, పోరుట + ఎల్లన్=కలహించుటంతయు, అతిపామరుఁడు + ఐ=శుద్ధమూర్ఖుఁడై చెడుట=పాడగుటయె, ఇంతెకాక=ఇంతకంటెవేఱుగా, తాన్=తాను, నెగడి=వృద్ధిఁజెంది, జయింపనేరఁడు=సాధింపఁజాలఁడు, నిక్కము=నిజము, తప్పదు=ఇదితప్పిపోదు, ధాత్రిలోపలన్=భూమియందు, తగరు=గొఱ్ఱెపోతు, తెగి=సాహసముతో, ఒక్కకొండతోన్=ఒకఅద్రితో, దీకొని=ఎదిరించి, తాఁకినన్=తలపడిననేమి=ఏమిఫలము? (ఫలము లేదనుట.)

తా. గొఱ్ఱెపొట్టేలు సాహసించి యొకపర్వతముతోఁ డీకొనినచోఁ దలపుఱ్ఱె బ్రద్దలగుటతప్ప ఫలమింతయు లేకపోవునట్లు, బలహీనుఁడు తన బలమును, యెదిరిబలమును యోజనసేయక, బల్లిదునితోఁ గలహించినఁ దాను నాశనమగుటయెగాని లాభము లేదు.

చ॥ తడవఁగరాదు దుష్టగుణుఁ • దత్త్వ మెఱుంగక యెవ్వరైననా
చెడుగుణ మిట్లు వల్వదని • చెప్పినఁ గ్రక్కునఁ గోపచిత్తుఁడై
కడుఁ దెగఁ జూచుఁగా, మఱుఁగఁ • గాఁగిన తైలము నీటిబొట్టు పైఁ
బడునెడ నాక్షణంబె గసి • భగ్గున మండక యున్నె భాస్కరా, 47

టీ. భాస్కరా! దుష్టగుణున్=దుర్గుణములుగలవాని, తత్త్వము=నిజము, ఎఱుంగక=తెలిసికొనలేక, తడవరాదు=వానిజోలికేఁగరాదు, ఎవ్వరు + ఐనన్=ఏమనుజులైన, ఆచెడుగుణము=వారలొనరించు చెడ్డపని, ఇట్లు=ఈప్రకారము, వల్వదు=వలదు, అని చెప్పినన్=బోధించినయెడల, గ్రక్కునన్ త్వరితముగ, (శీఘ్రముగ) కోపచిత్తుఁడు + ఐ=కోపముతోఁగూడిన హృదయముగలవాఁడై, కడున్=మిక్కిలి, తెగన్=సాహసకార్యముఁ గావించుటను, చూచుగా=తలంచునుగదా, ఎట్లన:—మఱుఁగన్=సలసల ఉడుకునట్లు కాఁగిన తైలము=మఱిఁగిన తైలము, నీటిబొట్టు=జలబిందువు, పైన్=తనమీద, పడునెడన్=పడెడివేళయందు, ఆక్షణంబు + ఎ=ఆతక్షణమే, ఎగసి=పైకి లేచి, భగ్గునన్=భగభగమని, మండక + ఉన్నె=మండమండునా? (మండు ననుట.)

తా. ఎఱ్ఱగా మఱిగిన నూనెమీద నీటిచుక్క పడినచో మీదికి లేచి భగ్గున మండునట్లు; దుష్టుఁడు హితోపదేశముఁ జేయువారిపై క్రోధాతిరేకమున మండిపడును. కావున, వాని తెరువునకుఁ బోరాదు.

చ॥ తనకు ఫలంబు లేదని యెదం • దలపోయఁడు కీర్తిఁగోరు నా
ఘనగుణశాలి లోకహిత • కార్యము మిక్కిలిభారమైన మే

లనుకొనిపూను, శేషుఁడు సహస్రముఖంబులఁ గాలిఁ గ్రోలి తా
ననిశము మోవఁడే మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా. 48

టీ. భాస్కరా! కీర్తిన్=యశస్సును, కోరు=ఆశించు (అపేక్షించు) ఆఘనగుణశాలి=ఆగొప్పగుణములచే నొప్పుచున్నవాఁడు, తనకున్=తనకు, ఫలంబు=లాభము, కాను + అని=కలిగియుండ లేదని, ఎదన్=మనస్సునందు, తలపోయఁడు=యోజన సేయఁడు, లోకహితకార్యము=జగంబునకు మేలయిన పని, మిక్కిలి=ఎక్కువ, భారము + ఐనన్=కష్టమైనను. మేలు=మంచిది, అనుకొని=ఆలోచనఁ జేసి, పూనున్=ఆకార్యమొనర్పఁ బ్రయత్నించును, ఏట్లనఁగా; శేషుఁడు=ఆదిశేషుఁడు, సహస్రముఖంబులన్=తనవేయి మొగముల చేతను, పవనమును=గాలిని, క్రోలి=భక్షించి, తాన్=తాను, మఱి, మహాభారము=మోయఁజాలనిబరువును, ఐనధరిత్రిన్=అయినభూమిని, అనిశమున్=ఎల్లప్పుడును, మోవఁడు + ఎ = మోయుచుండుటలేదా? (మోయుచున్నాఁడని యర్థము.)

తా. శేషుఁడు గాలిఁగ్రోలి లోకోపకారార్థము భూభారమును=మోయుచున్నట్లుఁ జగంబునఁ గీర్తినిఁ గోరువాఁడు తనకు ఫలితము లేకపోయినను, జగదుపకారమగుపని యెంతభారమైనను నెరవేర్చునుఁగాని, తనలాభముకొఱకు చూడఁడు.

---

48. శేషుఁడు=కశ్యపప్రజాపతి జ్యేష్ఠపుత్రుఁడు. నాగులలో నగ్రగణ్యుఁడు. ఇతఁడు. తనతల్లియైన కద్రువయును, సోదరులును చేసిన యక్రమము నితఁడంగీకరింపక, వారి విడబాసి దివ్యక్షేత్రములయందు ఘోర తపంబొనర్పఁగా, నలువ యాతని తపస్సునకు మెచ్చి, భూభారమును వహించు శక్తి నొసంగెను. మఱియు, నితండు మహేశ్వరానుగ్రహముచే నారాయణునకుఁ బానుపై, భూభారము మోయుచుండెను. తొల్లి భృగుమహర్షి యిచ్చిన శాపమువలన నితఁడు బలరామావతారమెత్తెను.

చ॥ తనకు నదృష్టరేఖ విశ । దంబుగఁగలిగినఁగాని లేనిచో
జనునకున య్యెడన్ బరుల । సంపదవల్ల ఫలంబు లేదుగా
కనుఁగవ లెస్సఁగాఁ దెలివిఁ । గలిగినవారికిఁగాక గ్రుడ్డికిన్
కనుపడునెట్లువెన్నెలలు।గాయఁగనందొకరూపుభాస్కరా.49

టీ. భాస్కరా! తనకున్=తనకు, అదృష్టరేఖ=భాగ్యరేఖ, విశదంబుగన్=స్పష్టముగ, కలిగినన్ + కాని=ఉండినఁగాని, లేనిచోన్=భాగ్యచిహ్నము లేనప్పుడు, జనునకున్=మనుష్యునకు, ఏ + ఎడన్=ఏవేళయందును. పరుల సంపదవల్లన్=పరులైశ్వర్యమువలన, ఫలంబు=లాభము, లేదుగా=లేదు కదా, ఎట్లనన్; కనుగవన్=నేత్రములయందు, తెలివి=ప్రకాశమానము, లెస్సగాన్=బాగుగా, కలిగినవారికిఁగాక=కలిగియున్న మనుష్యులకుఁదప్ప, గ్రుడ్డికిన్=అంధునకు, వెన్నెలలు=చంద్రికలు, కాయఁగాన్=విజృంభింపఁగాన్ (వ్యాపింపఁగా) అందున్=ఆవెన్నెలలందు, ఒకరూపు=ఒకరూపమైనను; ఎట్లుకనపడున్=ఏవిధమునయగడును. (కనుపడదనియర్థము).

తా. వెన్నెల దిశలంతట నలుముకొనియున్నను, దానిలో స్వరూపములు దృష్టిప్రసారము బాగుగానున్నవారికిఁగాని యంధునకు గోచరము గానటుల ,పరుల భాగ్యము లంతట బ్రసిద్ధమైయున్నను, వానివలన ఫలితార్థముకలవారికేఁగాని, దురదృష్టవంతులకుఁ గలుగదు.

ఉ॥ తాలిమితోడు తండగవు । తప్పక నేర్పరియొప్పుఁదప్పులం
బాలన సేయుగాకటను । పాయవిహీనుఁడు సేయనేర్చునే?
పాలునునీరు వేఱుపఱు । పంగ మరాళమెఱుంగుఁగాకమా
ర్జాలమెఱుంగునె తదుప । చారురసజ్ఞతబూనభాస్కరా 50

టీ. భాస్కరా! నేర్పరి=వివేకముఁగలవాఁడు, తాలిమితోడుతన్=ఓర్పుతో, (తగవు=సత్యమును, తప్పక=పాయక, ఒప్పుతప్పులన్=ధర్మ=

ధర్మములను, పాలనసేయుఁగాక=పాలించునుగాని, అటఁ=ఆకార్యమును, ఉపాయవిహీనుఁడు=తెలివిలేనివాఁడు, చేయఁ=చేసిన, నేర్చును+ఎ= సమర్థుఁడగునా! (కాదనుట) మరాళము=హంస, పాలును=క్షీరమును, నీరును=జలమును, ఏఱుపఱుపంగఁ=వేఱ్వేఱుఁజేయుటను, (విభజించుటను) ఎఱుంగుఁ+కాని=తెలిసికొనును గాని, మార్జాలము=పిల్లి, తత్=ఆరాజహంసయొక్క, ఉరు=ఘనమైనదియు, చారు=మనోజ్ఞమయినదియు, నగురసజ్ఞతఁ=రసగ్రహణశక్తిని, ఊనఁ=వహించుట, ఏఱుంగును+ఏ=తెలిసికొనఁగలదా? ఎఱుఁగలేదనుట.)

తా. క్షీర, నీరముల వేఱుపఱుప రాయంచకే తగునుగాని, పిల్లికిఁ దగనటుల; న్యాయా, న్యాయవిమర్శనము నిపుణతఁగలవాఁడు శక్తుఁడుగాని తెలివిహీనుఁడు సమర్థుఁడుకాఁడు.

ఉ॥ తాలిమితోడఁగూరిమిఁగృ।తఘ్నునకెయ్యెడ నుత్తమోత్తముల్
మేలొనరించినన్ గుణము । మిక్కిలికీడగుఁ, బాముపిల్లకున్
బాలిడిపెంచినన్ విషము । పాయఁగ నేర్చునె దానికోఱలం
జాలగనంతకంతకొక।చాయను హెచ్చునుగాక భాస్కరా! 51

టీ. భాస్కరా. ఉత్తమ+ఉత్తముల్=మిక్కిలిమంచివారు, తాలిమితోడఁ=శాంతముతో, కూరిమిఁ=దయచేత, కృతఘ్నునకుఁ=చేసిన యుపకారమును మఱచువానికి, ఎయ్యెడఁ=ఏవేళయందైనను, మేలు=ఉపకారము, ఒనరించినఁ=చేసియున్నచో, గుణము=తానొనర్చిన మేలువలన గలిగెడుఫలము, మిక్కిలికీడు+అగుఁ=చెడుగలిగించును, (ఎట్లనఁగా) పాముపిల్లకుఁ=త్రాచుపిల్లకు, పాలు+ఇడి=పాలుఁబోసి, పెంచినఁ=పోషించినచో, దానికోఱలఁ=ఆపాముపిల్లకోఱయందు, విషము=గరళము, చాలఁగఁ=మిక్కిలిగా, అంతకంతకుఁ=క్రమక్రమముగా, ఒకచాయఁ

ఒకవిధముగా, హెచ్చునుగాక=వృద్ధియగునుగాని పాయగన్ + నేఱ్పును + ఏ=అగరళమును విడిచిపెట్టునా? (విడువదని యర్థము.)

తా. పాముపిల్లకుఁ బాలువోసి పెంచినను, దానిదంతములయందు విషము క్రమక్రమముగా వృద్ధిఁజెందునుఁగాని తగ్గనటుల; చేసినమేలు మఱచెడివానికి మేలుఁగలిగించినను నందువలన ఫలము మిక్కిలి విపరీతమగును.

చ॥ తెలియనికార్యమెల్లఁగడ । తేర్చుటకొక్క వివేకిఁజేకొనన్
వలయున యైనదిద్దుకొన। వచ్చుప్రయోజనమాంద్యమేమియుం
గలుఁగదు, ఫాలమందుఁ దిల। కంబిడునప్పుడు చేతనద్దమున్
గలిగినఁజక్కఁజేసుకొనుఁ।గాదెనరుండదిచూచిభాస్కరా: 52

టీ. భాస్కరా! తెలియనికార్యము + ఎల్లన్ = తెలియని పనియంతయును, కడతేర్చుటకున్=నిర్వహించుటకు, ఒక్కవివేకిన్=ఒకజ్ఞానముఁగలమానవుని, చేకొనన్ + వలయు=చేరదీసికొనవలయును, అటు + ఐనన్= అటులయినయెడల, దిద్దుకొనినన్ వచ్చున్ = లోపములను తొలిగించుకొని పనిని సానుకూలముఁ జేయవచ్చును. ప్రయోజన మాంధము=పనియందు నాలస్యము, ఏమియున్=ఇంచుకంతయును, కలుఁగదు= సంభవింపదు, (ఎట్లనఁగా) నరుండు=మనుష్యుఁడు, ఫాలమందున్=నుదుటను, తిలకంబును=బొట్టును, ఇడునప్పుడు=పెట్టుకొనెడి తఱి, చేతన్= కరమందున, అద్దమున్=దర్పణమును, కలిగినన్=ఉండినచో, అది=ఆయద్దమును, చూచి=వీక్షించి, చక్కజేసికొనున్ + కాదు + ఎ=చక్కఁగా దిద్దుకొనునుఁగదా!

తా॥ మానవుఁడు మొగమునఁ దిలకము దిద్దుకొనునప్పుడు కరంబున నద్దమున్నచో, దానినిఁ జూచుకొని బొట్టునుఁ జక్కఁగా సవరించుకొనునట్లు; తన కసాధ్యమగు కార్యమును సాధింపఁదలఁచిన, వివేకిని దరిఁజేర్చుకొనినచో, వాని మూలమునఁ దత్కార్యము నిర్వహించుకొనును.

ఉ॥ దక్షుఁడు లేని యింటికిఁ బ • దార్థము వేయొకచోటనుండి వే
లక్షలు వచ్చుచుండినఁ బ • లాయనమై చనుఁగల్లకాదు, ప్ర
త్యక్షము వాఁగులున్ వఱద • లన్నియు వచ్చిన నీరునిల్చునే
యక్షయమైనగండి తెగి • నట్టి తటాకములోన భాస్కరా. 53

టీ. భాస్కరా! దక్షుఁడు=సంసార భారమును వహించినట్టియజమానుఁడు, లేని యింటికిన్=లేనట్టి గృహమునకు, పదార్థము=ధనము, వేయు + ఒకచోటనుండి=మఱియొక ప్రదేశమునుండి, వేలక్షలు=వేయిలక్షల రూప్యములు, వచ్చుచుండినన్=వచ్చుచున్నప్పటికి, పలాయనము + ఐ=పలాయంచరై (చెదా చెదరై) పోవును=అంతరించును, కల్లగాదు=అనృతముగాదు, ప్రత్యక్షము=స్పష్టము, (ఎట్లనన్) వాఁగులు=కొండలలో బయలుదేరిన కాలువలు, వరదలు + అన్నియున్=జలప్రవాహములన్నియు, వచ్చినన్=వచ్చుచుండినను, అక్షయము=గొప్పది, ఐనగండి=అయినట్టి కన్నము, తెగినట్టి తటాకములోన్=పడిన చెఱువులోపల, నీరు=జలము, నిల్చునే=నిలువఁబడునా? (ఉండదని యర్థము.)

తా. గండి తెగిన తటాకములోని కెన్ని నదీప్రవాహములు వచ్చుచున్నను, నీరు గొంచెమైన నాచెఱువున నిలువకపోయినట్లు; కుటుంబభారమును బూనిన గృహాధిపతి లేనియెడల, నెన్ని మార్గములుగా నింటికి ధనంబు వచ్చుచున్నను. తక్షణమే చెల్లిపోవుచుండునుఁగాని కాసైన నిలువదు.

ఉ॥ దాన పరోపకార గుణ • ధన్యత చిత్తములోన నెప్పుడున్
లేనివివేక శూన్యునకు • లేములు వచ్చినవేళ, సంపదల్
పూనినవేళ, నొక్కసరి • పోలును జీకున కర్థరాత్రియం
లేనన దేమి పట్టపగ • లైన న దేమియు లేదు భాస్కరా. 54

టీ. భాస్కరా! దాన=ఈవి, పరోపకార=పరులకు మేలుచేయుట, గుణ=సుగుణములచేత, ధన్యత=కృతార్థత్వము ఎప్పుడున్=ఏకాలమందును, చిత్తములో=ఎదలో (హృదయములో) లేని వివేకశూన్యవరున్=లేవట్టి మూఢునకు, లేములు=బీదతనములు, (దారిద్ర్యములు) వచ్చినవేళన్=సంప్రాపించిన వేళయందు, సంపదల్=భాగ్యములు, పూనినవేళన్=వహించిన శక్తి, ఒక్క సరిపోలును= ఒకరీతిగనే యుండును. (ఎట్లన) చీకునకున్=అంధునకు, అర్ధరాత్రి=అర్ధమరేయి, ఐనన్ + అది + ఏమి=అయినప్పుడు దానివలనఫలమేమి, పట్టపగలు=మధ్యాహ్నకాలము, అయినన్ అదియేమి= అయిన దానివలన లాభమేమి. అంధునకు నడురేయి, మధ్యాహ్నము నొకటియేయని భావము.

తా. గ్రుడ్డివానికి రేయింబవలును యొకేవిధముగ నుండునుగాని, భేదము నూచింపనట్లు; దాన, ధర్మములెఱుంగని మూర్ఖునకు దారిద్ర్యము వచ్చినను, సంపద గలిగినను నొకతీరుగానే పరిణమించును.

ఉ॥ దానము సేయఁగోరిన వ • దాన్యునకీయఁగ శక్తి లేనిచో
నైనఁ బరోపకారమున • కైన యొక దిక్కునఁ దెచ్చియైన నీఁ
బూనును మేఘుడంబుధికిఁ • బోయి జలంబులఁ దెచ్చియీయఁడే
వానసమస్తజీవులకు • వాంఛిత మింపెసలార భాస్కరా. 55

టీ. భాస్కరా! దానము=దాతృత్వము (ధర్మగుణము) చేయన్=చేయుటకు, కోరిన వదాన్యునకున్=ప్రేమయున్న దాతకు, ఈయన్ + కన్=ఒసఁగుటకు, శక్తి=సామర్థ్యము, లేనిచోన్ + ఐనన్=లేకపోయినను, పరోపకారమునకున్=అన్యుల కుపకారము చేయుటకు, ఒక దిక్కునన్=వేఱొకచోటున, తెచ్చి + ఐనన్=గొనివచ్చియైన, ఈన్=ఇచ్చుటకు, పూనును=ప్రయత్నించును, (ఎట్టులనఁగా) మేఘుఁడు=మబ్బు, అంబుధికిన్=కడలిదరికి, పోయి=వెళ్ళి, జలంబులన్=నీటిని, తెచ్చి=కొనివచ్చి, సమస్తజీవు

లకున్=ఎల్ల ప్రాణులకు, వాంఛితము=కోరిక, ఇంపెసలు + ఆరన్=ఫలించునట్లుగా, వానన్=వర్షమును, ఈయఁడు + ఎ=ఒసఁగఁడా ? (కురియుచున్నాడనుట.)

తా. మేఘము తనయొద్ద జలములేనప్పుడు కడలియొద్దకుఁ బోయి, యుదకమును సంగ్రహించి, సకలజీవులు నానందముఁ నొందునట్లు వర్షించును. అట్లె, దానపరుఁడు తనయొద్ద ధనము లేనప్పుడొకరియొద్ద ఋణముఁ జేసియైన నిచ్చుచుండును.

ఉ॥ దానముచేయ నేరని యధార్మికుసంపద యుండియుండియున్
దానెపలాయనంబగుట తథ్యము, బూరుగు మ్రానుఁగాంచినన్
దానిఫలంబు లూరక వృథా ఎండిపోవవె యెండి గాలిచేఁ
గానలలోన నేమిటికిఁ గాకయభోజ్యము లౌటభాస్కరా. 56

టీ. భాస్కరా! దానము=ధర్మము, చేయ నేరని అధార్మికు సంపద=ధర్మముఁ జేయ నిష్టపడని లోభివానియైశ్వర్యము, ఉండియుండినన్=కలిగియుండినను, తాను + ఎ=తనుతాఁదానె, పలాయనంబు + అగుట=పారిపోవుట, తథ్యము=నిజము, (ఏట్లనఁగా) బూరుగుమ్రాను=శాల్మలివృక్షము (బూరుగుచెట్టు) కాచినన్=పండినను (ఫలించినను) దానిఫలంబు=ఆబూరుగు చెట్టుయొక్క పండ్లు, అభోజ్యములు=తినరానివి (భుజింపదగనివి) అగుటన్=అయియుండుటచే, ఊరక=మిన్నక, వృథా=వ్యర్థముగా, ఎండి=ఎండిపోయి, గాలిచేన్=గాడ్పువలన, కానలలోన్=అరణ్యములలో, ఏమిటికిఁగాక=ఎందునకుఁగొరగానక, పడిపోవవు + ఎ=పడిపోవుచుండ లేదా?

తా. బూరుగువృక్షము ఫలించినను, దానిపండ్లెవ్వరుఁ దినుటకేనిఁ బనికిరాక, గాలితాకుడుచె నరణ్యముల రాలిపడి వ్యర్థమగురీతి, త్యాగము లేనివానికి సంపదలున్నను నవియున్నట్టు లేయుండి, పరులకుపయోగింపక పోవుచుండును.

చ॥ నడువక చిక్కి లేమియగు • నాఁడు నిజోదరపోషణార్థమై
యడిగి భుజించుటల్ నరుల • కారయ వ్యంగ్యము కాదు పాండవుల్
గడుబలశాలు లేవురు న • ఖండవిభూతిఁ దొలంగి భైక్షముల్
గుడువరె యేకచక్రపురిఁ • గుంతియుఁ దారొకచోట భాస్కరా.

టీ. భాస్కరా! నడవక = జరుగుబాటు లేక, లేమియగునాఁడు = దారిద్ర్యము సంభవించునప్పుడు, నిజ + ఉదరపోషణ + అర్థమై = తనపొట్టనింపుకొనుటకు, అడిగి = యాచించి, భుజించుటల్ = తినుటలు, అరయన్ = విచారింప, నరులకున్ = మానవులకు, వ్యంగ్యము = నిందారోపణము కాదు. (ఎట్లనగా) కడున్ = మిక్కిలి, బలశాలులు = పరాక్రమోపేతులు, ఏవురు = అయిదుగురు, పాండవుల్ = పాండుపుత్రులు, అఖండవిభూతిన్ = అధికైశ్వర్యమునుండి, తొలంగి = ఎడబాసి, ఏకచక్రపురిన్ = ఏకచక్రమను పురంబున, తారును, తాము, (పాండవులును) కుంతియున్ = (తల్లియైన) కుంతీదేవియు, ఒకచోటన్ = ఒక్కప్రదేశమందు, భైక్షముల్ = యాచించి తెచ్చినయన్నములు, కుడువరు + ఎ = భుజింపరా? (భుజించిరనుట.)

తా. పాండుకుమారులు బలోద్దీపితులయ్యు సకలైశ్వర్యాదులఁ గోలుపోయి, తల్లియగు కుంతితో నేకచక్రపురంబున భిక్షాటనమొనర్చి జీవించినట్లు; జగంబున మనుజుఁడు దారిద్ర్యమనుభవించునప్పుడు, పొట్టనింపుకొనుటకై పరులయాచించినను లోపంబు కాదు.

చ॥ నుడుపుల నేర్పు చాలని మ • నుష్యుఁడెఱుంగక తప్పు నాడినం
గడుఁగృపతోఁ దెలంగుదురు • కానియదల్పరు తజ్జ్ఞులెల్లఁ ద
ప్పడుగులు వెట్టుచున్నఁడచు • నప్పుడు బాలుని ముద్దుసేయఁగా.
దొడఁగుదురెంతె గాని పడఁ • ద్రోయుదురే యెవరైన భాస్కరా

టీ. భాస్కరా! నుడువులన్ = మాటలందు, నేర్పు = చాతుర్యము, చాలనిమనుష్యుఁడు = లేనట్టిమానవుఁడు, ఎఱుంగక = తెలియక, తప్పు + అడినన్ = అనృతముఁ బలికినచో, తత్ జ్ఞులు + ఎల్లన్ = శాస్త్రవేత్తలందఱు, కడున్ = మిగుల (మిక్కిలి) కృపతోన్ = దయతోఁ ప్రేమతో చెలంగుదురు = ఒప్పుకొందురు, కాని, అదల్పరు = కోపముతో గద్దరించరు, ఎట్లనఁగా) తప్పు + అడుగుల్ = తప్పటడుగులు, పెట్టుచున్ = వేయుచు, నడుచునప్పుడు = నడచెడికాలమందు, బాలునిన్ = బాలకుని. ముద్దుచేయన్ + కాన్ = ప్రేమించుటకు, తొడఁగుదురు = ప్రారంభించెదరు, ఇంతేకాని = అదియేగాక, ఎవరే + నినన్ = ఎట్టిదుష్కర్ములైనను, పడన్ = క్రిందఁబడునట్లుగా, త్రోయుదురు + ఎ = గెంటుదురా? (త్రోయరనుట.)

తా. ఎంతటికఠినకర్ములైనను తప్పటడుగులతో నడచెడిబాలుని ప్రేమింతురుగాని, క్రిందికిఁబడఁద్రోయరు, అట్లె పండితోత్తములు, మాటలయందు చాతుర్యమెఱుంగనివారు తప్పుబలికినను, విని సంతసిల్లెదరుగాని యదలించరు.

ఉ॥ నేరిచి బుద్ధిమంతుఁ డతి • నీతివివేకము దెల్పినం జెడం
గారణమున్నవానికది • కైకొనఁగూడదు నిక్కమే దురా
చారుఁడు రావణాసురుఁడ • సహ్యముఁ నొందఁడె చేటుకాలముం
జేరువయైననాఁడునిర • సించి విభీషణుబుద్ధి భాస్కరా. 59

టీ. భాస్కరా! బుద్ధిమంతుఁడు = జ్ఞానముఁగలవాఁడు, నేరిచి = అభ్యసించి, అతినీతివివేకము = నీతియొక్క విశేషాధిక్యమును, తెల్పినన్ = తెలియఁజేయఁగా చెడన్ = పాడయిపోవుటకు, కారణమున్నవానికిన్ = హేతువున్నవానికి, అది = అనీతి, కైకొనన్ = గ్రహించుటకు, కూడదు = చెల్లదు, నిక్కము + ఎ = సత్యమే, దురాచారుఁడు = దుష్ప్రవర్తనఁగలవాఁడు, (రావ

ణుఁడు) ఛేటుకాలము=నాశనకాలము, చేరవ + ఐనవాఁడు= సమీపించిన పుడు, విభీషణుబుద్ధి=విభీషణుఁడు చెప్పిననీతిమార్గము, నిరసించి=త్రోసి వేసి, (నిందించి) అసహ్యముపొందఁడు + ఎ=కోతనుఁజెందఁడా (కోసెను)

తా. క్రూరాత్ముఁడగు రావణాసురుఁడు తనకు పోగాలము వచ్చుట చేత, తమ్ముఁడగు విభీషణుని సుబోధఁ దిరస్కరించినటులఁ లోకమున మానవుఁడు తనకుఁ జేటుకాలమాసన్నమైనప్పుడు, ధీమంతుల హితవచనముల నాలింపఁడు.

చ॥ నొళలినవేగి నెంతటిఘనుండును దన్నొక రొక్కనేర్పుతో
నగపడిప్రోదిసేయక త నంతట బల్మికిరాఁడు నిక్కమే
జగమున నగ్ని యైనఁగడుసన్నగిలంబడియున్న నింధనం
బెగయగద్రోచియూదకమరెట్లురవుల్కొన నేర్చుభాస్కరా.

టీ భాస్కరా! నొగిలినవేళ=పేదరికము, ఁగలిగియున్నప్పుడు, ఎంతటిఘనుండు=ఎంతగొప్పవాడైనను, తన్ను=తన్ను, ఒకరు=మఱియొకరు, ఒక్కనేర్పుతో=ఒకయుక్తితో, (ఒక యుపాయముతో) అగపడి=కానుపించి, ప్రోదిచేయక=రక్షణ సేయకుండ, తనంతట=తనకుఁదాను, బల్మికిరాడు=బలమును పొందలేడు, నిక్కము + ఏ=నిశ్చయమె (నిజము) ఎట్లనఁగా: జగమున=లోకమునందు, అగ్నియైన=వీతిహోత్రుడైనను, కడు=మిక్కిలి, సన్నగిలంబడియున్న=క్షీణించియున్న సమయమందు, ఇంధనంబు=పొయిలోనికట్టెను, ఎగయ + త్రోచి=పోయిలోనికెగ ద్రోచి, ఊదక=ఊదకుండ, మఱియెట్లు=ఇఁక నేలాగున, రవుల్కొన నేర్చు=ఎట్లు మండ నేర్చును.

తా అనలుఁడు ప్రకాశమానుఁడైనను సన్నగిలినప్పుడు పొయిలో నికట్టెలను బాగుగా నెగఁద్రోసి యుపాయముతో నూదినఁగాని మరలమండ

నట్లు: ధనికునకుఁ బేదరికముఁగలిగి నప్పుడు, మఱియొకఁడు వానిని జేరదీసి సాకినఁగాని బలమును, వహింపలేడు.

ఉ॥ పండితులైనవారుదిగు • వందగనుండఁగ నల్పుఁడొక్కఁడు
ద్దండతఁబీఠమెక్కిన బు • ధప్రకరంబుల కేమియెగ్గగున్
గొండొకకోతిచెట్టుకొన • కొమ్మలనుండఁగ గ్రిందగండభే
రుండమదేభసింహనికు • రంబములుండవె? చేరిభాస్కరా

టీ॥ భాస్కరా! పండితులు=విద్వాంసులు, ఐనవారు=అయినట్టి మానవులు, దిగువన్=క్రిందు, ఉండఁగన్=వసించియుండఁగా, అల్పుఁడు=కొద్దివాఁడు, (నీచుఁడు) ఒక్కఁడు, ఉద్దండతన్=దుష్టస్వభావముచే, పీఠము + ఎక్కినన్=సింహాసనమునఁగూర్చుండినచో, బుధ ప్రకరంబులకున్=పండితోత్తములకు, ఏమి ఎగ్గుఅగున్=ఏమి హాని సంభవించును, (కీడుఁగలుగదనుట) ఏట్లనన్; కొండొకకోతి=ఒకానొక మర్కటము, చెట్టుకొమ్మలన్=వృక్షశాఖలయందు, ఉండఁగన్=వసించియుండఁగా, క్రిందన్=నేలమీద, (చెట్టు దిగువభాగమున) గండ భేరుండ=గండభేరుండమను పక్షుల యొక్కయు, మద + ఇభ=మదగజముల యొక్కయు, నికురంబములు=సమూహములు (గుంపులు), చేరి=కూడి, ఉండవు + ఎ=ఉండవా? ఉండునని యర్థము.

తా॥ చెట్టు క్రిందిభాగమున గండభేరుండ మృగములాది నివసించి యుండఁగా, నా తరుశాఖలయందు కోతియొకటుండి నప్పటికి నాజంతువుల కిసుమంతయులోపము లేదు. అట్లేపండితులు నేలమీద గూర్చుండినతరుణమున, నల్పుఁడొకఁడు పీఠాసనమునఁ గూర్చుండినంత మాత్రమున నావిద్వాంసుల కెంతమాత్రమునుఁ గొఱంతలేదు.

ఉ॥ పట్టుగనిక్కుచుఁ మదము • బట్టిమహాత్ములఁ దూలనాడి
బట్టినకార్యముల్ చెడును • ప్రాణముపోవు నిరర్థదోషముల్
పుట్టు,మహేశుఁగాదని కు• బుద్ధినొనర్చిన యజ్ఞతంత్రముల్
ముట్టకపోయిదక్షునికి • మోసమువచ్చెఁగదయ్య భాస్కరా

టీ భాస్కరా! మదముఁబట్టి= గరువముచేత, పట్టుగన్=పట్టుదలగా నిక్కుచున్=నిల్గుచు, (గర్వించుచు) మహాత్ములన్=ఘనసీయులను, తూల నాడినన్=తృణీకరించునటులఁ, బలికిన. పట్టినకార్యముల్=తాను, ఆరంభిం చినపనులు, చెడును=నాశనమగును. ప్రాణముల్=జీవములు, పోవును, నిరర్థ దోషముల్=నిమిత్తములేని పాపములు, పుట్టున్=కలుగును, ఎట్లనగా; మ మహేశున్=శంభుని, కాదని=ధిక్కరించి, కుబుద్ధిన్=దుర్బుద్ధిచేత (కుత్సిత బుద్ధిచేత) ఒనర్చిన యజ్ఞతంత్రముల్=చేసినట్టియా కార్యములు, ముట్టక= కొనసాగక, పోయి=నశించి, దక్షునికిన్=దక్షప్రజాపతికి, మోసము=హాని, వచ్చెన్ కద + అయ్య=ప్రాప్తించెనుగదా.

తా మహేశ్వరునిపై ద్వేషించి యాతనినిఁబిలువక దక్షుఁడు, య జ్ఞమాచరించెనుగాని, సంపూర్తి కాకపోవుటయేగాక, దక్షప్రజాపతి జీవం బులఁ గోలుపోయినటుల, దుష్టాత్ముఁడు మదముచేఁ గ్రింద మీఁదనుఁ గానక గర్వోద్రేకముచేఁ బూజ్యుల నపహసించి తానొక కార్యమును నిర్వర్తింపఁ దలఁచినయెడల, నాపని పాడగుటయేఁగాక ప్రాణాంతకముఁగూడకలుగును

---

62 తొల్లి దక్షుఁడు, బ్రహ్మసభలోఁ దన్ను శివుడు గౌరవింపలే దని కోపోద్దీపితుఁడై, తానొనరించు యజ్ఞమున సురప్రకరమును బిలిచి, యీ శ్వరునిఁ బిలువక హవిర్భాగమొసంగకున్న రుద్రుండా యవమానమును, సహింపలేక వీరభద్రుని సృజించి,యజ్ఞమును నాశనముగావించి,దక్షుని ప్రా ణంబులఁ బోగొట్టెను:

చ॥ పరహితమైనకార్యమతి • భారముతోడిదియైనఁబూనుస
త్పురుషుఁడులోకముల్ పొగడ • బూర్వమునందొకరాలవర్ష
మున్ ॥ గురియఁగజొచ్చినన్ గదిసి • గొబ్బునగోజనరక్షణార్థమై
గిరినొకకేలనెత్తె! నట • కృష్ణుడు! ఛత్రముభాతి భాస్కరా.

టీ భాస్కరా! పరహితము=ఒరులకు మేలుచేయునట్టిది. ఐనకార్యము=అయినట్టిపని. అతిభారము తోడిది + ఐనన్=మిగుల బరువుతో నొప్పినదైనను. లోకముల్=జగమందలి,మనుజులు=మనుష్యులు, పొగడఁగన్=స్తుతించునట్లుగా, పూనున్=ఆకార్యముఁజేయ యత్నించును, (ఎట్లనగా) పూర్వమునందున్=ద్వాపరయుగమున, ఒకరాలవర్షమున్–ఒకరాళ్ళవానను కురియఁగఁజొచ్చినన్=వర్షించుచుండగా, (కురియుచుండగా) కృష్ణుడు=వసుదేవనందనుడు, గొబ్బునన్=త్వరితముగ, కదిసి=దగ్గఱగాబోయి, గో=గోవులను. జన=జనులను, కాపాడునిమిత్తము, గిరిన్=మందరపర్వతమును, ఛత్రముభాతిన్=గొడుగురీతి,ఒకకేలన్=ఒకచేతితో,ఎత్తెనట=పైకెత్తి పట్టుకొనెననుట.

ఉ॥ పలుచని హీనమానవుఁడు • పాటిదలంపక నిష్ఠురోక్తులం
బలుకుచు నుండుఁగానిమతి • భాసురుఁడైన గుణప్రపూర్ణుడ
ప్పలుకులఁ బల్కఁబోవఁడు ని • బద్ధిగ; నెట్లనవెల్తికుండఁదాఁ
దొలకుచునుండుఁగానిమఱి • తొల్కునెనిండుఘటంబు భాస్కరా.

---

68. తొల్లి గొల్లలందఱు నింద్రయాగంబుఁ గావింపుచుండ కృష్ణమూర్తి వారించినందున మహేంద్రుఁడు కోపించి, శిలావర్షమును గురిపించి గోకులంబును బాధింపఁగా, నంద నందనుఁడు గోవర్ధమను పర్వతమునుఁబైకెత్తి గోవులను రక్షించెను. అంత నింద్రుండు భయాకులిత చిత్తుఁడై వాసుదేవుని దయకుఁ బాత్రుండయ్యెను.

టీ. భాస్కరా! పలుచని హీనమానవుఁడు=మిక్కిలి జులుకనిమనుష్యుఁడు, పాటి=ధర్మమును, తలంపక=యోచనసేయక, నిష్ఠుర + ఉక్తులన్=పరుషవాక్యములను, పలుకుచుండుఁగాని=చెప్పుచుండునుఁగాని, మతిభాసురుఁడు=సద్బుద్ధిచేఁ బ్రకాశించువాఁడు ఐనగుణప్రపూర్ణుఁడు=సుగుణముచే నొప్పువాఁడు, ఆ + పలుకులన్=ఆమాటలను, నిబద్ధిగన్=నిజముగా, పలుకన్ + పోవఁడు=సంభాషణచేయఁబోఁడు, ఎట్లు + అనన్=ఏలాగుననగా. వెల్తికుండు=జలము తక్కువైన కడవ. తాన్=తాను, (ఘటముయనుట) తొలకుచు నుండుఁగాని=తొణకుచుండినగాని, నిండుఘటంబు=నీటిచేనిండియున్న కుండ తొల్కును + ఎ=తొణకునా (కదలునా) తొణకదనుట.

తా. జలము వెలితిగానున్న కుండలోనినీరు తొణుకునటుల నీచమానవుం డెప్పుడును వదరుచుండును. నిండుకుండ తొణకని విధముగా గుణవంతుఁ డధికము సంభాషింపఁడు.

చ॥ పలుమరుసజ్జనుండుప్రియ•భాషలెపల్కుఁ గఠోరవాక్యముల్
పలుకఁ డొకానొకప్పుడవి•పల్కిన గీడునుగాదు; నిక్కమే
చలువకువచ్చి మేఘుఁడొక• జాడను దావడగండ్లురాల్చినన్
శిలలగునోటు వేగిరమె • శీతలనీరముఁగాక భాస్కరా. 65

టీ. భాస్కరా! సజ్జనుండు=సత్పురుషుఁడు, (మంచివాఁడు పలుమఱు=అనేకమారులు, ప్రియభాషలు + ఎ=మంచివాక్యములె, పల్కున్=నుడువుచుండును, కఠోరవాక్యముల్=పరుషవచనములు, (చెడ్డమాటలు, పలుకఁడు = భాషింపఁడు, ఒకానొకప్పుడు = ఒకానొకసమయమునందు, అవి=ఆపరుషోక్తులు, పల్కినన్=వచియించి నప్పటికి, కీడునుకాదు=చెఱుపుగాదు, నిక్కము + ఏ=సత్యమే, ఎట్లనఁగా; చలువకున్=చల్లదనముఁ గలిగించుటకు, వచ్చి=ఏతెంచి; మేఘుఁడు=మబ్బు=తాన్=తాను,

వడగండ్లన్=కరకలను, రాల్చినన్=కురిపించినను, వేగిరము + ఎ=త్వరితము గనే, శీతలనీరముఁగాక=చల్లని యుదకముగాఁనుండ శిలలగునోటు=ఱాళ్ళ గునా (కావని యర్థము)

తా. మేఘుఁడు నీటిబిందువుల వర్షించుచు నొకానొకప్పుడు వడగండ్లను గురిసినను అవి రాలవలె కఠినముఁగాక కరఁగి జలమగునట్లు సజ్జనుఁడెల్లవేళను వినయముఁగానేఁ బలుకుచు, నొకప్పుడు పరుషవాక్యములాడినను జెడుగు సేయక మంచిగనేఁ బరిణమించును.

ఉ॥ పాపపుఁద్రోవవాని కొక । పట్టున మేను వికాసమొందినన్
లోపలదుర్గుణంబె ప్రబ । లుంగద! నమ్మఁగఁగూడ దాతనిన్
బాపటకాయకున్ నునుపు । పైపయిఁగల్గినఁ గల్గుఁగాకనే
రూపున దానిలోఁగలవి । రుద్ధపుఁజేదు నశించు భాస్కరా. 66

టీ. భాస్కరా! పాపపుద్రోవవానికిన్=దుర్మార్గునకు, ఒకపట్టునన్=ఒకసమయమందు, మేను=దేహము, వికాసము=ప్రకాశమానము, ఒందినన్=పొందినను, లోపలన్=హృదయమునందు, దుర్గుణంబు + ఎ=చెడుగుణమే, ప్రబలుంగద=వృద్ధియగునుఁగదా, అతనిన్=ఆదురాత్ముని, నమ్మఁగన్ కూడదు=నమ్మరాదు, పాపటకాయకున్=పాపిడికాయకు, పైపయిన్=మీఁగుమీఁదుగా, నునుపు=ఉన్నతము, కల్గిన్=కలిగినచో, కల్గున్ + కాక=ఉండునుగాని, దానిలోన్=ఆకాయలోపల, కల=ఉండినట్టి, విరుద్ధపు=వికటమగు, చేదు=విషము, ఏరూపునన్=ఏవిధమునను, నశించున్=పోవును, (హరింపదనుట)

తా. పాపటకాయకు మీఁదిభాగము నునుపుగానుండినను, దానిలోనుండిన చేదు పోనట్లు, దుష్టునకు సౌందర్యమున్నను హృదయములోని దుర్గుణములు మాత్రము పోవు. అట్టివానిని నమ్మఁగూడదు.

ఉ॥ పూనినభాగ్యరేఖ చెడి । పోయినపిమ్మట నెట్టిమానవుం
డైనను వానినెవ్వరుఁ బ్రి।యంబునఁ బల్కరు పిల్వరెచ్చటం
దానిది యెట్లొకోయనినఁ। దథ్యము పుష్పమువాడి వాసనా
హీనతనొందియున్నయెడ। నెవ్వరు ముట్టుదురయ్య భాస్కరా

టీ. భాస్కరా! పూనినభాగ్యరేఖ=తన్నుఁబొందిన యదృష్టపుగీత, చెడిపోయిన పిమ్మటన్ =పాడయిపోయిన తర్వాత, ఎట్టిమానవుండు + ఐనన్=ఎటువంటి గొప్పవాఁడైనను, ఎచ్చటన్=ఏప్రదేశమందైనను, వానిని=అయదృష్టహీనుని, ఎవ్వరున్=ఏమనుజులును, ప్రియంబునన్=అనురాగముచేత, పల్కరు=మాటలాడరు, పిల్వరు=రమ్మనరు, తథ్యము=సత్యము, తాన్=అది, ఎట్లు + ఒకో + అనినన్=ఏలాగుననిన, పుష్పము=సుమము, వాడి=ఎండిపోయి, వాసనాహీనతన్=సువాసన లేకపోవుటచేత, (పరిమళము) ఒంది=పొంది, ఉన్న + ఎడన్=ఉన్నసమయమందు, ఎవ్వరున్=ఏమనుష్యులయినను, ముట్టుదురు + అయ్య=తాకుదురా (స్పృశింపరు అనుట.)

తా. పుష్పము వాడిపోయి పరిమళహీనమైన సమయమున నెవ్వరును తాకనట్లే, అదృష్టరేఖ సన్నగిలిన మానవు లెంతఘనవంతులైనను దగ్గరకు రమ్మనక పోవుటయేగాక రమ్మని పిల్వరు.

ఉ॥ పూరిత సద్గుణంబుగల • పుణ్యున కించుక రూపసంపదల్
దూరములైనవానియెడ • దొడ్డగఁజూతురు బుద్ధిమంతులె
ట్లారయ గొగ్గులైనమఱి • యందులమాధురిఁజూచికాదె ఖ
ర్జూరఫలంబులం బ్రియముఁ జొప్పడలోకులుగొంట భాస్కరా.

టీ. భాస్కరా! పూరితసద్గుణంబు=పూర్ణమైన మంచిగుణములకల పుణ్యునకున్=కలిగినట్టి పుణ్యవంతునకు, ఇంచుక=కొంచెము, రూపసంపదల్=అంద

మూలయొక్క సమృద్ధులు, ధూరములు + ఐనన్=లేకున్నను, వానియెడన్= అట్టివానియెడల, బుద్ధిమంతులు=మంచివారు, దొడగన్=గొప్పగా, (ఘనముగా) చూతురు=చూచెదరు, ఎట్లు=ఏలాగుననఁగా, అరయన్=ఆలోచింపగా లోకులు=మనుజులు, గొగ్గులైనన్=ముడతలుపడియున్నను, ఖర్జూరఫలంబులన్= ఖర్జూరపుఁబండ్లను, ప్రియముచొప్పడన్=ప్రీతమగునటు కొంటు=వెలకుఁ గొనుట, మఱి=ఇంతేఁగాక, అందుల, ఆఫలములయందున్న, మాధురిన్= తియ్యఁదనమును, చూచినకాదె=చూచిరేకదా.

తా. ఖర్జూరపుఁబండ్లుఁ జూచుటకుఁ గొగ్గిగానున్ననుదానియందుఁగల తియ్యదనముఁజూచి జనులెల్లరుఁ బ్రేమించికొనునట్లు సద్గుణంబులుఁగల వానికి సౌందర్యము లేకపోయినను సుజనులామనుజుని కడు గారవింతురు.

ఉ॥ ప్రల్లఁదనంబుచేనెఱుక • పాటొకయింతయు లేక యెచ్చటన్
బల్లిదుఁడైన సత్ప్రభు న•బద్ధములాడినఁద్రుంగిపోదు; రె
ట్లల్లసభాస్థలింగుమతు • లై శిశుపాలుఁడు దంతవక్త్రుఁడుం
గల్లలు కృష్ణునింబలికి • కాదెహతంబగుటెల్ల భాస్కరా. 69

టీ. భాస్కరా! ప్రల్లదనంబుచేన్=బదరుఁబోతుఁదనముచే, ఎఱుక పాటు=వివేకము, (జ్ఞానము.) ఇంచుకవేత=కొంచమైనను లేక, ఎచ్చటన్=

---

69. శిశుపాల, దంతవక్త్రులు శ్రీహరి ద్వారపాలకులగు జయవిజయులు. సనకసనందన మహర్షులశాపమువలన దైత్యులై జనించిరి. ఈశిశుపాల దంతవక్త్రులు కృష్ణునియందు బద్ధవైరముఁగలవారై, ధర్మజరాజసూయయాగ కాలయందు నిలిచి కృష్ణమూర్తి పూజార్హుఁడు గాడని ప్రల్లదంబులాడి నందనందనుని చక్రానలజ్వాలయందుఁబడి శిశుపాలుఁడుమరణించెను. అంతఁగొంత కాలంబునకు దంతవక్త్రునిఁగూడఁ జంపెను.

ఎక్కడనైనను, బల్లిదుఁడు=పరాక్రమశాలి, ఐనప్రభునిన్=అయినట్టియెంచి రాజునుగూర్చి, అబద్ధములాడినన్=కల్లలాడినయెడల, క్రుంగిపోదురు=నాశనమగుదురు, ఎట్లు=ఏలాగుననఁగా, శిశుపాలుఁడు, దంతవక్త్రుఁడును. హతంబగుటెల్లన్=చంపఁబడుటంతయును, అల్లసభాస్థలిన్ = (తొల్లి ధర్మజురాజసూయయాగ మందలి) సభాభవనమున, కృష్ణునిన్=కృష్ణభగవానునిఁగూర్చి కల్లలుపల్కి=కాదె=నిందించుట వలననేకదా?

తా. యమనందనుఁడైన ధర్మరాజు చేయు రాజసూయగ సభాస్థలంబున, శిశుపాల దంతవక్త్రులు శ్రీకృష్ణమూర్తిని నిందించి యాపరమాత్మని చేఁజచ్చిరి. అట్లె, అవివేకియైన మానవుఁడు బలశాలియగు రాజునుఁమాలనాడినఁ దప్పక మృతిఁజెందును,

ఉ॥ ప్రేమనుఁగూర్చి యల్పునకుఁ • బెద్దతనంబును దొడ్డవానికిం
దామతి తుచ్ఛపుంబని నె • దంబరికింపక యీయరాదుగా;
వామకరంబుతోనగుడు • వంగుడిచేత నపానమార్గముం
దోమఁగవచ్చునేమిగుల • దోఁచనిచేతలుగాక భాస్కరా. 70

టీ. భాస్కరా! ప్రేమనుఁగూర్చి=దయజూచి, అల్పునకున్=నీచునకు, పెద్దతనంబును=గొప్ప యధికారమును, దొడ్డవానికిన్=యోగ్యునకు, తామ=భూమీశులైనవారు, తుచ్ఛపుంబని=హీనకార్యము, ఎదన్=మనస్సునందు, పరికింపక=విచారింపక, ఈయరాదుగా=ఈయఁగూడదుకదా, ఎట్లనఁగా: మిక్కిలి, తోఁచనిచేతమిగులన్ కాక=బాగోగులునాలోచింపక, వామకరంబుతోడన్=ఎడమచేతితో, వడువన్=భుజించుటయు, వడిచేతన్=దక్షిణకరంబు అపానమార్గమున్=గుదస్థానమును, (మలమును విడిచెడిచోట)తోమంగన్=కడుగుటయు, వచ్చునే=కూడునా? (తగదనియర్థము)

తా. లోకమునందు మానవులు లెడమచేత భక్షించుటయు గుడిచేత గుదక్షాళనము చేసికొనుటయు, దగనట్లుగా, రాజులు నీచునికి గొప్పయుద్యోగ మిచ్చుటయు, ఘనులకుఁ గొద్దియధికార మొసంగుటయుఁ గూడదు.

చ॥ ఫలమతిసూక్ష్మమైననునృపాలుఁడుమంచిగుణాఢ్యుఁడైనచో
నెలమివివేకులాతనిక • పేక్షయొనర్తు; రదెట్లుచంద్రికా
విలసనమైనఁ దామనుభ • వింపజకోరములాసఁజేరవే
చలువగలట్టివాఁడగుటఁ • జందురు నెంతయుఁగోరిభాస్కరా

టీ. భాస్కరా! నృపాలుఁడు=రాజు, మంచిగుణాఢ్యుఁడు=సద్గుణములచె నొప్పెడువాఁడు, ఐనచోనన్=అయినట్టయిన, ఫలము=లాభము, అతిసూక్ష్మము=మిక్కిలిదవ్వవ, ఐనను=అయినప్పటికిని, వివేకులు=నీతికోవిదులు, ఎలమిన్=సంతోషముతో, ఆతనికిన్=ఆప్రభువుకొఱకు, అపేక్షనొనర్తురు=కోరుచుండుదురు, అది + ఎట్లు=అదియెలననఁగా, చంద్రికావిలసనము ఐనన్=వెన్నెలయొక్క ప్రకాశమానమైనను, చకోరము=వెన్నెలపులుఁగులు, చలువఁగల + అట్టివాఁడు=శీతలత్వముఁగలవాఁడు. అగుటన్=అయిన కారణముచేత, ఎంతయున్=మిగుల, చందురున్=శీతమయూఖుని, కోరి=కాంక్షించి, తాము=ఆచకోరపక్షులు, అనుభవింపన్=ఆవెన్నెలలు భుజించుటకు, ఆసన్=ప్రేమతో, చేరవె=ఆచందురుని సమీపమునకు వెళ్ళవా? (పోవునని యర్థము)

తా. వెన్నెల పులుఁగులు చంద్రునివలనఁ దమకుఁ బ్రకాశమాత్రమే గాని, విశేషలాభము లేకున్నను (జల్లనివాఁడను హేతువుచేనా తనినాకఁ గోరునట్లు; ప్రభువు మంచివాడయినచో నాతనివలన ఫలమధికము లేకున్నను యపేక్షతో ప్రభువునేఁ గోరుచుండురు.

ఉ॥ బంధురసద్గుణాఢ్యుఁడొక । పట్టున లంపటనొందియైన దు
స్సంధిదలంపఁడన్యులకుఁ । జాలహితంబొనరించుఁగాక శ్రీ
గంధపుఁజెక్క రాగిలుచుఁ । గాదె శరీరుల కుత్సవార్థమై
గంధములాత్మఁబుట్టఁదఱు । గంబడియుండుటలెల్లభాస్కరా,

టీ. భాస్కరా! బంధుర=ప్రకాశించెడి, సద్గుణ=మంచిగుణములను, ఆఢ్యుఁడు=అధిపతియైనవాఁడు, ఒకపట్టునన్=ఒకానొకసమయమందు, లంపటన్=కష్టమును, ఒందియైనను=వహించియైనను, అన్యులకున్=ఇతరులకుఁ హితంబున్=బాగును (మంచిని) ఒనరించున్=చేయును। గాని, దుస్సంధిన్=చెడును, (ప్రతికూలమగుపనిని) తలంపఁడు=యోచింపఁడు, ఎట్లనగా; శ్రీగంధపుఁ జెక్క=మంచిగంధపుఁ జెక్క, రాగిలుచున్=ప్రకాశమానమగుచు, గంధములు=పరిమళములు, ఆత్మన్=మనస్సులో, పుట్టన్=కలుగునట్లుగా. తఱుగంబడి=తగ్గిపోయియుండుట, ఎల్లశరీరులకున్=సకలజీవులకును ఉత్సవ + అర్థము=వినోదముకొఱకు, ఐకాదె-అయియేకదా? (అవుననుట)

తా. మంచిగంధపుఁజెక్క పరిమళములు తనయందుఁగలుగునట్లుగా, హరించిపోవుచు జనులకుత్సాహంబుఁగలిగించునట్లు; సుజనాగ్రగణ్యుఁడు తానెన్నిసంకటములు పడుచున్నను, పరులకు హానిసేయక మేలుఁగూర్చును.

చ॥ బలముఁదొలంగుకాలమునఁ । ప్రాభవసంపదలెంతధన్యుఁడున్
నిలుపుకొనంగనోప; డది । నిశ్చయమర్జునుఁడీశ్వరాదులం
గెలిచినవాఁడు బోయలకుఁ । గీడ్పడిచూచుచుఁగృష్ణుభార్యలం
బలువురనీయఁడే నిలుపఁ । బట్టసమర్థుఁడుగాక భాస్కరా! 73

టీ. భాస్కరా! బలము=దైవబలము, తొలంగుకాలమునన్=నశించెడివేళయందు, ఎంతధన్యుడున్=ఎటువంటి పుణ్యుఁడును, ప్రాభవసంప

దలు=మదైశ్వర్యములు, నిలుపఁగొనంగన్=అపుఁగొనుటకు, చాలఁడు=సమర్థుఁడు కాజాలఁడు, అది=ఆకార్యము, నిశ్చయమే=సత్యమే, ఎట్లనఁగా; ఈశ్వరాదులన్=మహేశ్వరుఁడు మున్నగువారిని, గెలిచినవాఁడు=జయించినవాఁడైన అర్జునుఁడు=ధనంజయుఁడు, బోయలకున్=చెంచువారలకు, కీడ్పడి=వశీకృతుఁడై, చూచుచు=కనుఁగొనుచు, పలువురన్=అనేకమందిని, కృష్ణు భార్యలన్=శ్రీకృష్ణమూర్తి యిల్లాండ్రను, నిలువఁబట్టన్=వారించుటకు, సమర్థుఁడు కాక=తగినవాఁడుఁగాక, ఈయఁడే=ఒప్పగించినాఁడు కాఁడా? (ఇచ్చెనని అర్థము.

తా. మహేశ్వరాదుల నోడించిన పాండవమధ్యముఁడు కృష్ణుని భార్యలను రక్షింప నసమర్థుఁడైనట్లు, విధిబలముఁ జాలనప్పు డెంతటి ఘనుఁడైననుఁ దనగౌరవమునుఁ గాపాడుకొనలేడు.

చ॥ బలయుతుఁడైన వేళ నిజ।బంధుఁడు తోడ్పడుఁగాని యాతఁడే
బలముతొలంగెనేని తన । పాలిటి శత్రు; వదెట్లు పూర్ణుఁడై
జ్వలనుఁడు కానఁ గాల్చుతరి।సఖ్యముఁ జూపును వాయుదేవుఁ డా
బలియుఁడు సూక్ష్మదీపమగు।పట్టున నార్పదె గాలి భాస్కరా. 74

టీ. భాస్కరా! బలయుతుఁడు=శౌర్యవంతుఁడు, ఐనవేళన్, అయినకాలమందు, నిజబంధుఁడు=ప్రేమచుట్టము, తోడ్పడుఁగాని=సాయపడునుఁ

73. శ్రీకృష్ణబలరాముల నిర్యాణానంతరమునఁ జెంచువాండ్రు కృష్ణుని భార్యలనెత్తుకొని పారిపోవుచుండ నర్జునుండు నాబోయవాండ్రతో ఢీకొని సంగరమున నోడిపోవఁ బోయలా స్త్రీలనుఁ గొంపోయిరి. దైవానుగ్రహము లేని కతనఁ బశుపతిని గెల్చిన పార్థుఁడు బోయవాండ్రతో నోడిపోయెను.

గాని; అతఁడె=ఆచుట్టమే, బలము=శక్తిని, తొలంగ నేని=పాసి నేని, తన పాలిశత్రువు=తనకువిరోధియెయగును, అది + ఎట్లు=అది ఏలాగునఁగా, జ్వలనుఁడు=వీతిహోత్రుఁడు, పూర్ణుఁడై=నిండినవాడై, కానన్=కానమును (అరణ్యమును) కాల్చుతఱిన్=దహించెడి వేళయందు, వాయుదేవుడు=గాలి, సఖ్యము=చెలిమి=(మైత్రి) చూపును=చూపించునుఁగాని, అబలియుఁడు= బలశాలియగునాఅగ్నిదేవుఁడు, సూక్ష్మదీపము=చిన్నదివ్వె, అగుపట్టునన్= అయినప్పుడు, గాలి=వాయువు, ఆర్పదు + ఎ=పోఁగొట్టదా? (ఆర్పునని యర్థము)

తా. మిక్కిలి బలశాలియైన యగ్నిహోత్రుఁ డట విని దహించు వేళ యందుఁ బవనుఁడాతనికి దోడ్పడుచు, నాయగ్ని చిన్న దివ్వెయైనప్పుడా గాలియె విరోధియై, దానినార్పునటులఁ; జగంబున మానవుఁడు బల్లి దుఁడైయున్న కాలమున హితులుఁదోడ్పడుచు, బలముడిగినప్పుడు స్నేహి తుఁడే విరోధియై నాశనకారి యగును.

ఉ॥ బల్లిదుఁడైన సత్ప్రభువు • పాయకయుండినఁగాని రచ్చలోఁ
జిల్లరవారు నూఱుగురు • సేరినఁ దేజముఁగల్గ దెయ్యెడన్
జల్లని చందురుండెడసి • సన్నపుఁజుక్కలు కోటియున్న రం
జిల్లునె వెన్నెలల్ జగము • చీకటులన్నియుఁ బాయ భాస్కరా.

టీ. భాస్కరా! బల్లిదుఁడు=పరాక్రమసింహుఁడు,ఐనసత్ + ప్రభువు= యోగ్యతఁగల రాజేంద్రుఁడు, రచ్చలోన్=సభలో, పాయక=విడిచిపోక, ఉండినఁగాని=ఉండిననేఁగాని, చిల్లరవారు=క్షుద్దివారు, నూఱుగురు=నూఱు మంది, చేరినన్=కూడినప్పటికిని, ఎయ్యెడన్=ఎక్కడను, తేజము=కాంతి, కలుగదు=లభింపదు,ఎట్లనఁగా;చల్లనిచంద్రుఁడు=శీతమయూఖుఁడు.ఎడసి= లేక, సన్నపుఁజుక్కలు=అల్పకాంతిఁగలతారలు, కోటి =కోటిసంఖ్య,

ఉన్న=ఉండినను, వెన్నెలల్=చంద్రదకాంతులు, జగము చీకటులు అన్నియున్=లోకముయందలి యంధకారము లన్నియు, పాయక=పాసిపోవునట్లు, రంజిల్లును+ఎ=వెలుఁగునా? (వెలుఁగవని యర్థము.)

తా. చంద్రోదయమున మంచివెన్నెలలు కాయునుఁగాని, చక్కలెన్ని యున్నను ప్రపంచమందలి చీకట్లు పోవునటుల చంద్రిక వ్యాపింపదు అట్లే సత్ప్రభు వొక్కడుండిన సభ రంజిల్లునుగాని, చిల్లరజను లెందఱున్ననుఁ గాంతి వహింపదు.

చ॥ భుజబలశౌర్యవంతులగు • పుత్రులఁగాంచిన వారికెయ్యెడన్
నిజహృదయేప్సితార్థములు • నిక్కముచేకుఱుఁ గుంతిదేవికిన్
విజయబలాఢ్యుఁ డర్జునుఁడు • వీరపరాక్రమమొప్ప దేవతా
గజమునుదెచ్చి తల్లివ్రత • కార్యముదీర్పఁడె తొల్లిభాస్కరా.

టీ. భాస్కరా! భుజబల=బాహుబలము, శౌర్యవంతులు=పరాక్రమశాలు లగువారు, అగు పుత్రులన్=అయిన కుమారులను, కాంచినవారికిన్=కలిగిన వారికి, ఏ+ఎడన్=ఎక్కడైనను, నిజ + హృదయ + ఈప్సిత+అర్థములు= తన మనస్సునకు, ప్రియమైనపనులు, నిక్కము=సత్యముగ, చేకుఱున్= ఫలించును, ఎట్లులనఁగా; తొల్లి=పూర్వము, కుంతిదేవికి, విజయ=జయము చేతను, బల=పరాక్రమముచేతను, ఆఢ్యుఁడు=కూడియున్నవాఁడు, అర్జునుఁడు శ్వేతవాహనుఁడు, వీరపరాక్రమము=శౌర్యముఁతోగూడిన ప్రతాపము, ఒప్ప=విలసిల్లునట్లుగా, దేవతాగజమును=ఐరావతమును, తెచ్చి=కొనివచ్చి, తల్లివ్రతకార్యము, జననియొక్క వ్రతకార్యమును, తీర్పఁడు + ఎ=నెఱవేర్చిన వాఁడుకాఁడా? (నెరవేర్చెననుట.)

తా. కుంతీదేవికి మహా బలపరాక్రమశాలియగు నర్జునుండుండుటచేత నే మహేంద్రుని యైరావతంబునుఁ గొనివచ్చి తల్లివ్రతమును నెఱవేర్చినటులఁ

లోకంబున బలవంతులగు పుత్రులఁ గాంచిన వారికట్టి దుర్ఘట కార్యములయినను నెఱవేఱును.

ఉ॥ భూనుతులైన దేవతలు • పూర్వము కొందఱు వావివర్తనల్
మాని చరింపరో యనుచు • మానవులట్ల చరింపఁబోల దం
భోనిధులన్నియుం దనదు • పుక్కిటఁబెట్టె నగస్త్యుఁడంచు నా
పూనిక కెవ్వఁడోపు నది • పూర్వమహత్త్వము సుమ్ము భాస్కరా

టీ. భాస్కరా! భూనుతులు=జగంబున మానవులచే స్తుతింపఁబడు దేవతలు, కొందఱు=కొంతమంది, పూర్వము=తొల్లి, వావి=వరుసయు, వర్తనల్=గౌరవములను, మాని=విడిచి, చరింపరు + ఓ=చరింప లేదా, అనుచున్=అనిపలుకుచు, మానవులు=మనుజులు, అట్లు + అ=అసురలవలె, చరింపన్=సంచరించుటకు, పోలదు=తగదు, ఎట్లనఁగా; అగస్త్యుఁడు=అగస్త్యమహాముని, అంభోనిధులు అన్నియున్=సముద్రములన్నిటిని, తనదు పుక్కిటను=తననోటి యందు, పట్టెను + అంచున్=ఉంచెనని, ఆపూనికకున్=ఆకార్యమునకు, ఎవ్వఁడు=ఏమనుజుఁడు, ఓపున్=తగియుండును, (సమర్థుఁడు కాఁడనుట) అది=అట్లు చేయుట, పూర్వమహత్త్వము సుమ్ము. పూర్వులయొక్క గొప్పతనము సుమీ.

తా. తొల్లి దేవతలు కొందరు చెడుమార్గములఁ బ్రవర్తించిరిగదా యని మానవులుగూడ దుష్కృతములు చేయఁగూడదు. అగస్త్యమహాముని సముద్రములఁగల జలమంతయుఁ బుక్కిటఁబట్టినట్లు మనుజులెవ్వరేనిఁబట్టుటకు సాహసింపఁగలరా?

ఉ॥ భూపతి కాత్మబుద్ధి మదిఁ • బుట్టనిచోటఁ బ్రధానులెంత ప్ర
జ్ఞాపరిపూర్ణులైనఁ గొన • సాగదు కార్యము; కార్యదక్షులై

యోపిన ద్రోణభీష్మ కృప • యోధులనేకులుగూడి కౌరవ
క్ష్మాపతికార్యమేమయిన • జాలిరె చేయఁగవారు భాస్కరా

టీ. భాస్కరా! భూపతికిన్=మహీపతికి, ఆత్మబుద్ధి=స్వకీయమైన బుద్ధి, మదిన్=మనస్సునందు, పుట్టనిచోటన్=కలుగని ప్రదేశమున, ప్రధానులు=మంత్రులు, ఎంతప్రజ్ఞాపరిపూర్ణులు=ఎంత గొప్పబుద్ధితో నిండినవారు, ఐనన్=అయినను, కార్యము=పని, కొనసాగదు=నెఱవేఱదు, ఎట్లనఁగా:- కార్యదక్షులు=పనులు కొనసాగింపసమర్థులైన, ఓపిన=తగియున్న, ద్రోణ=ద్రోణాచార్యుఁలు, భీష్మ=భీష్మాచార్యులు, కృప=కృపాచార్యులు, (మొదలుఁగాఁగల) యోధులు=వీరులు, అనేకులు=చాలమంది, కౌరవక్ష్మాపతి కార్యము=దుర్యోధనుని పని, చేయఁగన్=నెఱవేర్చుటకు, చాలిరి + ఎ= తగిరే? (కార్యము సాధించలేరనుట.)

తా. కార్యాలోచన లేని సుయోధనుని పని నిర్వహించుటకుఁదగియున్నను భీష్మాదియోధులు చేయఁజాలనియట్లు ప్రభువునకు నిత్యమైన యాలోచనఁదలప నప్పుడు ప్రధానులెంత వివేకముఁగలవారయినను కార్యము నిర్వర్తింపఁజాలరు.

ఉ॥ భూరిబలాఢ్యుఁడైనఁదల • పోయక విక్రమశక్తి చేనహం
కారమునొందుటల్ తగవు • గాదతఁడొక్కెడమోసపోవుగా
వీరవరేణ్యుఁడర్జునుఁడు • వింటికి నేనధికుండనంచుఁ దా
నూరక వింటి నెక్కిడగ • నోపఁడు కృష్ణుఁడు లేమి భాస్కరా!79

టీ. భాస్కరా! తలపోయక=యోజనసేయక, భూరిబలాఢ్యుఁడు=మిక్కిలి బలవంతుఁడు, ఐనన్=అయినప్పటికిని, విక్రమశక్తిచేన్=పరాక్రమాతిశయముచే, అహంకారము=గర్వము, ఒందుటల్=పొందుటలు, తగవుఁగాదు=ఉచితిగాదు, అతఁడు=బలవంతుఁడు, ఒక్క + ఎడన్=ఒక్క

వోటు, మోసపోవుగా=హానిఁజెందుచుండును గదా, ఎట్టులనఁగా: వీరవరేణ్యుఁడు=బలశాలులలోనధికుఁడగు, పార్థుడు, వింటికిన్=బాణమునను, నేనున్=నేను, అధికుండన్ + అంచున్=మిక్కిలి నేర్పుఁగలవాఁడననుచు కృష్ణుఁడు లేమిన్=కృష్ణమూర్తి లేకుండుటచే, ఊరక=మిన్నక, వింటిన్=చాపమును, ఎక్కు + ఇడఁగన్=సంధించుటకయిన, ఓపఁడు=సమర్థుఁడు కాడు, (తగఁడని అర్థము.)

తా. పార్థుఁడు త్రిభువనములలోఁ దాను మేటి విలువిద్యా ప్రవీణుండనని గర్వించుచు, కృష్ణమూర్తి నిర్యాణానంతరము, బాణము నెక్కుపెట్టుటకైన సమర్థుఁడు కానట్లు, మనుజుండు తానెంత బల్లిదుఁడైనను, అందఱికన్న నేనే మిన్నయని గర్వపడఁగూడదు. అట్టి బలశాలిగూడ నొకానొకప్పుడు హానిఁజెందును.

ఉ॥ భ్రష్టునకర్థవంతులగు • బాంధవులెందఱుగల్గినన్ నిజా
దృష్టములేదు గావున ద • రిద్రతఁబాపఁగలేరు; సత్కృపా
దృష్టినినిల్పి లోకుల • కతిస్థిరసంపదలిచ్చు లక్ష్మియా
జ్యేష్టకదేటికిం గలుగఁ • జేయదుతోడనె పుట్టిభాస్కరా 80

టీ. భ్రష్టునకున్=పనికిమాలినవానికి, అర్థవంతులు=ధనవంతులు, అగు బాంధవుల్=అయిన చుట్టములు, గల్గినన్=కలిగియున్నప్పటికి, నిజాదృష్టము=తనయొక్క భాగ్యరేఖ, లేదుకావునన్=లేదుకాబట్టి, దరిద్రతన్=బీదతనమును, పాపఁగలేరు=నశింపజేయజాలరు, ఎట్లనఁగా; సత్ + కృపాదృష్టిని=మంచి ప్రేమతో గలిగినచూపును, నిల్పి=ఉంచి, లోకులకున్=మనుష్యులకు, అతి=మిక్కిలి, స్థిర=శాశ్వతమైన, సంపదలు=ఐశ్వర్యములు, ఇచ్చు లక్ష్మి=ఇచ్చునట్టిలక్ష్మీదేవి, తోడనే=జ్యేష్టతోఁగూడనె, పుట్టి=జన్మించి, జ్యేష్టకున్=దరిద్రదేవతకు, అదేటికిన్=అదియేకారణమున, కలుగఁజేయదు=ఒసఁగదు. (భాగ్యము)

తా. శ్రీదేవి కరుణాకటాక్షవీక్షణములను జనులపై నిల్పిమిక్కిలిసం పదలొసంగుచుఁ దనతోఁబుట్టువగు దరిద్రదేవతను భాగ్యముల నీయనటుల; కొఱఁగానివానికి ధనాధిపతులు చుట్టములైనను వాని పేదరికమునుఁబాపఁ జాలరు,

చ॥ మదిఁదనునాసపడ్డయెడ ♦ మంచిగుణోన్నతుఁడెట్టిహీనునిన్
వదలఁడుమేలుపట్టున న ♦ వశ్యము మున్ను గనాదరించుగా
త్రిదశవిమానమధ్యమున ♦ దెచ్చికృపామతి సారమేయమున్
మొదలనిడండెధర్మజుఁడు♦మూగిసురావళిచూడభాస్కరా 81

టీ. భాస్కరా! మంచిగుణోన్నతుఁడు=సద్గుణములచే నధికుఁడైన వాఁడు, తన్నున్=తన్నుగూర్చిన, మదిన్=మనస్సునందు, ఆసపడ్డయెడన్= ఆశించిన సమయమందు, ఎట్టిహీనునిన్=ఎటువంటి నీచుఁడైనను, వదలఁడు= విడిచిపెట్టఁడు, మేలుపట్టునన్=మంచియవసరమున, అవశ్యము=తప్పకుండ, మున్నుగన్=ముందుగా, ఆదరించున్ + కా=కరుణఁజూచునుగదా,(ఎట్లఁ నగా)ధర్మరాజు, కృపామతిన్=కరుణాస్వభావముతో, సారమేయమున్= కుక్కను, తెచ్చి=కొనివచ్చి, సురావళి=దేవతాసమూహము, పరివేష్టించి=

81. పరీక్షిత్తునకుఁ బట్టముగట్టిన తరువాత ధర్మరాజు సోదరుల తోను భార్యంగూడి వనంబున కరుగుచుండ, భీమార్జున ద్రౌపదులు లోక్కొ రొక్కరు ప్రాణములు విడిచిపెట్టిరి. అదినుండి తన్ను వెంటాడి వచ్చుచున్న కుక్కమాత్రము వానితోఁ బోవుచుండెను. అట్లుఁజచ్చిన సోదరులకై చింతింపక మతిశాంతముతోఁ బోగిన తరువాత, సురలు విమానారూఢులైవచ్చి, యిందునెక్కుమని ధర్మరాజునుఁ బ్రార్థింపగా, తన్ను నమ్మి వచ్చుచున్న శున కమును ముందు గూర్చుండఁబెట్టి, తానునుఁగూర్చుండి దేవలోకమునకుఁ బోయెను.

మూఁగి, చూడఁగ=చూచుచుండఁగా, త్రిదశవిమాన మధ్యమునన్ = మానమునందు, మొదలన్=మొదటను, ఇడఁడు + ఏ=కూర్చుండఁబెట్ట లేదా (కూర్చుండఁబెట్టెననుట).

తా. తన్ను నమ్మి వెంబడించి వచ్చుచున్న శునకమును ధర్మరాజు దేవతలచ్చెరువంద దేవతావిమానమునఁగూర్చుండఁబెట్టినట్లు, సుగుణవంతుఁడు ఎంతనీచుఁడైననుఁ దన్నాశ్రయించిన వానిని వదలక సమయముఁగల్గిన ప్పుడు ముందుగా నాతని నాదరించును.

ఉ॥ మాటలకోర్వఁజాలఁడభి • మానసమగ్రుఁడు ప్రాణహానియౌ
చోటులనైన దానెదురు • చూచుచునుండుఁగొలంకు లోపల
న్నీటమునింగినప్పుడతి • నీచములాడిన రాజరాజు పో
రాటమొనర్చి నేలఁబడ • డాయెనె భీమునిచేతభాస్కరా 82

టీ. భాస్కరా! అభిమాన సమగ్రుఁడు=అభిమానముచేనిండిన వాఁడు ప్రాణహాని=జీవముల కపాయము, ఔ చోటులనైనన్=అగునట్టిప్ర దేశములయందు నైనను, తాను=ఆ యభిమాన ధురంధరుఁడు, ఎదురు చూచు చుండున్=నిరీక్షించుచుండునుఁగాని, మాటలకున్=పలుకులకు, ఓర్వఁజా లఁడు=సహింపలేడు, రాజరాజు=దుర్యోధన మహారాజు, కొలంకులోప లన్=మడుగులోపల, నీటమునింగినప్పుడు=జలమునఁ దాఁగినప్పుడు, అతి= మిగుల, నీచములాడినన్=పరుషోక్తులాడిన, పోరాటము=యుద్ధము,(రణము) ఒనర్చి=సలిపి, భీమునిచేత=వాయునందనునిచేత, నేలన్=ధరయందు, పడఁ డాయెన్=పడలేదా? (మృతినొందినాడనుట)

తా. దుర్యోధనుఁడు సమస్తమునుఁ గోలుపోయి ప్రాణభీతిచే శోక కొలనులో జలస్తంభన విద్యచేఁ డాగియుండి పాండవుల నిష్ఠురాలాపముల సహింపలేక రణమొనర్చి, భీముని గదాఘాతములచేఁ దొడలు విఱిఁగి

మృతిఁజెందినట్లుఁ అభిమానవంతుఁడు ప్రాణములనైనఁ బాయునుగాని పరుల దూషణలను సహింపఁజాలఁడు.

ఉ॥ మానవనాథుఁడాత్మ రిపు • మర్మమెఱింగినవాని నేలినం
గాని జయింపలేఁ డరులఁ• గార్ముక దక్షుఁడు రామభద్రుఁడా
• దానవనాయకున్ గెలువఁ• దానెటు లోపుఁదదీయ నాభికా
స్థానసుధన్విభీషణుఁడు• తార్క్ష్యని చెప్పకయున్న భాస్కరా. 83

టీ. భాస్కరా! మానవనాథుఁడు=ధరాధిపతి, (ప్రభువు) ఆత్మరిపు మర్మమున్=నిజవిరోధియొక్క రహస్యమును, ఎఱింగిన వానిని=తెలిసికొనిన వానిని అరులన్=శత్రువులను (పగతురను) జయింపలేఁడు=చంపఁజాలఁడు ఎట్లనఁగా; విభీషణుఁడు=రావణుని తమ్ముఁడు, తార్క్ష్యని=(శ్రీరాముని) దరిఁజేరి, తదీయ=రావణుని సంబంధమైన, నాభికాస్థాన=బొడ్డుయందున్న, సుధన్=అమృతకలశమును, చెప్పకయున్నన్=చెప్పకుండినచో, కార్ముక దక్షుఁడు=ధనుర్విద్యాపారంగతుఁడైన, రామభద్రుఁడు = రఘురాముడు• గెలువఁగన్=జయించుటకు, ఎటులు + ఓపున్=ఎట్లు శక్తుఁడగును? (సమర్థుఁడు కాఁడనుట).

తా. రావణుని వక్షస్థలమున నమృతముఁగలదని విభీషణుఁడు శ్రీరామమూర్తికి నెఱుకఁజేయకయున్న, నెంతటి ధనుర్విద్యాకౌశలుఁడైనను రావణుని జయింప సాధ్యము కానటుల; రాజునకు శాత్రవమర్మ మెఱిఁగిన సేవకుఁడు లేనియెడల నాపృథివీపతి పగతుర జయింపఁజాలఁడు.

---

83. శ్రీరాముఁడు రావణసంహారముఁ చేయ నెంతఁ బ్రయత్నించినను సాధ్యముఁ గాకపోవుటచే, రావణుని హృత్కమలమునఁ గల యమృతము భేదించినఁ జచ్చునని విభీషణుఁడుఁ జెప్పఁగా, నంత రామచంద్రుఁడాగ్నేయాస్త్రమునుఁ బ్రయోగించి, యమృతమును హరించి, పిదప నాదనుజుని యవలీలఁగాఁ జంపివేసెను.

ఉ॥ మానవుఁడాత్మకిష్టమగు • మంచిప్రయోజన మాచరించుచోఁ
గానక యల్పుఁడొక్కఁడది • గాదని పల్కినవాని పల్కుకై
మానఁగఁజూడఁ డావని స॰ మంచితభోజనవేళ నీఁగ కా
లూనినవంటకంబుఁదిన•కుండఁగ నేర్పగునోటు భాస్కరా. 84

టీ. భాస్కరా! మానవుడు=మనుష్యుఁడు, (మర్త్యుఁడు) ఆత్మకున్=మనస్సునకు=(చిత్తమునకు) ఇష్టము=హితము, అగు మంచి ప్రయోజనము=అయినట్టి మంచి కార్యము, ఆచరించుచోన్=ఒనరించు సమయమందు, అల్పుఁడు=నీచుఁడు ఒక్కఁడు కానక=ఆకార్యమువలన ఫలితము నెఱుంగక, అది=ఆపని. కాదని=చేయఁగూడదని, పల్కినన్=నుడివినచో, వాని పల్కుకై=వాని పలుకులకోసము, ఆపని=ఆప్రయోజనము, మానఁగన్=విడిచిపెట్టుటకు, చూడఁడు=యోచింపడు. ఎట్లనఁగా; సమంచిత=మంచి భోజనవేళన్=భక్షణసేయుకాలమందు, ఈఁగ కాలు + ఊనినవంటకము=ఈఁగ కాలుమోపిన, వంటకంబు=తినెడి పదార్థము, తినకుండగన్=భుజింపమానుట నేర్పు + అగునోటు=నేర్పరితనమగునా? (కాదని యర్థము.)

తా. మానవుఁడు భుజించునప్పుడా యన్నముపై నీఁగ వ్రాలినంత మాత్రమున నావంటకమును విడువక భుజించునట్లు; తన కిష్టమైన కార్యమును మనుజుఁడు గావించునప్పుడొక నీచుఁడు వలదని వచించినను తత్కార్యమును విడువరాదు

ఉ॥ మానినిచెప్పున న్నెలయుకై • మాలినవాఁడటుచేసినన్ మహా
హానిఘటించు నేఘనుని • కైన నసంశయ ముర్విపైఁ గృపా
హీనతఁబల్కినన్ దశర • థేశ్వరుఁడంగనమాటకై గుణాం
భోనిధిరాముఁ బాసి చని•పోవఁడె శోకముతోడ భాస్కరా. 85

టీ. భాస్కరా! ఎఱుకమాలినవాఁడు=అవివేకియగువాఁడు, మానిని=తనభార్య, ఎట్లు చెప్పును=ఏరీతిగాఁ బలుకునో, అటు చేసిన౯=అప్రకారముగ నాచరించినయెడల, ఉర్విపై౯=భూమియందు, ఏఘనునికైనను=ఎంత గొప్పవానికయినను, మహాహాని=గొప్పయాపద, ఘటించు౯=సంభవించును, అసంశయము=సందియ మెంతమాత్రమును లేను, ఎట్లనఁగా; కృపాహీనత౯=ప్రేమలేకపోవుటచే, పలికిన౯=చెప్పఁగా, అంగనమాటకై, భార్యయగు కైకేయి వచనములకు, దశరథ + ఈశ్వరుఁడు=దశరథమహారాజు=గుణాంభోనిధి౯=గుణసముద్రుని, రాము౯=రామభద్రుని, పాసి=వదలి, శోకముతోడ౯=దుఃఖభరముచే, చనిపోవఁడే=ప్రాణములఁబాయ లేదా ? (చచ్చెనని యర్థము.)

తా. దశరథమహారాజు, భార్యయగు కైకేయి యాజ్ఞాప్రకారము సుగుణధాముఁడగు శ్రీరాముని గుట్టలఁబట్టించి, తద్వియోగములను భరింప లేక ప్రాణంబులఁ గోలుపోయినట్లు, అవివేకియగువాఁడు, భార్యానుసారముగఁ బ్రవర్తించినచోఁ దానెంతటి ఘనుఁడైనను, గొప్పయాపదలకు బాల్పడును.

చ॥ మునుపొనరించు పాతకమ • మోఘము జీవులకెల్లఁబూనియా
వెనుకటి జన్మమందనుభ • వింపక దీఱదు; రాఘవుండు వా
లినిబడనేసి తా మగుడ • లీల యదూద్భవుఁడై కిరాతుచే
వినిశితబాణపాతమున • వీడ్కొనఁడేతన మేనుభాస్కరా. 86

టీ. భాస్కరా! మునుపు=పూర్వము, ఒనరించుపాతకము=జేసినదుష్కృత్యము, అమోఘము=వృథాకాదు, జీవులకు౯ + ఎల్ల౯=సమస్తప్రాణులకు, పూని = ప్రయత్నించి, ఆ వెనుకటి జన్మమందు౯=తరువాత జన్మమందును, అనుభవింపక = జెందక, తీరదు = కనుపడదు, (అనుభవింపకఁ

దప్పదు.) (ఎట్లనఁగా) రాఘవుండు=శ్రీరాముఁడు, వాలిని=వాలియను మర్కటప్రభువును, పడక + ఏక=మృతినొంది, తాక=తాను, రాముఁడు మగుడక=మర్థల, లీలక=విలాసముగ, యదూద్భవుఁడు + ఐ=యాదవకుల మునఁబుట్టినవాఁడయి, కిరాతుచేక=బోయవానిచేత, వినిశిత=పదునైన, బాణ=బాణముయొక్క, పాతమునక=దెబ్బచే, తనమేను=తనశరీరమును, వీడ్కొనఁడు + ఎ=విడిచిపెట్టలేదా? (మృతిఁజెందెననుట).

తా. రామమూర్తి వాలినిఁజంపిన పాతకంబుచేఁ గృష్ణావతారమున ఎఱుకవానిబాణపాతముచే దేహమును విడిచిపెట్టినట్లు; ఎంతటిమహానుభావుఁడైనను తొలిజన్మమునఁజేసిన పాపఫలమును మరల జన్మమున ననుభవింపక దీరదు.

ఉ॥ రాకొమరుల్ రసజ్ఞునిఁ ది • రంబుగ మన్ననునుంచినట్లు భూ
లోకమునందు మూఁఢు దమ•లోపలనుంపరు; నిక్కమేకదా
చేకొని ముద్దుగాఁజదువు • చిల్కను బెంతురుగాక, పెంతురే
కాకమునెవ్వరైన శుభ•కారణ సన్మునిసేవ్య భాస్కరా. 87

టీ. శుభకారణ=మంగళప్రదమునకాధారమైనవాఁడా! సత్ + ముని సేవ్య=సన్మునిశ్వరులచే స్తుతింపఁబడువాఁడా! రాకొమరుల్=రాజకుమారులు, మన్ననక=గౌరవముతో, తిరంబుగక=నిలుకడగా, (స్థిరముగ) రసజ్ఞునిక=రసికుని, ఉంచినట్లు=నిలుపుకొనినట్లు, భూలోకమునందుక=ధరలో, మూఢు

---

86. వాలి=సుగ్రీవున కగ్రజుఁడు. వీరిరువురు నింద్రునివలన యహల్య యందుఁబుట్టినవారు. గౌతమునిశాపమువలనఁ గోతులైరి. సీతాన్వేషణంబున సుగ్రీవుఁడు రాముని శరణుఁగోరుటచే, సీతామనోహరుఁడు వాలినొకకోలచే గూలజేసెను.

=మూర్ఖుని, తమలోపలన్=తమగృహములో, ఉంపరు=ఉంచరియును, సక్కము + ఎ=నిజమేకదా! (ఎట్లనఁగా) ఎవ్వరైనన్=ఎటువంటివారయినను, చేకొని=కరమునఁదాలుంచుకొని, ముద్దుగన్=ముచ్చటగా, చదువు=పఠించుచున్న, చిలుకను=పికమును, పెంతురుగాని=పోషింతురుగాని, కాకమున్=వాయసమును, పెంతురా=పెంచెదరా? (పెంచరనుట).

తా. లోకములో మనుష్యులు ముద్దుపలుకులఁ బలుకుచుండెడి చిలుకను బెంచెదరుగాని, కాకినిఁ బెంచరు. అట్లే, ప్రభువులు రసజ్ఞతఁగలవారి నాదరింతురుగాని, మూర్ఖులఁ జేరఁదీయరు.

ఉ॥ లోకములోన దుర్జనుల । లోతు నెఱుంగక చేరరాదు సు
శ్లోకుఁడు చేరినం గవయఁ జూతురు చేయుదు రెక్కసక్కముల్
కోకిలఁ గన్నచోట గుమిఁగూడి యసహ్యపుఁ గూతలార్చుచుం
గాకులు తన్నవే తఱిమి కాయము తల్లడమంద భాస్కరా. 88

టీ. భాస్కరా! లోకమునన్=లోకమందు, సుశ్లోకుఁడు=సత్కీర్తిఁగలవాఁడు, దుర్జనులలోతును=ఖలుల యభిప్రాయమును, ఎఱుంగక=తెలిసికొనక, చేరరాదు=దరిఁజేరఁగూడదు, చేరినన్=ఒకవేళఁ బోయినయెడల, కవయన్=కలియఁబడుటకు, చూతురు=అలోచింతురు, ఎక్కసక్కముల్=వికటపుమాటలు, (వేళాకోళపుఁ బలుకులు) చేయుదురు=పచింతురు, ఎట్లనఁగా; కాకులు; కోకిలన్=కోయిలను, కన్నచోటన్=చూచినతావునందు, గుమిగూడి=ప్రోవయి, అసహ్యపుగూతలు=చెడుకూతలను, అర్చుచున్=కూయుచు, కాయము=(దాని) శరీరము, తల్లడము + అందన్=భీతులునట్లుగా, తఱిమి=వెన్నాడి, తన్నవె=తన్నవా? (పాదములతోఁదాడింమననుట)

తా. లోకమున మంచివాఁడు దుర్జనుల యూహాను గ్రహించకుండ వారలఁ జేరరాదు. అటులజేరినచోఁ గాకులు కోకిలమును గాంచినంత నేఁ

జుట్టుముట్టి కేకలు వేయుచు వెంబడించి పదతాడనముఁ గావించునట్లు, దుష్టాత్ములు సజ్జనుని దఱిఁజేరి యపహసింతురు.

ఉ॥ లోనుదృఢంబుగాని పెనులోభిని నమ్మి యసాధ్యకార్యముల్
కానక పూనునేనతఁడు గ్రక్కునఁగూలును; నోటిపుట్టిపై
మానవుఁడెక్కి పోవ నొకమాటుబుటుక్కున ముంపకుండు నే
తానొకలోతునం గెడసి దానిఁదరింపఁగలేక భాస్కరా. 89

టీ. భాస్కరా! లోను=మనస్సు, దృఢంబుగాని=గట్టిదికాని, పెనులోభిని=మిక్కిలిఁ బేరాసఁగలవానిని, నమ్మి=విశ్వసించి, అసాధ్య=సాధింప శక్యముగాని, కార్యము=పనులను, కానక=ఎఱుంగక (తెలిసికోక) పూనునేని=ప్రయత్నించునేని, అతఁడు=ఆమనుజుఁడు, గ్రక్కునన్=తత్క్షణమే, కూలున్=నాశనమగును, ఎట్లనఁగా; మానవుఁడు=మనుష్యుఁడు, ఓటిపుట్టిపైన్=మిక్కిలిశిథిలమైన పడవమీదను, ఎక్కి=అధిరోహించి, పోవన్=వెళ్లఁగా, తాను=ఆపడవ, అప్రవాహమును తరింపన్ + కన్ లేక=దాటలేక ఒకమాటు=ఒకసారి, బుటుక్కునన్=బుటుక్కుమని, ముంపక + ఉండును + ఎ=దానిపైనున్న మర్త్యుని ముంపకుండునా? (ముంచివేయుననియర్థము.)

తా. శిథిలమగు పడవమీద మనుష్యుఁడెక్కి గంభీరమగు నొక జలప్రవాహమును దాట యత్నించెనేని, యాపడవ జలంబు నందారగి వానిని ముంచివేయునట్లు; మనుజుఁడు కడులోభివానిని విశ్వసించి కార్యనిర్వాహణకై ప్రయత్నించెనేని వానిమూలమునఁ దప్పక నశించును.

ఉ॥ వంచనయింతలేక యొటువంటి మహాత్ముల నాశ్రయించినన్
గొంచెమెకాని మేలు సమకూడ దదృష్టములేనివానికిన్
సంచితబుద్ధి బ్రహ్మ వనిశంబును వీఁపున మోచునట్టి రా
యంచమడ దమ్ములతూండ్లుఁదిన నాతోఁగదా ఫలమేమి భాస్కరా

టీ. భాస్కరా! వంచన=శక్తివంచన, (కృత్రిమము) ఇంత లేక=కొంచెమైనను లేకుండ, ఎటువంటిమహాత్ములన్=ఎంతటిమహానుభావులను, ఆశ్రయించినన్=భక్తిశ్రద్ధలఁ జేరినను, అదృష్టము లేనివారికిన్=అభాగ్యులగు మానవులకు, కొంచెమె కాని=కొద్దియేఁ గాని, మేలు=మంచి, సమకూడదు=ప్రాప్తించదు. ఎట్లనఁగా; సంచితబుద్ధిన్=పూర్వార్జితజ్ఞానముచేత, అనిశంబుఁ=నిత్యమును, వీపునన్=వెన్నుచేత, బ్రహ్మను=నలువను, మోచునట్టి=మోయుచున్న, రాయంచయుఁ=రాజహంసయు, తమ్మితూండ్లు=దుంపతూండ్లు, (తామరకాడలు) తిననాయెఁగదా=భక్షించుటయయ్యెఁగదా! ఫలము=లాభము, ఏమి=ఏమికలదు? (ఫలము లేదనుట.)

తా. లోకమును సృజించెడి బ్రహ్మననిశంబునుఁ దనవీపుపై నిడుకొని మోయుచున్న రాజహంస తామరతూండ్ల నాహారముఁ జేసికొనినట్లు; అదృష్టహీనుఁ డెంతటిభాగ్యవంతునిఁ జేరినను విశేషలాభము లేదు.

ఉ॥ వట్టుచుఁదండ్రి యత్యధమ • వర్తనుఁడైనను గాని వానికిం
బుట్టినపుత్రకుండు తన • పుణ్యవశంబున దొడ్డధన్యుఁడౌ;
నెట్టనమఱ్ఱివిత్తు మును • పెంతయుఁ గొంచెము దానఁబుట్టు నా
చెట్టు మహోన్నతత్వమునుఁ • జెందదె శాఖలనిండి భాస్కరా.

టీ. భాస్కరా! తండ్రి=జనకుఁడు, వట్టుచుఁ=కృశించుచు, అతి=మిక్కిలి, అధమవర్తనుఁడు=దుష్ప్రవర్తనఁగలవాఁడు, ఐనన్ + కాని=అయినప్పటికిని, వానికిన్=అయ్యధమప్రవర్తకునకు, పుట్టినపుత్రుఁడు=జన్మించిన కొమారుఁడు, తనపుణ్యవశంబునన్=తొల్లి చేసినపుణ్యమువలన, దొడ్డధన్యుఁడు=గొప్పకృతార్థుఁడు, ఔఁ=అగును, ఎట్టు + అనఁ=ఏలాగుననఁగా, మఱ్ఱివిత్తు=వటబీజము, మునుపు=పూర్వము, ఎంతయుఁ=మిక్కిలి, కొంచెము=చిన్నది, దానన్=ఆవిత్తునందు, పుట్టునా చెట్టు=పుట్టినయామఱ్ఱిచెట్టు,

శాఖలన్=కొమ్మలచేత, నిండి=విజృంభించి, (అవరింపఁబడి) మిగులపొడవును, చెందను + ఎ=పొందదా? (పొందునని యర్థము.)

తా. మఱ్ఱివిత్తు కొద్దిదైనను దానినుండి పుట్టినది గొప్పవృక్షమగునట్లు జనకుఁడు యల్పుఁడైనను వానికిఁగలిగిన కుమారుఁడు పూర్వపుణ్యముచే దొడ్డవాఁడగును.

చ॥ వలనుగఁ గానలందుఁ బ్రతివర్షమునం బులి నాలుగైదు పి
ల్లలఁగను దూడనొక్కటి నిలంగనుధేనువు రెండుమూడు నే
డుల కటులైన బెబ్బులికుటుంబము లల్పములాయె నాలమం
దలుగడువృద్ధిఁజెందవెటియధర్మముధర్మముఁదెల్పభాస్కరా

టీ. భాస్కరా! వలనుగన్=బాగుగా, కానలందున్=అడవులయందు, పులి=వ్యాఘ్రము, ప్రతివర్షమున్=ఏఁటేఁటను, నాలుగైనుపిల్లలన్=నాలుగేసి, అయిదేసికూనలను, కనున్=కనుచుండును, (ప్రసవించును.) ధేనువు=గోవు, రెండుమూడు నేడులకున్=రెండేసి, మూడేసివత్సరములకు, దూడనొక్కటిన్= ఒకలేగను, మాత్రమే, కనున్=ఈనుచున్నది, అటులైనన్=అవిధముగానైనను, అధర్మమున్=(పులుల) అన్యాయమును, ధర్మమున్=(ఆవుల) ధర్మమును, తెల్పన్=తెలియఁజేయుటకు, బెబ్బులికుటుంబములు=వ్యాఘ్రముల సంతానవృద్ధి, అల్పములు + ఆయెన్=తక్కువాయెను, ఆలమందలు=గోసమూహములు, కడున్=మిక్కిలి, వృద్ధిన్ + చెందవు + ఎ = అభివృద్ధిపొందలేదా? (వృద్ధియగునని అర్థము.)

తా. దుష్టప్రవర్తనగల మృగములు ప్రతిసంవత్సరమును నాలుగైదు పిల్లలనుఁబెట్టుచున్నను వాటిసంతతి వృద్ధిగాంచకున్నది. ధర్మప్రవృత్తిగల యావులురెండుమూడేండ్ల కొకొక్కదూడనుఁగలిగినను వాటిసంతతి మిక్కిలి

యభివృద్ధిఁ గాంచుచున్నది. అట్లే, అధర్మవర్తనఁ గలవానివంశము పాడగును. ధర్మబుద్ధిగలవానివంశము వృద్ధిఁ జెందఁగలదు।

చ॥ వలవదు క్రూరసంగతి య • వశ్యమొకప్పుడు సేయఁబడ్డచోఁ
గొలఁదియెకాక యెక్కువలు • గూడవు; తమ్మలపాకులోపలం
గలసినసున్నమించుకయ • కాకమఱించుక యెక్కువైనచో
నలుగడఁ జుఱ్ఱుచుఱ్ఱుమని • నాలుకపొక్కకయున్నె భాస్కరా.

టీ. భాస్కరా! క్రూరసంగతి=చెడ్డస్నేహము, అవశ్యము=ముఖ్యము వలవదు=మానవలెను. ఒకప్పుడు=ఒకసమయమందు, చేయఁబడ్డచోన్=చేసినయెడల, కొలఁదియెకాని=కొంచెమేగాని, ఎక్కువలు = అధికముగాజేయుటలు, కూడవు=చెల్లవు, ఎట్లనఁగా; తమ్మలపాకులో=తమలపాకులందు, కలచినసున్నము=రాచినసున్నము, ఇంచుకయు కాక=కొంచెమైన, గాని, మఱించుక=ఇకఁగొంచెము, ఎక్కువైనచోన్=అధికమైనయెడల, నలుగడలన్=నలువైపుల, నాలుక=జిహ్వ, పొక్కక+ఉన్నె=పొక్కకుండునా? (బొబ్బలెక్కకనుట.)

తా. దుర్జనసహవాసము తప్పక విడిచిపెట్టవలెను. సందర్భానుసారముగఁ జేయవలసివచ్చినను అంటీయంటక నుండవలెను. అధికానురాగము తమలపాకులయం దెక్కుడుసున్నము పడినయెడల నాలుకపొక్కి బాధించునట్లు కీడుఁ గలుగును.

ఉ॥ వానికివిద్యచేత సిరి • వచ్చెనటంచును విద్యనేర్వఁగాఁ
బూనినఁ బూనుఁగాక తన • పుణ్యముచాలక భాగ్యరేఖకుం
బూనఁగ నెవ్వఁడోపు; సరి • పోఁచెవిపెంచునుఁగా కదృష్టతా
హీనుఁడు కర్ణభూషణము • లెట్లుగడింపఁగనోపు! భాస్కరా. 94

టీ. భాస్కరా! వానికిన్=అపూరుషునకు, విద్యచేతన్=చదువువలన, సిరి=సంపద, వచ్చెన్ + అటంచున్=కలిగినదని, విద్యన్=చదువును, నేర్వన్ + కాన్=అభ్యసించుటకు, పూనినన్ + పూను + కాక=ప్రయత్నించిన యత్నించుచునుగాక, తనపుణ్యము=పూర్వజన్మవలనఁ గలిగిన సుకృతము, చాలక=సరిపోకున్నచో; భాగ్యరేఖకున్=అదృష్టపు గీతనిమిత్తము, పూనఁగన్=ప్రయత్నించుటకు, ఎవ్వఁడు=ఏమనుష్యుఁడు, ఓపున్=సమర్థుఁడగును, (అనఁగాఁ గాఁడని యర్థము.) సరిపో=సరేకాని, అదృష్టతాహీనుఁడు=భాగ్యము లేనివాఁడు, చెవిపెంచునుఁగాక=చెవికన్నము పెంచునుగాక కర్ణభూషణములు=కర్ణాభరణములు, గడింపఁగన్=సంపాదించుటకు, ఎట్లు + ఓపున్ = ఏరీతి సమర్థుఁడగును, (తగదని యర్థము:)

తా. భాగ్యహీనుఁడగు మనుష్యుఁడు కర్ణముల కన్నముఁ బెంచినఁ బెంపఁగలఁడు గాని, కర్ణకుండలములు సాధింప నేరనట్లు చదువువలన నొకరికి సంపదలు ప్రాప్తించినవని, తానుఁగూడ విద్యాభ్యాసమొనర్చి ధనార్జనఁ జేసినఁ జేయఁగలఁడుకాని, తొల్లింటి సుకృతము లేనిదే యైశ్వర్యమును సంపాదింపఁజాలఁడు

ఉ॥ సంతతపుణ్యశాలి నొక • జాడనుసంపద వాసిపోయి తా
నంతటఁబోక నెట్టుకొని • నెప్పటియట్ల వసించియుండు; మా
సాంతమునందుఁ జందురుని • నన్నికళల్ పెడఁబాసిపోయినం
గాంతివహింపఁడోటు? తిరు • గంబడి దేహమునిండ భాస్కరా! 95

టీ. భాస్కరా! సంపద=ఐశ్వర్యము, సంతత=మిగుల, పుణ్యశాలిన్=సుకృతముచే నొప్పువానిని, ఒకజాడను=ఒకవిధముగా. పాసిపోయి=విడిచిపోయి, తాన్=ఆ భాగ్యము, అంతటన్ + పోక= అంతమాత్రమునఁబోక, నెట్టుకొని=పాదుకొని, అప్పటియట్ల=వెనుకటిరీతినె. వసించియుండున్=

నివసించియుండును, ఎట్లనఁగా; మాస + అంతమునందున్=అమవసనాఁడు, చందురున్=కలువలరేయిని, అన్నికళల్=పదునారుకళలు, పెడబాసిపోయినన్=విడిచిపోయినను, తిరుగంబడి=మరల, (పగుడ) దేహము=బింబము,నిండన్=పూర్ణమగునట్లుగా, కాంతిన్=కళను వహింపఁడు + ఒకో=పొందఁడా? (చెందునని యర్థము.)

తా. చంద్రుని కళాపూర్ణమంతయు మాసాంతమున వదలిపోయినను తనకళామృతమును సురలకిచ్చినట్టి సుకృతముచే వెండియుఁ గ్రమక్రమముగా సహజకళను సంపూర్ణముగఁ బొందునట్లు, ప్రతిదినమును పుణ్యములనుఁ జేయువాని కొకరీతిగా సిరిలభించును.

చ॥ సకలజనప్రియత్వము ని • జంబుగఁగల్గినఁ బుణ్యశాలి •కొ
క్కొకయెడ నాపదైనఁదడ • వుండదు వేగమెపాసిపోవుగా
యకలుషమూర్తియైనయమృ• తాంశుడు రాహువుతన్నుమింగినం
డకటకమానియుండడె? దృ•ఢస్థితినెప్పటియట్లభాస్కరా. 96

టీ, భాస్కరా! సకలజన ప్రియత్వము=జనులందరియొక్క ప్రేమకుఁ బాత్రుండైయుండుట, నిజంబుగన్=నిశ్చయముగా, కల్గినన్=కల్గినయట్టి పుణ్యశాలికిన్=పుణ్యాత్మునకు, ఒక్కొక్కయెడన్=ఒకానొకవేళయందు, ఆపద=ఇక్కట్టు, ఐనన్=కలిగినను, తడవుఉండదు=ఎక్కువకాలము నిలువదు, వేగమున + ఎ=తత్క్షణమే, పాసిపోవున్=నశించునుగదా, ఎట్లనఁగా, అకలుష=నిష్కళంకమైన (కళంకరహితమైన) మూర్తి=రూపముఁగలవాఁడు ఐన + అమృత + అంశుడు = అమృతకిరణుండైన చంద్రుఁడు, తన్నున్=తన్ను, రాహువు=రాహువుఅనెడి గ్రహము, మింగన్=మింగినప్పటికిని, టకటక=తొందరపాటును, మాని=విడిచి, దృఢస్థితిన్=స్థిరమైనయునికిచేత, ఎప్పటియట్లు=మునుపటివలెనె, ఉండదు + ఎ= కళాపూర్ణుఁడైయుండఁడా? (ఉండునని యర్థము.)

తా. అకలుషమూర్తియగు చంద్రుఁడు రాహువుచే మ్రింగఁబడి కళారహితుఁడైనను, మరలఁ గొద్దికాలములోనె సహజకాంతినిఁ గాంచునట్లు; ప్రజానుకూలుండైన వాని కొకప్పుడుఁ జిక్కులు తటస్థించినను, వెంటనే సుఖోపవిష్టుండగును.

ఉ॥ సన్నుతకార్యదక్షుఁ డొక • చాయ నిజప్రభ యప్రకాశమై
యున్నపుడైన లోకులకు • నొండొక మేలొనరించు సత్వసం
పన్నుఁడు భీముఁ డాద్విజుల • ప్రాణముకావఁడె యేకచక్రమం
దెన్నికగా బకాసురుని • నేపునరూపడఁగించి భాస్కరా. 97

టీ. భాస్కరా! సన్నుత=స్తుతింపఁబడుచున్న (పొగడఁబడుచున్న) కార్య=పనియందు, దక్షుఁడు=సమర్థుఁడైనవాఁడు, ఒకచాయన్=ఒకపట్టున నిజప్రభ=తనకాంతి, అప్రకాశము+ఐ=స్పష్టముకానిదై, ఉన్నపుడు + ఐనన్=ఉన్నసమయమందైనను, లోకులకున్=జనులకు, ఒండొకమేలు=ఒకానొకయుపకారము, (ఎట్లులనఁగా) సత్వసంపన్నుఁడు=బలముతోఁగూడియున్న, భీముఁడు = కుంతీపుత్రుఁడు, ఏకచక్రమందున్=ఏకచక్రమను పురమందు, ఎన్నికగాన్=ప్రసిద్ధిగా, బకాసురున్=బకుఁడను రాక్షసుని, ఏపునన్=పరాక్రమముచేత, రూపు + అడగించి=చంపి, ఆద్విజుల ప్రాణములు=బ్రాహ్మణ యసువులను, కావఁడు+ఎ=రక్షింపలేదా? (కాపాడెననుట.)

తా. ఏకచక్రపురంబున భీముఁడు భిక్షాటనము సేయుచు, నచ్చటివారికెల్లరకు విరోధియగు బకుఁడను రాక్షసునిఁ జంపి బ్రాహ్మణబాలుని రక్షిం

---

97. తా. బకాసురుఁడు - వీఁ డొకదైత్యుఁడు. ఏకచక్రపుర సమీపారణ్యమున నివసించుచుండెను. వీఁ డప్పురియందుగల మనుష్యుల దినమున కొక్కనివంతుగా నేర్పఱచుకొని భక్షించుచుండెను. భీముఁ డాయుద నెఱింగి పోయి యారాక్షసునిఁ జంపి పురరక్షణముఁ గావించెను.

చినట్లు, లోకమున నేర్పరియగు వాఁడొకొకవేళ నసమర్థుఁడైయున్నను, లోకుల కుపకారము సేయుచుండును.

చ॥ సరసగుణప్రపూర్ణునకు • సన్నపుదుర్గుణ మొక్కవేళయం
దొరసిననిట్లు నీకుఁదగు • నోయని చెప్పినమాన నేర్చుఁగా
బురదయొకించుకంత తముఁ • బొందిన వేళలఁ జిల్లవిత్తుపై
నొరసిన నిర్మలత్వమున • నుండవె నీరములెల్ల భాస్కరా. 98

టీ. భాస్కరా! సరసగుణప్రపూర్ణునకున్=మనోహరమగు గుణములచే నిండినవానికి, సన్నపుదుర్గుణము=చిన్న చెడుగు, ఒక్కవేళయందున్=ఒకసమయమందు, ఒరసినన్=ప్రాప్తమయినచో, ఇట్లు నీకున్ తగున్ + ఓ=ఇట్లు సేయుట నీకుఁదగునా, అని చెప్పినన్=అని వచించినచో, మానన్ + నేర్చున్ + కా=విసర్జించును గదా! బురద తాన్=అపంకము (బురద) ఒకించుకంత=కొంచెము, తమున్=తమ్ము, పొందినవేళన్=పొందినట్టి తరుణముల యందు, చిల్లవిత్తు=ఇందుపుగింజ, పైన్=తనమీద, ఒరసినచోన్=తాకినచో, నీరములు ఎల్లన్=ఉదకములన్నియు, నిర్మలత్వమునన్=శుభ్రత్వముచే, ఉండవు + ఎ=ఉండవా? పరిశుభ్రముగా నుండుననుట.)

తా. జలము లొకప్పుడు బురదగానున్నను, ఇండుపుగింజ గంధము బురదనీటిలోఁ గలిపిన నెట్లు నిర్మలముగా నుండునో, అట్లే గుణవంతున కొదుర్గుణమున్న నది యెవ్వరైనఁ జెప్పినచో దానిని వర్జించుకొనఁగలఁడు.

చ॥ సరసదయాగుణంబుఁగల • జాణ మహింగడు నొచ్చియుండియుం
దఱుచుగ వాని కాసపడి • దాయగఁ జత్తురు లోకులెట్లనం
జెఱకురసంబుగానుఁగను • జిప్పిలిపోయిన మీఁదఁ బిప్పియై
ధరఁబడియున్నఁ జేరవె ము•దంబునఁ జీమలు పెక్కు భాస్కరా.

టీ. భాస్కరా! సరసదయాగుణంబు=మంచికృపాస్వభావము, కలజాణ=కలిగిన నేర్పుగలవాఁడు, మహిన్=భూమియందు, కడున్=మిక్కిలి, నొచ్చియుండియున్=నలగియున్నప్పటికిని, తరచుగన్=ఎక్కువగా, లోకులు=జనులు, వానికిన్=అబాధపడుదాత నిమిత్తము, ఆసపడి=అశించుకొని, డాయన్+క+వత్తురు=సమీపించెదరు, ఎట్లు+అనన్=ఏలాగు ననఁగా, గానుగన్=గానుగవలన, చెఱకురసంబు=ఇక్షురసముయొక్క నీరు, చిప్పిలిపోయినన్=కారిపోగా, మీదన్=పిమ్మట, పిప్పి+ఐ=రసావిహీనమైనదయి, ధరన్=భూమిమీద, పడియున్న=పడినప్పటికి, పెక్కుచీమలు=అనేకపిపీలికములు, ముదంబునన్ = సంతోషముతో, చేరవు+ఏ=చేరియుండవా?

ఇక్షురసమంతయు గానుగవలనఁ బిండఁబడిన వెనుక నాపిప్పియంతయు చీమలపాలగునట్లు; దాత ద్రవ్యహీనుఁడైనను ప్రజలాతని వద్దకేఁ జేరుచుండెదరు.

ఉ॥ సారవివేకవర్తనల • సన్నుతికెక్కిన వారిలోపలం
జేరినయంత మూర్ఖులకుఁ • జేపడ దానడ; యెట్టులన్నఁగా
సారములోన హంసములు • సంగతినుండెడి కొంగపిట్టకే
తీరునఁగల్గ నేర్చును ద • దీయగతుల్ దలపోయభాస్కరా. 100

టీ. భాస్కరా! సార=బలమైన, వివేక=యోగ్యాయోగ్యముల వివరముగలఁ, వర్తనలన్=నడవడులచే, సన్నుతికిన్=పొగడ్తకు, ఎక్కినవారిలోపలన్=ఎక్కినమనుజులలో, చేరినయంతన్=కూడినమాత్రముచే, మూర్ఖులకున్=యోగ్యత నెఱుంగనివారికి, ఆనడ=ఆమంచిప్రవర్తన, చేపడదు=ప్రాప్తముకాదు, (ఎట్లనఁగా) కాసారములోనన్=తటాకములో, హంసములసంగతిన్=రాయంచలయొక్క చెల్మితో, ఉండెడి కొంగపిట్టకున్=

వసించెడి బకమునకు, తదీయగతుల్ = ఆహంసనడకలు, తలపోయఁగ = ఆలోచింపఁగా, ఏతీరునఁ = ఏవిధమున, కల్గనేర్చును = లభించును? (కలుగవని యర్థము.)

తా. కొలనులో రాయంచలఁగూడి నిత్యముసంచరించుచున్నను హంసగమనములు కొంగలకు లభింపనట్లు; లోకమున జ్ఞానులతో నెన్నిదినములు, చెలిమిఁజేసినను, మూర్ఖుల కాసత్ప్రవర్తన రాఁబోదు.

ఉ॥ స్థానము తప్పివచ్చునెడఁ • దానెటువంటి బలాఢ్యుఁడున్ నిజ
స్థానికుఁడైన యల్పునిక • తంబునవైనను మోసపోవుఁగా;
కానలలోపలన్ వెడలి • గంధగజంబొకనాఁడు నీటిలోఁ
గానక చొచ్చినన్ మొసలి • కాటునలోఁబడదోటుభాస్కరా.

టీ. భాస్కరా! తాఁ = తాను, ఎటువంటిబల + అఢ్యుఁడున్ = ఎంతటిబలముఁగలవాఁడయినను, స్థానమున్ = తనచోటును, తప్పి = విడిచి, వచ్చునెడన్ = వచ్చినయెడల, నిజస్థానికుఁడు = తనతావుననున్నవాఁడు, ఐనయల్పునికతంబున నైనన్ = అయినట్టి నీచునిచేతనైనను, మోసపోవును = వంచింపఁబడును, ఎట్లనఁగా; గంధ = మదించిన, గజంబు = గజేంద్రుఁడు, ఒకనాఁడు = ఒకదినమందు, కానలలోపలన్ = అరణ్యములలోనుండి, వెడలి = బయలుదేరి, కానక = చూడక, నీటిలో, చొచ్చినన్ = కొలనులోఁజొరఁబడఁగా। మొసలి కాటునన్ = నక్రముయొక్కనోటికి,లోఁబడదోటు = లొంగిపోయినదికాదా?

---

101. తొల్లి గజేంద్రుఁడు స్త్రీగజంబుల వెంటగొనివచ్చి దప్పిచేనొకతటాకంబున జలముఁ గ్రోలుచుండెను. ఆకొలనులోనివసించియున్న మొసలియొకటి గజేంద్రుని కాలొడిసిపట్టి వదలకున్న, నా గజముతన శక్తి కొలంతయు ధారవోసి వేయివత్సరములు మకరితో బోరాడినను జయింప లేక హరినిఁ బ్రార్థించెను. శ్రీమహావిష్ణువుఁ దనచక్రముచే నక్రమును సంహరించి గజరాజును రక్షించెను.

తా. గజేంద్రుఁడు బలముఁగలవాఁడైనను, స్వస్థానమును విడిచి, కొలనులో దిగినంత మాత్రమున నల్పజంతువగు మొసలికిఁజిక్కినటులు, లోకములో మనుష్యులు తామెంత బలముఁగలవారయినను తమస్థానమునువిడిచి వచ్చినప్పుడు క్షుద్రులమూలముననే వంచింపఁబడుదురు.

చ॥ సిరిఁగల వానికెయ్యెడలఁ • జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱిఁగుఱిగాదు పేదలకు • నేర్పునఁజేసిన సత్ఫలంబగున్
వఱపునవచ్చి మేఘుఁడొక • వర్షమువాడిన చేలమీఁదటం
గురిసినఁగాక యంబుధులఁ • గుర్వఁగ నేమిఫలంబు భాస్కరా

టీ. భాస్కరా! సిరి=సంపద, కలవానికిన్=కలిగియున్నవానికి, ఏ + యెడలన్=ఎట్టివేళల యందును, మేలు=శుభము, చేసిన=ఒనర్చినచో, అది=ఆ మేలు, నిష్ఫలంబగున్=ప్రయోజనము లేకపోవును, నెఱి=నిండయిన, గుఱికాదు=లక్ష్యముండదు, పేదలకున్=బీదవారికి, నేర్పునన్=ఉపాయముచేత, చేసినన్=శుభముఁగూర్చినచో, సత్ఫలము=మంచిలాభము అగున్=అగును, ఎట్లనఁగా; మేఘుఁడు=జలదము, వఱపునన్=కఱవుని కాలమున, ఒక వర్షమున్=ఒకవానను, వాడిన చేలమీఁదటన్=పాడువారియున్న సస్యములమీఁద, కురిసినన్ + కాక=వర్షించిననేఁగాని, అంబుధులన్=సముద్రములయందు, కుర్వఁగన్=వర్షింపఁగా. ఏమిఫలంబు=ఏమిప్రయోజనము, కలదు. (లాభము లేదనుట).

తా. వానలు లేక యెండిపోవుచున్న సస్యములపై మేఘుఁడు కురిసినచో లాభముండునుఁగాని, సముద్రములలో నెంతవర్షించిన నేమిఫలము. అట్లే మనుజులు నిరుపేదలకు మేలుఁజేసిన ఫలంబుగాని, ధనికునకుఁ జేసిన నేమిలాభము లేదు.

చ॥ సిరివలెనేని సింహగుహ • చెంతవసించినఁజాలు సింహముల్
కరులవధింపఁగానచటఁ • గల్గునుదంతచయంబుముత్యముల్
హరువుగనక్కబొక్కకడ • నాశ్రయమందిన నేమిగల్గెడుం
గొరిసెలుదూడతోఁకలును•గొమ్ములునెమ్ములుగాక భాస్కరా

టీ. భాస్కరా! సిరి=భాగ్యము, వలెనేని=కావలసినచో, సింహ గుహ చెంతన్=సింహము వసించెడి, గుహయొక్క చెంతన్=సమీపమున వసించినన్=నివసించినచో, చాలున్=తగును, ఏమనఁగా, సింహముల్, కరులన్=గజములను, వధింపఁగాన్=చంపుచుండుటచేత, దంతచయంబు=కరులయొక్క దంతముల సమూహము, ముత్యముల్=గజముల కుంభస్థలముల నున్న, ముత్యములు, అచటన్=ఆస్థలమున, కల్గును దొరకును, ఎట్టులనఁగా; హరువుగన్=చక్కఁగా, నక్కబొక్కకడన్=జంబుకంబు యొక్క బొక్కకడ, ఆశ్రయము + అందినన్=ఆశ్రయించినచో, గొరిసెలు=గిట్టలు, దూడతోఁకలును=లేగల, పుచ్ఛములును, కొమ్ములు=చచ్చినజంతువులకొమ్ములును, ఎమ్ములు=ఎముకలు,లు (శల్యములు) కాక=తప్ప, ఏమిగల్గెడున్=ఏమిలభించును, (ఏమియు దొరకదనుట).

తా. ఐశ్వర్యమునుఁ గోరువారు, సింహము గుహయొద్దకేగిన లాభమున్నదిగాని, నక్కబొక్కదగ్గఱఁ గనిపెట్టుకొనియున్న నేమి ప్రయోజనము లేదు.

చ॥ స్థిరతరధర్మవర్తనఁ • బ్రసిద్ధికి నెక్కినవాని నొక్కము
ష్కరుఁడతినీచవాక్యములఁ • గాదనిపల్కిన నమ్మహాత్ముఁడుం
గొఱతవహింపఁడయ్యెడ; న•కుంఠితపూర్ణసుధాపయోధిలో
నరుగుచుఁగాకి రెట్టయిడి•నందున నేమికొఱంత భాస్కరా

టీ. భాస్కరా! ఒక్కమనుష్యుఁడు=ఒకమూర్ఖుఁడు, స్థిరతరధర్మ
వర్తనన్=మిగుల దృఢమైన న్యాయవర్తనము చేత, ప్రసిద్ధికిన్ + ఎక్కినవా
నికిన్=కీర్తి నొందినవానిని, అతినీచవాక్యములన్=మిక్కిలి కఠినోక్తులచే
కాదు అని=నిందఁజేసి, పల్కినన్=నుడివినను, అయ్యెడన్=ఆసమయమ
నందు, ఆమహాత్ముఁడున్=అఘనుఁడును, కొంతన్=లోపమును, వహిం
పఁడు=చెందఁడు, ఎట్లనఁగా, కాకి=వాయసము, అరుగుచున్=పైకెగిరిపో
వుచు, అమిత=ఎక్కువ. పూర్ణ=నిండయిన, సుధాపయోధిలోన్=అమృ
తసరస్సున, రెట్ట ఇడినందునన్=మలము విడిచినంతమాత్రమున, ఏమికొ
అంత=ఏమిలోపము. (లోపము లేదనుట)

తా. వాయసము గగనమార్గమున నెగిరి పోవుచు నమృతవారాశి
యందు రెట్టవైచినను లోపమెంతమాత్రముఁ గలుఁగనటుల; ధర్మాత్ముని నీ
చుఁడొకఁడు నిందించిన మాత్రమున నాతనికేమియులోటు గలుగదు.

చ॥ స్ఫురతర కీర్తిమంతులగు • పుత్రులఁగాంచినఁగాక మూఢము
ష్కరులఁగనంగఁ దేజములు • గల్గవుగా: మణికీలితాంగుళా
భరణము లంగుళంబుల శు • భస్థితిఁబెట్టినఁగాక గాజుటుం
గరములు పెట్టినందునవికాసముఁగల్గునటయ్య భాస్కరా. 105

టీ. భాస్కరా! స్ఫురతర=మిక్కిలి ప్రకాశముగానున్న- కీర్తి
మంతులు=యశస్కు లైనట్టివారు, అగు పుత్రులన్=అయినట్టి కుమారులను
కాంచినన్ + కాక=కాంచినచో లాభముగాని మూఢ=మూర్ఖులగు,
ముష్కరులన్=అజ్ఞానులను, కనంగన్=కనినట్టయిన, తేజములు=ప్రతిష్ఠలు,
కల్గవుగా=కలుగనేరవుగదా! ఎట్లనఁగా; మణి=రత్నములచే, కీలిత=స్థగితమై
న, (కూర్పఁబడిన)అంగుళాభరణములు=అంగుళీయకములు, (ఉంగరములు)
అంగుళంబులన్=వేళ్లయందు, శుభస్థితిన్=మంగళకరముగా, పెట్టినఁ

గాక=ధరించిన నేఁగాని, గాజుటుంగరములు, పెట్టినందునన్=ధరించుకొనుటవలన, వికాసము=అందము (వెలుగు) కలుగునటయ్య=కలుగునా? (కలుగదనుట.)

తా. చేతి వ్రేళ్ళను రత్నఖచితములగు నుంగరంబుల ధరించిన నోఁ గాంతినిచ్చునుఁ గాని, గాజుటుంగరములు దాల్చిన వికాసము కలుగదు. అట్లే యశోవంతులగు పుత్రులఁగాంచినఁ బ్రఖ్యాతివచ్చునుగాని, మూర్ఖులఁగన్నవో లాభము లేదు.

ఉ॥ హీనకులంబునందు జని • యించినవారికి సద్గుణంబులె
న్నేనియుఁగల్గియున్న నొక • నేరముచెందకపోదు; పద్మముల్
భానుతిఁగాంచియున్ బురదఁ•బుట్టుటవల్ల సుధాకరోదయం
బైనసహ్యమొందవె ప్రి•యంబునఁజూడఁగలేక భాస్కరా. 108

టీ. భాస్కరా! హీనకులంబునందున్=శవక్కవజాతియందు,జనియించినవారికిన్=పుట్టినవారికి, సద్గుణంబులు=మంచిగుణములు ఎన్నియుకల్గినన్=ఎన్ని గుణములు కల్గియున్నను, ఒక నేరము=ఒకశిక్ష, చెందకపోదు=కలుగకపోదు, ఎట్లనఁగా; పద్మముల్=కమలములు (తామరపూవులు)భానుతిన్=భూప్రజలయొక్క స్తోత్రమును, కాంచియున్=చెందుచున్నను, బురదన్=అడుసునందు, పుట్టుటవల్లన్=జనియించుట నేడు దోషముచే, సుధాకరోదయంబునన్=చంద్రోదయమైనప్పుడు, ప్రియంబునన్=ప్రేమతో చూడఁగాలేక=చూడలేక, అసహ్యము ఒందవె=ఏహ్యముగా నుండదా?

తా. పద్మములుమిగుల ఖ్యాతిఁగాంచినను బుర్దయందు బుట్టుటచేత కలిగిన పాపముచే చంద్రోదయమునందనిష్టముతోఁ గాంచుచుండునుగాని, ప్రియముతోఁ జూడనటులః; గొడ్డువంశమున జనించిన మానవుఁడెన్నివద్గుణములుఁగలవాడైనను నేదియో యొక హీనగుణముల వడియుండును.

ఉ॥ ఇంచుక నేర్పుచాలక వి • హీనతఁ జెందిన నాకవిత్వముల్
మించువహించె నీకతన • మిక్కిలియెట్లనఁ దోలుబొమ్మలన్
మంచివివేకి వానితెర • మాటుననుండి ప్రశస్తరీతి నా
డించిన నాడవేజనుల • డెందమునింపవె ప్రీతిభాస్కరా. 109

టీ. భాస్కరా! ఇంచుక = కొంచెము, నేర్పు = చతురత, చాలక = లేక, విహీనతన్ = నీచత్వమునను, చెందిన = పొందిన, నాకవిత్వముల్ = నాకవనముగూడ, నీకతన్ = నీశుభనామమునుఁ బద్యాంతములజేర్చినహేతువుచేత, మిక్కిలి = ఎక్కువగా, మించువహించెన్ = ప్రకాశించెను, ఎట్లనఁగా; మంచివివేకి = మంచిబుద్ధిఁగలవాఁడు, తోలుబొమ్మలన్ = చర్మవిగ్రహములను, వానితెరమాటునన్ = వానియొక్క యవనికచాటున, ఉండి = వసించి, ప్రశస్తరీతిన్ = మంచిపద్ధతిన్, ఆడించినన్ = నృత్యముచేయించినయెడల, ఆడవే = నాట్యముసేయవా? ప్రీతిన్ = సంతోషముచే, జనులడెందము = ప్రజలయొక్కహృదయమును, నింపవు + ఎ = పూరింపవా; నిండిలపలేవా? (నిండుచున్నవని అర్థము.)

తా. గుణవంతుఁడు తెరచాటుననుండి నేర్పుతోఁ దోలుబొమ్మనాడించి ప్రజానందమొసంగునట్లుగా, నీకరుణవలన నాకవిత్వము మానవులకు మహానందము గలిగించి విరాజిల్లకుండునా? (ఓసూర్యభగవానుఁడా! నీవాట్లాడించిన, నట్లాడితినేఁగాని నేనెందును స్వతంత్రుండనుఁగానని యీపద్యాంతమునఁ దనయిష్టదేవుని భక్తిపూర్వకముగా స్తుతించి శతక రచనము విరమించెను.)

టీకా తాత్పర్య సహితమగు
భాస్కర శతకము
సంపూర్ణము.